

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

72 మార్చి 30

నిర్వహణ: 'సాహితీ మిత్రులు' ఒక రూపాయి

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

30

మార్చి 1972

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

84 పేజీలు

1 రూపాయి

ముఖచిత్రం: ఎన్నికలు

అస్థి పంజరాలే మిగిలిన పేదల
మూల్గులను పీలుస్తున్న ఇనుప ముక్కలు
ఉక్కుగోళ్ళు.
చిత్రకారుడు : చంద్ర

ప్రతులకు, వివరాలకు:
4/729 కుమార్‌పల్లి
హనుమకొండ
వరంగల్–1 (ఆం. ప్ర.)

సంవత్సర చందా: పది రూపాయలు
అర్ధ సంవత్సర చందా: ఆరు రూపాయలు
విడిప్రతి: ఒక రూపాయి

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayamu,
J. P. N. Road, Warangal-2 (A.P.)

ఎన్నికలు

ప్రజాసేవ చేయడానికి నాయకులు మళ్లీ పోటీపడుతున్నారు. పందెపు గుర్రాలవలె పల్లెటూళ్ల చుట్టూ, పట్టణాలనిండా పరుగులు తీస్తున్నారు. పేద ప్రజానీకం సమస్యలుతప్ప మరేమీ పట్టనినోళ్లూ, చేతులూ సోషలిజాన్ని పచ్చనోట్ల ద్వారా పంచుతున్నాయి. జెండాలు మొసలికన్నీళ్లు పెట్టుకుంటున్నాయి.

రాజభరణాలు రద్దుచేసిన "ప్రజాపాలక పక్షం" కాంగ్రెసు తరఫున ఒక్క మధ్యప్రదేశ్‌లోనే పదిహేడుగురు రాజులు పోటీచేస్తున్నారు. నిన్నటి తెలంగాణ ప్రజాసమితి యివ్వాటి కాంగ్రెస్. ఇవ్వాటి సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి రేపు ఏరూపమెత్త గలదో "కాలమెరుగును, ధరణీగర్భమెరుగు" సి.పి.ఐ.కి మార్క్సిస్టులను ఓడించడమే ధ్యేయం. నిన్నటిదాకా కాంగ్రెసుకు భిన్నమనుకున్న మార్క్సిస్టుపార్టీ, జనసంఘం బంగ్లాదేశ్ యుద్ధంతో ఇందిరా విజయాన్ని కాళీ విజయంగా గానంచేసిన వందిమాగధులై పోయాయి.

అంతర్జాతీయదృక్పథంకన్నా జాతీయ దురహంకారం క్షేమమనుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ముసుగు వేసుకున్న ప్రభుత్వాల సామ్రాజ్యవాద స్వభావాన్ని గుర్తించటం కష్టం.

అందుకే యివ్వాళ మనకు కులం పార్టీలేగాని సిద్ధాంత పార్టీలు లేవు. ఏ ఎన్నికలపార్టీకీ ఒక సిద్ధాంతం, ఒక లక్ష్యం, ఒక నీతి లేవు.

శోషలిజంవల్లిస్తున్న నోళ్ళచూసి పీడితులు వీళ్లలో యేవొక్కరి చేతులైనా శ్రమజీవుల రక్తంతో తడవకుండా వున్నాయాఅని అనుమానిస్తున్నారు.

దోపిడీకి పెట్టుకున్న ముద్దుపేరు ఎన్నికలు. ఐదేళ్లకొకసారి, ఇంకా మధ్య మధ్య చాలసార్లు, చాలతీర్లు మననెవ్వరు దోచుకోవాలో నిర్ణయించి చట్టబద్ధమైన దోపిడీ శాసనసభలకు ప్రతినిధులుగా పంపించాలి!

కళ్ళు తెరిచినవారెవ్వరూ కంట్లో వేలుపెట్టినవాని నోట్లో వేలు పెట్టరు. సమసమాజం సాధించుకోవడానికి పోరాటమే రాజీలేనిమార్గమని తెలుసుకున్న పీడితులు విప్లవాన్ని ఎన్నికలతో వాయిదావెయ్యరు, బహిష్కరిస్తారు.

ఎడ్గార్ స్నో

సామ్రాజ్యవాద ప్రభుత్వాలు ప్రజలను ఎప్పుడూ తప్పుదార్లు పట్టించే అన్నిసాధనాలు విరివిగా వాడుకుంటాయి. సామ్యవాద దేశాలగురించి, ఆదేశాల్లోని ప్రజలగురించి, తమ వలసదేశాల్లోని ప్రజల భావాలగురించి, అసలు తమదేశంలోనే ప్రజల ఆలోచనల గురించి ఎప్పుడూ సరియైన అవగాహనను ఇవ్వవు. కాని ప్రపంచ చరిత్రను వలసవిధాన చరిత్రగా మలచాలనుకున్న ఇంగ్లండ్ యివ్వాళ ఎంత వెల్లకిలబడ్డదో చూసినపుడు, ఇవ్వాటి చరిత్రను సామ్రాజ్యవాద చరిత్రగానో, ధనస్వామ్య చరిత్రగానో, కమ్యూనిజం నిరోధక చరిత్రగానో చిత్రించాలనుకుంటున్న అమెరికా ప్రభుత్వ అహంకారంకూడ ఎంత నీటిబుడగో సులభంగా పసిగట్టవచ్చు.

నల్లమందు భాయీలని తెల్ల చరిత్రకారులు ఎగతాళిచేసిన జనచైనాపై ఉదయించిన అరుణతార పోరాటచరిత్ర (చైనాపై అరుణతార) ప్రపంచానికి వివరించి అజ్ఞానాన్ని, అపోహలను విడగొట్టిన ఎడ్గార్‌స్నో తూర్పుపడమర ప్రజల మధ్యన వంతెన.

'Red star over china,' 'On the other side of the River' పుస్తకాలద్వారా తనను, చైనాను ప్రపంచానికి పరిచయంచేసి, చైనాలో సాంస్కృతిక విప్లవంతర్వాత ఇటీవల మళ్లా చైనాకువెళ్లి మావోతో ఇంటర్వ్యూచేసి సామాన్యంగా బూర్జువా చరిత్ర చైనాగురించి చిత్రించే అపార్థాలనుంచి సత్యాన్ని కాపాడి బయటపెట్టిన ఎడ్గార్ స్నో చనిపోయాడు.

సామ్యవాద విప్లవకేంద్రంగా వెలుగుతున్న అరుణతార జనచైనావైపు ఆశగా ఆసియాదేశ పీడితులు కళ్ళుతెరచి పోరాటం అందుకుంటున్నవేళలో ఆ మహత్తర జనశక్తిగురించి అనుభవపూర్వకంగా నిష్పాక్షికంగా చెప్పగలిగిన స్నో చనిపోవడం ఒక షాక్. అయితే సూర్యుడు తనవైపుచూపే వేలుకు వెలుగిచ్చినట్లుగానే విప్లవమే చరిత్రను మాత్రమేకాదు చరిత్రకారులనుకూడ సృష్టించుకుంటుంది.

మేధావి బాధ్యత

ఇరువై ఒకటో శతాబ్దంలో ప్రపంచం ఎట్లా వుంటుంది? —చైనా ఎట్లా వుంటే అట్లా. చైనా ఎట్లావుంటుంది— చైనాలో ఎప్పటికప్పుడు నిర్వహించబడే సాంస్కృతిక విప్లవాలపై ఆధారపడి వుంటుంది. దానికి జవాబు— అని (China in 2001) "2001 సంవత్సరంలో చైనా" లోరాసినడాక్టర్ హన్‌సుయాన్ ఇంకా ఎంతోమంది సుప్రసిద్ధ పత్రికారచయితలు. మేధావులు ఇవ్వాళ జనచైనా నూతన ప్రజాస్వామ్యంగురించి ఆలోచిస్తున్నారు. ప్రపంచసామ్రాజ్యవాద పీఠాధిపతి నిక్సన్ పిలవనిపేరంటంగా చైనాకువెళ్ళాడు. తూర్పుగాలి ప్రభంజనంగా వీస్తున్నది. ఈ దేశంలోని మేధావుల ఆలోచనల ద్వారాలు సమయానికి తెరుచుకోకపోతే ఆ హోరు ద్వారాలను బద్దలుగొట్టి ప్రవేశిస్తుంది. అందాక వేచి వుందాం. తొందరేముంది అనేవాళ్లు మేధావులుకాదు. మేదకులు. కవులు, మేధావులు ఇపుడు వీస్తున్న గాలిగురించేకాదు ఆ గాలి రేపు రగిలించనున్న జ్వాలలగురించికూడ ప్రజలకు వివరించాలి. అపుడుగాని భావ విప్లవం విప్లవంలో భాగంకాదు.

మనకెలాంటి రాజకీయాలు కావాలో, ఏలాంటి రాజకీయ మార్గం కావాలో ఆలోచకులు, కళాకారులు, యువకులు, విద్యార్థులు, శ్రమజీవులు నిర్ణయించకపోతే బ్లాక్‌మార్కెటీర్లు, పైరవీకార్లు, పాతజమీందార్లు, కొత్త పరిశ్రమలవాళ్ళు అన్నిరకాల దోపిడీ సొరెగాళ్ళు అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటారు. అప్పుడు పై వాళ్ళలో ఎంత చిత్తశుద్ధీ, నిజాయితీవున్నవాళ్ళయినా యీ సమాజం కుళ్ళిపోయిందని తిడ్తే అది బాధ్యతలేనిమాటే అవుతుంది. ఆచరణ అనేగీటురాయితో చరిత్రను, అనుభవాన్ని కొలుస్తూ సమాజప్రవాహంలో కొట్టుకపోతూకాకుండా నిలుస్తూ, నడిపిస్తూ, ప్రజల్నించి నేర్చుకునే బాధ్యత యీ నాటిమేధావి స్వీకరించాలి.

— సంపాదకుడు

ఎన్నికల పాటలు

ఎన్నికలు, ఎన్నికలు
ఎన్నిసార్లెన్నికలు ఎన్నితీర్లెన్నికలు
ఏండ్లుమారెను తప్ప ఏమి మారిందని
ఉన్నోళ్ళు, ఉన్నోళ్ళు ఊళ్ళు పంచుకొనిరి
గరీబోళ్ళకు మటుకు కన్నీళ్ళు మిగిలినవి
కన్నీళ్ళు మిగిలినవి, కట్టాలు మిగిలినవి
మాటలే మిగిలినవి ఓట్లే మిగిలినవి
ఎన్నికలు, ఎన్నికలు ఎన్నితీర్లెన్నికలు
ఎన్నికలు, ఎన్నికలు ఎన్నిసార్లెన్నికలు
పంచాయితెన్నికలు, పార్లమెంటెన్నికలు
అసెంబ్లీకెన్నికలు ఆస్తులకు ఎన్నికలు
పస్తులకు ఎన్నికలు, సిస్తులకు ఎన్నికలు
సిగ్గెగ్గులేకుంటె సాలుపొడుగుత కూడ
నెగ్గినా ఎన్నికలె తగ్గినా ఎన్నికలె
ఎవనబ్బసొమ్మని ఎవడడగ పోయాడు
ఏర్లయ్యి పారేను సారాయి, పెట్రోలు
ఎవని కడుపులనొప్పి ఎవడడుగ పోయాడు
కడుపులో తలపెట్టి ఓట్లడుగుడే తప్ప
ఎవనిపానం యిలువ ఎన్నికల కేమెరక
తలలెగిరి పోతేమి, తాకట్టు పడితేమి
కొంపలారితెనేమి కూలిపోతేమి
బడుగు బతుకులకేది పానాలయిలువ
బతుకు బతికిందెపుడు బాగుపడ్డది ఎపుడు

ఇంకేమి ఆశరా కన్నీళ్లు యింకె
యీపుమీదా పచ్చిపుండాయె కట్టాలు
ఎన్నికల పార్టీలు దోపిడీ పార్టీలు
ఎన్నికల పార్టీలు ధోకాల పార్టీలు
ఇన్నాళ్ళ అనుభవం ఏమి చెప్పిందిరా
ఎన్నికల ఎత్తుగడ ఎన్నుపోటేనురా
ఎదిరించుడే తప్ప ఎత్తుగడలేదురా
వర్గపొత్తేలేదు పోరాటమే తప్ప
పోరాట మేరూపు ఎత్తితీరాలెనో
పోలీసు నడుగరా యోధుణ్ణి అడుగు
పొరుగు దేశాన్నడుగు పీడితుణ్ణడుగు.

ఓట్లు

ఒద్దురా ఓట్లెయ్య వొద్దురా రైతన్న
ఒద్దురా ఎన్నికలు వొద్దురా కూలన్న

ఎన్నికలు ఉన్నోళ్ళ బవురూపులేషాలు
ఎన్నికలు పేదోళ్ళ కళ్ళలో కారాలు ॥ఒద్దురా॥

అవుపాలన్నిటిని అయ్యలే తాగినురి
దూడనోట్లకెలేవు మనకేమి మిగులురా ॥ఒద్దురా॥

దీపాలు గాలిలో దేవుణ్ణి నమ్ముకొనె
చుక్కలాకాసాన చెట్టేమొ కదలదు ॥ఒద్దురా॥

తెల్లోళ్ళు తోకలై యింకోళ్ళు మేకలై
ఎలిసిపోయిన ఎరుపు ఎన్నికల కెగటాకె ॥ఒద్దురా॥

పోరాట మొక్కటే పీడితుల బాటరా
పోరందె రాదురా పేదలకు రాజ్యం ॥ఒద్దురా॥

ఎండుటాకులు - సుడిగాలి

కె. వి. రమణారెడ్డి

మన సమాజాన్నిచూస్తే నాకు గుర్తువచ్చేది ఏమిటో చెప్పనా దయ్యాలమర్రి!

ఏళ్ళు పూళ్ళు గడిచినా, యుగాలూ మన్వంతరాలూ మారినా, పరిముఖమైన దాని మొక్కట్లు మాత్రం అలాగే ఉండిపోయాయి. ఆదిమత్వం అనేది సుగుణమను కొంటే వేరేమాట. కొందరి కళ్లు ముచ్చెనగుంటలో ఉన్నాయంటే గూడా 'శాస్త్రుల్లు' పిసుక్కుంటున్నారు. ఇలాంటి వాళ్ళు ఆధునికులుగా వ్యవహరించగలగడం 'లోకవింత!' మార్పు కావాలనేవాడికి మందిబలం ఉంటుందని అనుకోవడం వెర్రి మార్పురా. మోకాలడ్డేవాడికి మాత్రం మందీమార్బలం హెచ్చు. నిజానికే అది మందబలం ఏటి కెదురీదడం ప్రయాసతోగూడిన పని. వాలునబడిపోవడం శవానికీ మాబాగా తెలుసు.

మనం జీవిస్తూన్న ధనస్వామ్యవ్యవస్థకు సరిపడే పద్ధతులైనా మనకు పట్టుబడ లేదనే నాచింత. ఈవ్యవస్థ మరీకిరాతకంగా పరిణమించని ప్రారంభదశలో, తత్పూర్వ వ్యవస్థమీద భరాటా సాగించింది– దాని ఆచార వ్యవహారాలమీద ఆలోచనారీతులమీద మూర్ఖతమీద మూఢతమీద అగ్గిభరాటా! ఆ అడవిచిక్కు తియ్యబోయింది అభివృద్ధి పొందిన ఇతర దేశాల్లోలాగే అభివృద్ధికి ఉపక్రమించిన మనదేశంలో కూడా. ఈ కొత్త ప్రయత్నాలను పునరుజ్జీవనదశ అని పేర్కొంటున్నాం. బ్రహ్మసమాజం, ఆర్య సమాజం, ప్రార్థన సమాజం వగైరా మతసంస్కరణ సంస్థలు. రామమోహనరాయ్, రణడే, రమాబాయి, సుబ్రహ్మణ్య అయ్యరు, భారతి, వీరేశలింగం వంటి సంఘ సంస్కర్తలు. మన సమాజవృక్షాన్ని ఇంకా అంటిపెట్టుకొని ఉండిన పండుటాకులను, ఎండుటాకులను సుడిగాలి వీచినట్టు నేలరాల్చసాగారు. అయితే ఈ సంస్కరణోద్య మాలు సమాజాన్ని పూర్తిగా మార్చజాలక పోయాయి. పథనిర్దేశమే చేశాయిగాని గమనాన్ని మనకు వదిలాయి మధ్యలో జాతీయోద్యమంలోకి దూరివచ్చిన హైందవ పునరుద్ధరణ ధోరణి, సంస్కరణల కన్నింటికీ అడ్డునిలిచింది. అంతేగాక, రాజకీయ స్వాతంత్ర్యం ముందా, సంఘ సంస్కరణం ముందా అనే వివాదాంశం తలెత్తింది. జాతీయోద్యమంలోని వితండవాదులు సంఘ సంస్కరణ వాదులమీద కత్తిగట్టి కక్ష సాధించారు. సంస్కర్తలకూ, 'లిబరల్' సాంఘిక విధానాలకు శాసనరూపమిస్తూ

వచ్చిన బ్రిటిష్ పాలకులకూ మధ్యగల పరస్పర విశ్వాసం, సంస్కర్తల 'రాజభక్తి', రాజకీయ స్వాతంత్ర్యవాదుల చేతికి ఆయుధంగా పనికివచ్చింది. ఫలితం, సంస్కరణలు త్రిశంకు స్వర్గంగా మిగిలిపోవడం।

గాంధీవాదం మత పరంగానూ సంఘ పరంగానూ హైందవ పునరుద్ధరణ ధోరణికి పరాకాష్ఠ. రాజకీయాల్లో ఎలాగో ఈ విషయాల్లోకూడా గాంధీ, తిలక్ మానస పుత్రుడు. అయితే తిలక్‌లా ప్రచండ భార్గవంగాగాక గోఖలేలా ప్రసన్న భార్గవంగా వ్యవహరిస్తూ, తిలక్ ఆశయాలనూ గోఖలే ఆచరణపద్ధతులనూ స్వాయత్తం చేసుకొని, సంప్రదాయాన్ని సంస్కరణలా సంస్కరణను సంప్రదాయంలా భాసింపజేశాడు గాంధీ. వివేకానందుడు ఆశించింది, తాను అమలుపెట్టజూచాడు. మహాత్ముడనిపించుకొన్నాడు. గాంధీమూలంగా సంఘ సంస్కరణోద్యమం సమాధిపాలైపోయింది. చెడుగులను సంస్కరించడమంటే, నిర్మూలించడం మాత్రం కాదన్నది అస్పృశ్యతానివారణోద్యమం వల్ల బయటపడింది. డాక్టర్ అంబేద్కర్ అంతటి ధీమంతుడు కూడా అస్పృశ్యత విషయంలో పప్పులో కాలువేశాడు. అది మతాచారవిశేషమే అని యెంచబట్టి, అస్పృశ్యులకు హైందవం నుంచి విముక్తి కలిగించి బౌద్ధాన్ని చూపాడుగాని, దాని ఆర్థికమూలాలను ఉన్మీలిద్దామనుకోలేదు. చివరకు, రాజ్యాంగ చట్టంలో అస్పృశ్యతను నిషేధించినా, ఆ నిషేధం జీవితవాస్తవం చేతిలో నిత్యం అవమానం పాలౌతూంది.

మనదేశంలాగే 1917 వరకూ వెనకబడి ఉండిన రష్యాలో బెలిన్‌స్కీ, చెర్నిషవస్కీ, దోబ్రుల్యుబోఫ్, పిసరేఫ్‌వంటి మేధావులు సాహిత్యంలోనేగాక జీవితరంగాలన్నిటా, తమ వ్యతేజస్సును ప్రవేశపెట్టి, సమకాలికులను ఆలోచనారీతులను మార్చగలిగారు. అలాగేవిప్లవానికి ముందు చైనాలో లు-సన్‌లాంటి రచయితలు ఆపనిజేశారు. విప్లవ రచయితల సంఘం తన రచనలద్వారా చెయ్యబూనింది ఇదే– భావ విప్లవానికి అంకురార్పణ చెయ్యడం! అది ఎదుర్కోవలసింది, ధనస్వామ్య వ్యవస్థతాలూకు తెగులు భావాలనేగాక, అంతకంటె జోరుగా జరూరుగా, ఇంకామిగిలిఉన్న భూస్వామ్య వ్యవస్థతాలూకు మిగులు భావాలనే.

వీటిలో మొట్టమొదటిది, పారలౌకిక దృక్పథం. కర్మసిద్ధాంతం సాంఘిక అసమానతలమీద ఆమోదముద్ర వెయ్యడమేగాక, దైవకల్పితాలుగా వాటిని సమర్థించింది. జీవితంలో అధమస్థానం నుంచి ఎక్కరావడానికీ, హోదాతోబాటు ఎక్కువ గౌరవాన్ని పొందడానికీ, ఇది ఉపయోగపడలేదు గాని, ఉన్నచోటనే ఉండిపోవడానికి ఉపయోగపడింది. గుంజకు కట్టివేసిన గొడ్డులా అట్టడుగున ఉన్నమనిషి రొచ్చులో రొప్పులోనే ఉండిపోవాలి. వర్ణవ్యవస్థ ఎదుగూ బొదుగూలేనిది. దీనినటుంచి, కర్మ

సిద్ధాంతం మనుషుల మనస్సులను అలివిగాని ఒక తాత్వికన్యాయానికి లోబరచివేసింది. 'తమచేతిలో ఏదీలేదు. ఈశ్వరుడి ఆజ్ఞలేందే, చీమకూడా కుట్టదు. మనమంతా ఈశ్వరుడు ఆడించే తోలుబొమ్మలం. జగత్తంతామిధ్య. అంతామాయ.' పురుషకారానికి ఇంతో అంతో చోటుఉన్నా, ఈశ్వరేచ్ఛ అనేది దాన్ని కమ్మివేస్తుంది. మనిషికి అధినివేశ ప్రతిపత్తికూడా లేదు, నిరంతర దాస్యమే! దాస్యమే గొప్పది. దేవదేవుడికి దాస్యమంటే, జీవుడికి సాయుజ్యమే. యథార్థ జీవితంపట్ల తూష్ణీభావంతో గూడిన ఈ నిరసన, మన సమాజాన్ని నాటినుంచి నేటివరకు పట్టుకొని వదలని పెనుశయ. వైదికార్యులకు జీవితమంటే ఉండిన ఉత్సాహం మనకు లేకపోవడమటుంచి, నడపీనుగుల జాతిగా మనం మారడానికి ఈ పారలౌకిక దృక్పథానిదే ప్రధాన బాధ్యత.

మన స్వాతంత్ర్యం మంచి చెడ్డల నటుంచి, మతమే చెడ్డది. ఆదిమయుగాల అవశేషంగా తప్ప జీవితంలో దీనికి సమంజసత్వం అంటూ ఏమీలేదు. జీవితానికి అతీతమైన పరబ్రహ్మ పదార్థంతోనే దీనికి ప్రమేయం. మనుషుల్ని పురుగుల్లా నిలిపి ఉంచడానికేతప్ప, లోకవ్యవస్థలో మనుషులకు ఉచితస్థానాన్ని కల్పించడానికి ఏమాత్రం ఇది తోడ్పడదు. అయినా అన్ని "ప్రజాతంత్రి" దేశాల రాజ్యాంగ పత్రాలలో దీనికి స్థానం ఉంటున్నది ఎందుచేతనంటే, ఆయాదేశాల చరిత్ర క్రమంలో మతవిషయకంగా ప్రజల్లో అసహిష్ణుత, కలహాలు, రక్తపాతం వగైరా ఉండేవి కాబట్టి వాటిని నివారించేందుకు అందరికీ సమానమైన మతస్వాతంత్ర్యమనే హక్కుని ఇవ్వడం జరిగింది. సోవియట్ రాజ్యాంగ పత్రంలో మాత్రం మత స్వాతంత్ర్యంతోబాటు మతవ్యతిరేక ప్రచార స్వాతంత్ర్యం అనే హక్కుకూడా ఇచ్చి ఉన్నారు. లౌకిక రాజ్యాంగం అని చెప్పుకొనే మన దేశంలో, మతవ్యతిరేక ప్రచారాన్ని శిక్షించిన సందర్భాలు కూడా ఉన్నాయి. అంతేగాక, శంకుస్థాపనలాంటి లౌకిక వ్యవహారానికి గూడా మతతంతు అవసరమౌతున్నది. రాష్ట్రపతి మొదలు యం. యల్. ఏ వరకు, జవహర్లాల్ నెహ్రూ లాంటి వ్యక్తిగూడా, మతకర్మకాండలో పాలుపుచ్చుకొంటున్నారు. పదవి వస్తేనూ, రాకపోతేనూ తమ తలనీలాలతోబాటు తలలనుకూడా, దేవుడికి మొక్కుబడి కింద సమర్పించుకొంటున్నారు. అన్యాయం ఒకవంక. అసహాయత్వం మరోవంక పెరిగే కొద్దికీ, పాపభీతిమాట ఎట్లా ఉన్నా, దైవభక్తిమాత్రం హనుమంతుడి తోకలా పెరిగిపోతూంది. మతం రావణాసురుడి కాష్ఠంలా మండుతూనే ఉంది. పోవలసిన, విధిగా అంతరించి పోవలసిన మన సమాజ రుగ్మతలలో, మతానికీ, దానికి విహితమైన భావాలకూ అగ్రతాంబూలం ఇవ్వక తప్పదు.

ధనస్వామ్య వ్యవస్థకింద శాస్త్రవిజ్ఞానం అపారంగా పెరిగిన రోజుల్లో ఇతరుల మాట అటుంత, శాస్త్రవేత్తలుకూడా భగవంతుడిగురించి నమ్మకం నిలుపుకొంటున్నారు.

భగవంతుడున్నాడనేందుకు శాస్త్ర ఉపపత్తులతో కారణాలు చూపడం కూడా జరుగుతూంది. మనదేశపు 'మేధావుల' గురించి చెప్పనక్కర్లేదు. కొందరు శాస్త్రవేత్తలు బాబాలదగ్గర నిత్యం కైంకర్యం చేస్తున్నారు. ఇక 'పండితులు' దాసానుదాసులే నిర్గుణ బ్రహ్మోపాసన నుంచి, ఒక్కపెట్టున క్షుద్రమానవారాధన వరకు పతనం చెందిన 'విద్యావంతులు' అనేకులు కనిపిస్తున్నారు. జ్యోతిషం, హస్తసాముద్రికం, కిందినుంచి పైదాకా అన్నిశ్రేణుల వ్యక్తులనూ ఆకర్షించ గలుగుతున్నాయి. గాలివాటున వచ్చిపడే సంపదలమీద లాటరీల ద్వారా ఎంత మోజుపెంచుకొంటున్నారో, తమ పరిశ్రమం లేకుండా చేకూరగల 'అదృష్టం' మీద అంత గురినిలుపుకొంటున్నారు మన జనం. ధనస్వామ్యం అన్నమాటేగాని, మనది భూస్వామ్యం లంజబిడ్డమాత్రమే. భూతకాలం భూతంలా దీని తలమీద ఎక్కికూర్చుంది. తనచావు జగత్ప్రళయంలా కనిపించబట్టి, తనభావి తనపాలిటి బావిలా గోయిలా కనిపించబట్టి, తనరోజులు దగ్గరబడేకొద్దీ, ఇది వెనకచూపు చూస్తోంది, వెనకడుగు వేస్తోంది.

రెండు మూడువేల సంవత్సరాల వయస్సుగల కులవ్యవస్థ, బేతాళుడిలా ఎప్పటికప్పుడు విక్రమార్కుడి వీపుమీదినుంచి ఎగిరి చెట్టుకొమ్మను తలకిందులుగా పట్టుకోగలుగుతున్నది. దీన్ని నిర్మూలించే ప్రతిప్రయత్నమూ మొక్కబోయింది. ధనస్వామ్యం కిందనైనా మనుషులను మనుషులుగా సమానమైన ప్రతిపత్తి లభిస్తుందనుకొంటే, అది నిరాశ అవుతూంది. కులవృత్తులు అనేవి ఇప్పుడు పాటింపబడకపోయినా, ఇచ్చిపుచ్చుకోళ్ళలో కాస్త వెసులుబాటు కనిపిస్తున్నా, తిండితిప్పల్లో కలగలిసిపోతున్నా, కులం ఇంకా మనస్సులో నిలిచే ఉంది. రాజకీయాలు దీన్ని నిర్మూలించకపోగా, ఇది రాజకీయాలను భ్రష్టుపరుస్తూంది. భ్రష్టుపట్టిన రాజకీయం, కులాన్ని నమ్ముకొని దాని అండ జేరుతూంది. విప్లవంకోసం కంకణం కట్టుకొన్న రాజకీయపార్టీలలో గూడా, కులమనస్కత తారాడుతూ ఉంది. కొన్ని రాజకీయపార్టీలైతే మత, కుల ప్రాతిపదికమీదనే నడుస్తున్నాయి. ఎన్నికలలో అభ్యర్థుల నిర్ణయం మొదలు మంత్రివర్గంలో పదవుల పంపిణీవరకు కులప్రమేయం కనిపిస్తూంది. కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభకాలంలో కులం పట్టింపుల గురించి చూపిన నిరసన ఇప్పుడు కనిపించడం లేదు. కాంగ్రెసు, ఆర్థిక ప్రాబల్యంగల కులాల సమాఖ్యమాత్రమే. జనసంఘానికి ప్రధానంగా కుల, మత ప్రాతిపదికే. ఈ స్థితిలో వెనుకబడిన కులాలవారు, దళిత జాతులవారు, సాంఘికంగా ఎట్లున్నా రాజకీయ ప్రాబల్యంకోసం ప్రత్యేక సంఘాలు నిర్మించుకోవడం అనివార్యమైంది. ఆర్థికంగా వెనకబడి ఉన్న బ్రాహ్మణులు, ఇటీవలికాలంలో కుల సంఘంగా ఉద్యమించడం గమనించదగింది. కులంగాడికి నిజంగా అంత్య క్రియలు జరగడానికి యుగం పూర్తిగా మారాలి, వ్యవస్థ కొత్తదిరావాలి, అన్ని ప్రధాన జీవిత

రంగాలలో పరిపూర్ణమైన సమానత శాసనాల ద్వారానేగాక నిత్యజీవిత వ్యవహారంలో భాగంగా అమలు జరగాలి.

స్త్రీ పరాధీనత మరొకతీవ్రమైన సాంఘిక దౌర్బల్యం. పశుపాలన, వ్యవసాయం ఎప్పుడు ప్రారంభమయ్యాయో, పితృస్వామ్యం అప్పుడే ప్రారంభమైంది. పితృస్వామిక సమాజంలో స్త్రీకి ఇంట్లోనేతప్ప బయటమన్ననలేదు. తండ్రిని కుమార్తెగా, భర్తను భార్యగా, బిడ్డను తల్లిగా ఆశ్రయించుకొని ఉండాలే తప్ప తాను తానుగా నిలవలేకపోయింది. ఎక్కడో ఎప్పుడో ఎవ్వరోతప్ప, తక్కినచోట్ల తక్కినప్పుడు తతిమాజిక్కిన వాళ్ళకు విద్య, గృహనిర్వహణ విద్యేగాని యధార్థమైన వైజ్ఞానిక కృషి కాకుండా పోయింది. అయినా భూస్వామ్య యుగంలో కూడా రచయిత్రులు పుట్టుకొచ్చారు. కాని, ఇప్పటికీ మేధస్సుపరంగా, స్త్రీ పురుషుని కంటె తక్కువేనని సిద్ధాంతం చేసే వాళ్లున్నారు. నిన్న మొన్నటివరకు స్త్రీలకు దేశరాజకీయ జీవితంలో భాగస్వామ్యమే ఉండేదికాదు. ఇప్పటికి గూడా జీవితరంగా లన్నిటా, మగవాడిదే పైచెయ్యి. ఉద్యోగాలు చేస్తున్నా ఏలుతున్నా దేశాలకే మంత్రిత్వం నెరపుతున్నా, స్త్రీలు సంఖ్యలో పురుషులతో పోటీపడలేకుండా ఉన్నారు. జనాభాలో సగభాగం, సమిష్టిజీవితాన్ని నిర్ణయించే వ్యవహారాలలో వెనుకబడి ఉండన్నమాట. వాళ్ళ శక్తియుక్తులు అక్కరకురాకుండా నిరాదరణ పాలౌతున్నాయి. స్త్రీలది సంసారసమాధి. గృహనిర్బంధం.

ఎందరు సంస్కర్తలు పైకెత్తజూచినా, స్త్రీ పైకిరాలేక పోతున్నది దీనికి కారణం తానుకూడా. తనకు ఆ సంకల్పం, కనీసం ఆచైతన్యం కలగకుండా, తన వెనకబాటు తనమే అడ్డునిలుస్తున్నది. విద్యాసంస్కారాలు తనకు ఆస్వాతంత్ర్యేచ్ఛను ఇవ్వలేకపోతున్నాయి. గుడికంటె ఇల్లే పదిలమన్నచందంగా, జీవితారణ్యంలో ఇబ్బందులతో గూడిన స్వతంత్రత కంటె, చిక్కుల్లేని పరాధీనతే మేలనిపిస్తున్నట్లుంది "యధా మూషిక మూషికః" స్త్రీజనవిమోచనం బయటినుంచి జరిగేది కానట్టే, సమానత తనుగా వచ్చేదికాదు. సోషలిజం కోసం పోరాటంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో ఇది అంతర్భాగమేగాని అన్యంకాదు. ఇంటిచాకిరి చేయించడమనేది 'పెటీ బూర్జువా' వ్యవహారమనేది లెనిన్ నిరసించాడు.

భూస్వాముల దాష్టీకమూ ధనస్వాముల నయవంచనా కలిసి, రాజకీయాలంటేనూ పార్టీలంటేనూ సిద్ధాంతాలంటేనూ జుగుప్స కలిగేంతగా, రాజకీయ జీవితాన్ని కుళ్ళబెట్టాయి. అసలే మనజనానికి కర్మసిద్ధాంతం నరాలకు పట్టిపోయింది మనఖర్మ ఇంతేననే శూన్యభావం మనస్సును ఆక్రమించింది. దానికితోడు, నిర్వ్యాకం ఇలా ఏడిచింది.

ఎన్నికలు ఏమీ తవ్వి తలకెత్తలేదు. ఓట్లు ఒరగబెట్టేదేమీలేదు. అలాగని పోరాట దృక్పథం ఉందా అంటే, అది కలలోనివార్త. ఈ నిర్లిప్తత, నవనాడుల్నీ కుంగదీసి, మనిషికి గాడిదకున్నంత ఓర్మినీ, గొర్రెకున్నంత మందిగుణాన్నీ ఒనగూరుస్తుంది తప్ప, మనిషిని మనిషిగా- అంటే పోటరిగా- నిలబెట్టదు. దీన్ని చావుదెబ్బతియ్యందే వ్యక్తికి జవమూ జాతికి జీవమూ చేకూరవు.

ఇంతమంది నిరక్షరాస్యులతో నిర్లిప్తులతో ఉద్యమాలేవీ సాగవు సరికదా, భావ వాతావరణమే స్తంభించిపోతుంది. తిండి ఎంత అవసరమో, విద్య అంత అవసరం. అవిద్య అయినా వట్టి అక్షరాభ్యాసం కాగూడదు. యుగాన్నిబట్టి, వ్యవస్థనుబట్టి, విద్య ఉండాలి. పెద్దపుస్తకం అనబడే మహాభారతం చదివినంత మాత్రాన, ఎవడూ విద్యావంతుడు కాలేడు. మనుషుల మనస్సులను ఇప్పటి యధార్థమైన శాస్త్ర పురోగమనానికి అనువుగా తీర్చందే, శాస్త్ర విజయాలను నిత్యజీవితంలో ఉపయోగపెట్టుకోవడం అసాధ్యం. ఎద్దుబండికీ రాకెట్‌కూ, కొయ్యనాగలికీ ట్రాక్టరుకూ, లంగరు అందదు. మానసికంగా ఆదిమయుగంలో ఉన్న మనుషులతోటి, అటం యుగం పరికరాలను జత చెయ్యలేము. విద్య లౌకికం కావాలి. పాఠాలు మతప్రమేయాల కబంధకౌగిలి నుంచి బయటబడాలి. బోధనాభాష బాధకాకూడదు అంటే, మాతృభాష కావడమేగాక, నాగరకమైన ఆధునికమైన వ్యావహారికం కావాలి. శాస్త్ర విషయాలకు పాఠ్యప్రణాళికలో ఇతోధికమైన బాహుళ్యం ఉండాలి. విద్య, మనుషుల మందగుణాన్ని విరిచి మనుష్య సృష్టించి పెంపొందించ గలిగేదిగామారాలి. ధనస్వామ్యంకింద అది మృగతృష్ణమాత్రమే. చదువుకొంటే నాలుగురూకలు సంపాదించుకో వచ్చుననే దృష్టి, విద్యను స్వార్థానికీ ఆధిక్యానికీపర్యాయపదంగా మారుస్తుంది. విద్యావంతులను ఒకకులంగా (Elite)ఏర్పాటుజేసి జనం తలలమీద కూర్చోబెట్టి బుజాలమీద నిలబెడుతుంది. విద్యాలయాలు అధికార వర్గానికి పురిటిగదు లౌతున్నాయి. విద్యావంతులకూ (classes) జనానికీ (masses) నడుమ భావబాంధవ్యం నెలకొనడం లేదు.

సంస్కృతిని చూద్దామా అంటే, అది ధనస్వామ్యం కింద చూడనీయనంత 'సుందర-ముదనష్టం' గా తయారైంది. వ్యాపారం ఒక కళకాగా, కళ వ్యాపారం ఎందుకు కాదు? వ్యాపార కళ, కళా వ్యాపారం జమిలిగా సాగుతూన్న ఈవ్యవస్థలో, ధనానికి తప్ప మూల్యంలేని పరిస్థితి ఏర్పడింది. సంస్కృతిద్వారాలు రాశిలో విపరీతంగా అభివృద్ధిని సాధించినప్పటికీ, బహుళ ప్రజానీకాన్ని చేరగలంతగా అవి పరిణమించినప్పటికీ, (Media of Mass Communication) ఓంకలోనే పురుగు దూరినట్లుగా ధనసంపాదన దృష్టికే పరిమితం కాబట్టి, అవి అందించే సంస్కృతి, యధార్థమైన, ఉత్కృష్టమైన సంస్కృతికి వికృతరూపం లాంటిదే కాగలుగుతూంది. సినీమా ఉంది.

రేడియో ఉంది, వార్తాపత్రికలున్నాయి. కళలు ఉన్నాయి. అవి ఉండవలసినట్టుగా మాత్రం లేవు. పాలకవర్గానికి పదునుగత్తెలేగాని ప్రజాసామాన్యానికి సంస్కృతిద్వారాలు కావడంలేదు. నిజానికి, జనాన్ని ప్రజలుగా మార్చకుండా, వ్యక్తిని వ్యక్తుణ్ని చెయ్యకుండా ఉంచడానికే అవి పనికివస్తున్నాయి. క్షుద్రమైన, లేదా, నేలబారు అభిరుచులను పెంపొందించడమంటే, జనం నుంచి ప్రమాదాన్ని దూరం చేసుకోడమే. నల్లమందు ఖాయీ ఎలాగో, వీటికి అలాగే వ్యక్తి దాసుడౌతున్నాడు. ప్రభుత్వం నిర్వహించే రేడియోకు గూడా వాణిజ్య ప్రకటనలు అవసరమౌతున్నాయి. వార్తాపత్రికలుగానీ ఇతర పత్రికలుగానీ అందించే వినోదం జనానికి ఉల్లాసం కలిగించేదైతే ఫర్వాలేదేమోగాని జనాన్ని మందగా నిలిపి ఉంచేదైతే మాత్రం, విషతుల్యమైనది– పంచదారతో మెదిపిన విషం! ఇక సినిమాల సంగతి చెప్పే పని లేనేలేదు. సాహిత్యంపేర సంగీతంపేర చలామణీ అవుతూన్న పదార్థానికి, జాతీయ సంస్కృతి మొక్కట్లులేనంతగా సంకీర్ణత అంటిపెట్టుకొని ఉంది.

ధనస్వామ్యమూ జాతీయవాదమూ కవలపిల్లలు. జాతీయవాదం ధనస్వామ్యానికి సాధనోపకరణంగా పనికివస్తుంది. భూస్వామ్య వ్యవస్థకింద దేశం ముక్కచెక్కలుగా విడిపోయి, దేనికది స్వతంత్రమనుకొంటూ ఉండిన దుర్దశతో పోలిస్తే, జాతీయవాదం తన ప్రారంభకాలంలోనైనా ప్రగతిభావమే. ముక్కలనన్నిటినీ తనలో కరిగించి ఐక్యపరిచి దేశానికంతటికీ ఒకేవిధమైన ఆర్థిక సంబంధాలను ఏర్పరచేంత మేరకు, ఈ సుగుణం దానికిచెంది ఉంటుంది. ఎప్పుడైతే ఈభావం ఇతర జాతీయరాజ్యాలపట్ల వైరభావంగా పరిణమించి, జాతీయ స్వార్థానికి పర్యాయమౌతుందో, అప్పటినుంచి అది లోకారిష్టంగా పరిణమిస్తుంది. కలహశీలత దాని దుర్గుణమౌతుంది. స్వాధిక్య భావం, అహంకారం, ఇతరులపట్ల న్యూనభావం. "కత్తివైరం" కొనితెచ్చుకోవడం- ఇవన్నీ సంక్రమిస్తాయి. దేశాభిమానం మంచినీటి లాంటిది (Patriotism); జాతీయవాదం మద్యంలాంటిది (Nationalism). విశ్వశ్రామికరాజ్యం శైశవంలోనే ఎదుర్కొవలసిన పూతన, జాతీయవాదం.

తాను విప్లవం ద్వారానే, లేదా పోరాటపంథా ద్వారానే, రాజ్యాధికారం సంపాదించుకొన్నాననే విషయాన్ని మరిచినట్లుగా, తన ప్రాభవానికీ ప్రభుతకీ ఎలాంటి సవాళ్లు వెలువడకుండా, 'విప్లవం' అనేమాటే రాజద్రోహమైనట్లుగా, ధనస్వామ్యం అదిరి అదిరిపడుతూ ఉంటుంది. ధిక్కారాన్ని సైచని కంసుడి లాంటిది. తనరాజ్యాంగమే ఈ వ్యవస్థే, ఆపాదమస్తకం ఆయుధాలతో కిక్కిరిసే కసాయియంత్రం అయిందనే విషయాన్ని దాచి, ఆయుధబలమే అంతిమంగా తనబలం అనే సత్యాన్నిమూసి, సాయుధ ప్రతిఘటనను అణుస్తూపోతుంది. కాకుంటే, సంస్కరణల పేర ముష్టిమెతుకులు విదిలిస్తూ, మూలుగెముకలు చూపి మచ్చికజేసుకొనే కుక్కల్నిలా జనాన్ని మచ్చికజేసుకోడానికి ప్రయత్నిస్తుంది. అయిదేళ్ళకోమారు ఓట్లసంత పెట్టి, తనని సమర్థించేవాళ్ళనే

జనం ఎన్నిక చేసుకొనేట్టుగా అధికారాన్నీ ధనాన్నీ వాడుకొంటూ, తనపబ్బం గడిచిన్న వెంటనే ఆ జనాన్ని మళ్ళీ తమతమ కష్టనిష్ఠురాలకు లోబరచివేస్తుంది. ఐదేళ్లకోమారు నిద్రమేల్కొని కాలుసాగించి చేయిఆడించి ఏళ్ల విరుచుకొని కళ్లనులుముకొని, ఇంతలో మళ్ళీ నిద్రకు పూనుకొనే కుంభకర్ణుడిలా జనాన్నిమార్చి, ఏమార్చివేస్తుంది ఈ ప్రజా తంత్రం, ప్రజల పాలిటికి పెనుదుస్తంత్రం. అయినా, భూస్వామ్యయుగంనాటి కర్ర పెత్తందారీకంటె ఇదిమేలు. దీన్ని జనం నమ్ముకోగూడదుగాని తమకు అక్కర వచ్చి నంతవరకు వాడుకోవచ్చు. అయితే ఎప్పుడూ తమ పోరాట పంథానుంచి మాత్రం దృష్టిని పక్కకు తిప్పగూడదు.

ఈ వ్యవస్థ క్రమపరిణామంలో సురుచిర సామ్యవాదంగా పరిణమిస్తుం దనుకో వడంకంటె. జనానికిగానీ వాళ్ళ శ్రేయస్సువి కోరేవారికిగానీ. మరొక దారుణమైన భ్రమ ఏదీ ఉండదు మన సంప్రదాయం ప్రశాంతితో గూడిన సామరస్యధోరణి అని చెప్పేవాళ్ళు, మూర్ఖులో మోసగాళ్ళో! ఏ మానవ సంఘం ఏకాలంలోనూ, చేతులు ముడుచుకూర్చుని మాత్రం, వ్యవస్థను మార్చలేదు. ధనస్వామ్యాన్ని సోషలిజంగా మార్చడమంటే ధనస్వామ్యాన్ని పరిమార్చడమే! ఇది అంతిమంగా సాయుధ ప్రజా విప్లవంద్వారా తప్ప సాధ్యంకాదు ధనస్వామ్యాన్ని పరిమార్చడమంటే ధనస్వాము లను విడిగా పరిమార్చడమని అర్థంకాదు. అదురుదెబ్బలు కొట్టవచ్చుగాక, జనకంటకుల మీద చెయ్యి జేసుకోవచ్చుగాక వ్యక్తిగతమైన హింసవల్ల, క్రౌర్యంవల్ల, మహా చారిత్రక పరిణామం అందుబాటులోకిరాదు. జనం తరఫున ఎవరుగానీ వకాల్తాపుచ్చుకో నక్కర్లేకుండానే, దూరదృష్టితోబాటు సిద్ధాంత పరిజ్ఞానంతోటి సరైన వ్యూహరచనా చరణమైన నాయకత్వం కింద, జనం కెరటాలు కెరటాలుగా లేచి, వ్యవస్థనుశపిస్తూ, అరణ్యాన్ని ధ్వంసిస్తూ, తిరగబడి పోరాడినప్పుడు జనానికి చారిత్రక చైతన్యం వచ్చి ప్రజగా మార్పుచెందినప్పుడు, రాజ్య రాక్షసిమీద పిడుగుదాడి జరిగినప్పుడు. అప్పుడే, ఈ అరణ్యం అంతరించి, ఉద్యానవనానికి ప్రాతిపదికపడుతుంది.

అసలేహింస ఉండదా అంటే, హింస మాటేమోగాని, బలప్రయోగం మాత్రం తప్పనిసరిగా ఉంటుంది అని జవాబు చెప్పవచ్చు. మోహరించిన మరో బలాన్ని కుప్పగూల్చి వెయ్యడానికి, జనం బలప్రయోగం చేస్తుంది. అది ఆయుధబలమైతే, ఇదీ ఆయుధబలం కాకతప్పదు. "వజ్రం వజ్రేనభిద్యతే".

ఆ సుడిగాలి వీచాలంటే, మేధావులనబడేవారిలో మొదట సంచలనం ప్రారంభం కావాలి!

నిట్టూర్పులే మన చరమగమ్యం కాదు. నిట్టూర్పుల నుంచి సెగలుచిమ్మే నిప్పు రగిలి, లాజి, అసమానతపీ అక్రమాన్నీ దగ్ధపటలం చెయ్యగల దావాగ్నిజ్వాల సృష్టి కావాలి!

కళావేత్తలారా! మీరేవైపు?

మాగ్జింగోర్కీ

జాతిద్వేషం

స్మిత్! మారిసన్! 'సాంస్కృతికాభిప్రాయాలను 'సంఘటిత' పరచడమే' బూర్జువా సాహిత్యం బూర్జువా పత్రికలూ చేస్తూన్న పని అని మీరు చెప్పుతున్నారు. కాని అది యదార్థంకాదు. మీరు కేవలం పొరపడుతున్నారు. ఈ 'సంఘటన' పరాన్న భుక్కుల సృష్టిమాత్రమే. వాస్తవిక వికృత స్వరూపాన్ని మరుగుపరచడానికే ఈ 'సంఘటన' ప్రయత్నిస్తూ ఉంది. కాని ఎంత పర్రియత్నించినా శిథిలమై కూలిపోతూ ఉన్న ఇంటిని తీగలతోనూ, గడ్డితోనూ కప్పితే యెంత ప్రయోజనమో ఇదీ అంతే. మీ పత్రికలుచేసే ప్రచారాన్నిగురించి మీలో తప్పుడు భావాలు వ్యాపింపజేశారు. 'అమెరికన్ ప్రప్రథమంగా అమెరికన్, తర్వాత మానవుడు, ఇదీ మీపత్రికలు చేస్తూన్న ప్రచారం. ఇదేవిధంగా జర్మనీ పత్రికలు 'ప్రతి జర్మన్ ప్రప్రథమంగా జర్మన్ లేక ఆర్యన్. తర్వాతనే అతడు డాక్టరైనా భూగర్భ శాస్త్రవేత్త అయినా లేక తత్వశాస్త్రవేత్త అయినా' అనీ ప్రచారం చేస్తున్నాయి. ఫ్రెంచి దేశీయుడు ప్రప్రథమంగా విజయి అనీ అందు వల్ల అతడు తదితరులందరికంటె ఆయుధాల్లో మేటియై ఉండాలనీ ఫ్రెంచి పత్రికా రచయితలు వాదిస్తున్నారు. అంటే ఏమిటి? వారికి కావలసింది ఆయుధశక్తి-పశుబలం-కాని మానసికశక్తిగాదని ప్రతిభాశక్తిగాదని తేటతెల్లమవుతూ ఉంది.

ఇదివరకే అంతంతమాత్రంగా ఉన్న పాఠకుల సంస్కృతీస్థాయిని ఇంకా తగ్గించి వేయడమే యూరప్ పత్రికలూ, అమెరికా పత్రికలూ నేడు చేస్తూఉన్నపని అని చెప్పడం అతిశయోక్తికాదు. గులకరాళ్లనుంచి కూడా కోట్లకొలది రూపాయలు గడించడంలో ప్రావీణ్యత సంపాదించిన తమ పాత యజమానులైన పెట్టుబడిదారుల పాదసేవలోనే - కైంకర్యంలోనే - 'ధన్యోస్మి' అనుకుంటున్నారు. పంది ఇదివరకే తన బురదను గోల్పోయి రొచ్చుగుంటలోకి పరుగెత్తుతూన్నా దాన్ని అడ్డగించదలచు కోడంలేదు.

"మేము యూరప్‌లో ఉన్నప్పుడు మమ్ములను యూరోపియన్లు అస హ్యించుకుంటూ ఉండగా అందుకు మేమెంతో నొచ్చుకున్నాం" అని మీరు వ్రాస్తున్నారు. ఇది పూర్తిగా 'స్వీయప్రభావతత్వం' (సబ్జెక్టివిజం) మాత్రిమే. సర్వ వ్యాపిత సత్యాన్నికూడా మీరు చూడలేకపొయ్యారు పరస్పర ద్వేషపూరితమయిన

అసహ్యవాతావరణంలో యూరోపియన్ బూర్జువావర్గం నివసిస్తూ ఉందనే విషయాన్ని మీరు కానలేకపొయ్యారు. దోపిడి చేయబడే జర్మన్లు ఫ్రాన్సును అసహ్యించుకుంటు న్నారు. తమదేశంలోఉన్న బంగారం అంతా గుంజుకుపోతున్నారని ఫ్రాన్సు ఇంగ్లీషు వాళ్ళను అసహ్యించుకుంటూ ఉంది. అదేవిధంగా ఇటాలియన్లు ఫ్రెంచివాళ్ళను అస హ్యించుకుంటున్నారు. మొత్తం బూర్జువావర్గం అంతాకలిసి ఏకంగా సోవియట్ యూనియన్ ద్వేషిస్తూ ఉంది. 30 కోట్లమంది హిందువులు (భారతీయులు) బ్రిటిషు ప్రభువులనూ పెట్టుబడిదారులనూ ఏవగించుకుంటున్నారు. 45 కోట్లమంది చైనా దేశస్తులు జపాన్‌వాళ్ళనే కాకుండా చైనాదేశాన్ని కొల్లగొట్టే యూరపియన్‌లు అందరినీ అస హ్యించుకుంటున్నారు. చైనాను దోపిడిచేయడం తనకే పట్టాహక్కు అని జపాన్ భావి స్తుంది కాబట్టి జపాన్ అంటే యూరపియన్లు మండిపడుతున్నారు. ఈవిధంగా ఎటు జూచినా పరస్పర ద్వేషభావం దట్టముగా అలుముకుంటూ ఉంది. క్రోధాగ్ని జ్వాలలు రగుల్కొంటున్నాయి. 'అంగవ్రాతములో చికిత్సకుడు దుష్టాంగంబు ఖండించి శేషాంగ శ్రేణికి మేలునేయు క్రియ' సమాజ శరీరంలోబుట్టిన వ్రణాన్ని ఛేదించి నప్పుడే సమాజం బాగుపడుతుంది. అప్పుడే సమాజం అనే శరీరంలో విశుద్ధరక్తం ప్రవహించి వినూత్నకళతో సమాజం శోభాయమానంగా వృద్ధిచెందుతుంది. లక్షల కొలది బలిష్ఠులైన పురుషులను యుద్ధం తనపొట్టన బెట్టుకోడమే కాకుండా అనేక అమూల్యమైన వస్తువులనూ అంతులేని ముడిపదార్థాలనూ మంటగలిపేస్తుంది. తత్ఫలి తంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. కరువు కాటకాలు తాండవిస్తాయి. ఇంత జరిగినా వివిధబూర్జువా జాతీయ గ్రూపుల మధ్యనున్న ద్వేషాగ్ని చల్లారదని వేరే చెప్పనవసరం లేదు. 'సార్వజనీన సంస్కృతి సేవచేయగలం' అని మీరనుకుంటు న్నారు. ఆ సంస్కృతి క్షీణించిపోయి అనాగరిక పాశవికదశకు పరిణమించకుండా కాపాడడం మీ కర్తవ్యమని మీరు భావిస్తున్నారు. మంచిదే. కాని మిమ్ముల నెదుర్కొనే మొదటి ప్రశ్నకు మీరు చెప్పే సమాధాన మేమిటి? మీరు కాపాడబూనుకొనే ఈ సంస్కృతి అసలు 'సార్వజనీన సంస్కృతి' కాదు. కాజాలదు. ఒకజాతిపై మరో జాతిని రెచ్చగొట్టే సంస్కృతి, కష్టజీవులైన సామాన్య ప్రజల యోగక్షేమా లను గురించి ఏమాత్రం శ్రద్ధవహించని సంస్కృతి 'సార్వజనీన సంస్కృతి' ఎలా అవుతుంది?

నిరుద్యోగ సమస్య తీవ్రంగా పరిణమిస్తూవుంది. కార్మికవర్గం తిండిలేక పస్తులు పండుకుంటూ వుంది. బాలికా వ్యభిచారం రోజురోజుకూ పెరిగిపోతూ వుంది— ఇవన్నీ సంస్కృతిని సర్వనాశనం చేసివేస్తున్నాయి. వీటన్నిటినీ అరికట్టడానికి ఏమి చేయ

వలెనో, ఏమి చేయగలరో మిమ్ములను మీరే ప్రశ్నించుకోండి! ప్రజలు పస్తులుపండుకోవడం అంటే భూమాతయే పస్తుండడం అనే సత్యాన్ని మీరెరుగుదురా? సంస్కృతి పుష్పించి ఫలించడానికి భూమాతయే ఆధారం కదా? అలాంటి భూమాతయే పస్తుపడుకుంటే యింకా సంస్కృతి ఎక్కడనుంచి అభివృద్ధి చెందుతుంది? 'సంస్కృతీపరులు' అనబడేవారంతా ప్రజలనుంచి వచ్చేవారే అని మీరు బాగా ఎరుగుదురు. అమెరికాలో పత్రికలు అమ్ముకునే కుర్రవాడు కూడా అధ్యక్షపదవి నధిష్ఠించవచ్చునని అమెరికన్లు మాటిమాటికీ ప్రగల్భాలుకొట్టడం మీకింకా బాగా తెలుసు.

ఇందువల్లి ఆ కుర్రవాళ్ళ తెలివితేటలు మాత్రమే ప్రదర్శితం అవుతాయి, కాని ప్రెసిడెంటు గుణగణాలు మాత్రం కాదని మీకు జ్ఞప్తిచేయడమే ఇక్కడ నాఉద్దేశం. ప్రెసిడెంటు గుణగణాలను గురించి నాకేమీ తెలియదు.

మీరు మరోసమస్యను కూడా గుర్తుంచుకోవలసి ఉంటుంది. ఇంగ్లీషు దొరల బానిసలుగా ఉంటానికి తమ్ము భగవంతుడు సృష్టించలేదని 30 కోట్ల భారతీయులు స్పష్టంగా గ్రహిస్తూ ఉన్న ఈ సమయంలో 45 కోట్ల మంది చైనీయులను యూరోపియన్ అమెరికన్ పెట్టుబడిదారులకు బానిసలుగా చేయడం సాధ్యం అవుతుందని మీరు నమ్ముతున్నారా? కోట్లకొలది కార్మికప్రజల రెక్కల కష్టంపై కొన్ని లక్షలమంది దోపిడిగాండ్లు హాయిగా తిని, తేపి కడుపులో చల్ల కదలకుండా కాలుమీద కాలువేసుకొని కూర్చోవడం ఎంతకాలం సాధ్యం అవుతుంది? ఇది మీదృష్టికి ఒక స్వల్పవిషయంగా కనిపిస్తూ ఉందా? ఈ దోపిడివిధానం ఇదివరకు సాగింది. ఇప్పుడు సాగుతూఉంది. కాబట్టి ఇకముందుకూడా ఇదేవిధంగా ఎల్లకాలం కొనసాగుతుందని మీరు చెప్పగలరా? మధ్యయుగాల్లో ప్లేగు ఒక సర్వసాధారణ విషయంగా ఉండేది. కాని ఇప్పుడది దాదాపు రూపుమాసిపోయి బూర్జువావర్గ రూపంలో పునర్జన్మ ఎత్తింది. రంగుజాతు లన్నిటినీ తన విషపుకోరలతో కాటువేస్తూ ఉంది. తత్ఫలితంగా తెల్లజాతులన్నిటినీ ఆ జాతులు విపరీతంగా ద్వేషిస్తున్నాయి. కళా సంరక్షకులారా! మీకుకూడా ఆగాలినోకలేదా?

* * *

'ద్వేషపూరిత ప్రచారం'తో మీరు నన్ను దూషిస్తూ 'ప్రేమను గురించి ప్రచారము' చేయమని మీరు నాకు సలహాయిస్తున్నారు. మీకు అత్యంతప్రియులైన పెట్టుబడిదారులను ప్రేమించమని కార్మికులకు నేను ఈవిధంగా బోధించగలనని మీరు భావిస్తున్నారు.

"కార్మికులారా! మీ భూదేవి సిరిసంపత్తి నంతటిని బుద్ధిపూర్వకంగా కొల్లగొట్టి దోపిడిచేసే పెట్టుబడిదారులను ప్రేమించండి! మిమ్మలను నాశనం చేయడానికి తుడిచిపెట్టివేయడానికి తుపాకులను తయారుచేసి మీ ఇనుమునంతా నిరుపయోగంచేసే ధనికవర్గాన్ని ప్రేమించండి! ఎవరిమూలకంగా మీ బిడ్డలు తిండిలేక అలమటించి మృత్యువు వాతబడుతున్నారో ఆ దోపిడి దొంగలను ప్రేమించండి! తమ శాంతికోసం తమ సుఖంకోసం మిమ్మలను సర్వనాశనం చేసే ఆ బొర్రలను ప్రేమించండి! మిమ్మలను అజ్ఞానాంధకారంలో ముంచి వేసే మతసంస్థలకు పెద్దలైన పెట్టుబడిదారులను ప్రేమించండి!

మత సంస్థలుకూడా కొంతవరకు ఇదేవిధంగా బోధించాయి. 'సంస్కృతీ పునరుద్ధరణ'కు 'క్రైస్తవమతం' ఒక్కటే ఏకైక మార్గమని మీరు ఉపదేశిస్తున్నారు. కాని ఈ ప్రచారంలో మీరు కొంచెం విలంబనచేశారు. 'ప్రేమోపదేశాల' ద్వారా ఏర్పడే సంస్కృతీ ప్రభావాన్ని గురించి మాట్లాడడం మర్యాదస్తులెప్పుడో మానివేశారు. ఇప్పుడు అలా మాట్లాడడం సమయోచితం అనిపించుకోదు. ముఖ్యంగా ఈరోజుల్లో— క్రిష్టియన్ బూర్జువావర్గం స్వదేశంలోనూ, విదేశాల్లోనూ కత్తిరుళిపించి, నిప్పులు గురిపించి బానిసలకు బలాత్కారంగా ప్రేమపాఠాలు నేర్పుతూ ఉన్న ఈరోజుల్లో— (ఈవిషయం మీకు బాగాతెలుసు) ప్రేమను గురించీ, అహింసను గురించీ చిలకపలుకులు పలకడం కేవలము హాస్యాస్పదం అవుతుంది.

మాటల స్థానంలో బాంబులు

ఈనాడు 'మాటల'స్థానం 'బాంబులు' ఆక్రమించాయి. బాంబుల్లో భగవద్వాక్యం-ఆకాశవాణి- వినపడుతుంది. ఒక ప్యారిస్ పత్రిక ఏమి వ్రాసిందో చూడండి:

"ఆఫ్రీదీలతో యుద్ధం చేయడంలో ఇంగ్లీషువాళ్ళు ఒక నూతన పద్ధతిని కని పెట్టారు. ఈ నూతన పద్ధతి ఇంగ్లీషు వారికెంతో ఉపయోగకరంగా ఉంది. దుర్గమారణ్యాల్లో, కొండల్లో దాగిఉన్న తిరుగుబాటుదార్లకు హఠాత్తుగా తమ నెత్తిపై చాలాఎత్తున విమానం కనిపించింది. వెంటనే ఆఫ్రీదీలు తమ చేతుల్లోవున్న తుపాకులెక్కుబెట్టారు. కాని ఆ విమానము వారిపై 'బాంబుల'కు బదులుగా 'మాటలు' వేసింది. తుపాకులు క్రింద పడవేయమనీ బ్రహ్మాండమైన బ్రిటిష్ సామ్రాజ్యంతో తెలివి తక్కువగా యుద్ధం చేయడం తగదనీ ఆఫ్రీదీల మాతృభాషలో ఆకాశంనుంచి కొన్నిమాటలు వినబడ్డాయి. ఈ 'ఆకాశవాణి'ని విని ఆఫ్రీదీలు నిజంగానే అనేకసార్లు యుద్ధం జేయడం మానివేశారు.

"మిలాన్ (ఇటలీ)లో కూడా ఇలాంటి ప్రయోగమే ఒకటి జరిగింది. ఫాసిస్టు సైన్యం యొక్క వార్షికోత్సవ సందర్భంలో ఫాసిజాన్ని పొగుడుతూ వినిపించిన భగవద్వాణిని ఆ పట్టణ ప్రజలంతా విన్నారు. ఆకాశంనుంచి వచ్చే ఈ వాణిలో జనరల్ జాల్పోను ఎరిగినవాళ్లు ఆయన కంఠస్వరాన్ని గుర్తించారు."

భగవంతుడున్నాడని రుజువు చేయడానికి పెట్టుబడిదారులుపై జెప్పిన విధంగా మహాసులువైన పద్ధతిని కనిపెట్టారు. అమాయిక ప్రజలను తమకు బానిసలుగా జేసుకోడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. బహుశా ఇక మనం కొద్దిరోజుల్లోనే జపాను యాసతో ఇంగ్లీషు భాషలో శాన్‌ఫ్రాన్సిస్కో పైనగానీ, వాషింగ్టన్ పైనగానీ భగవంతుడు మాట్లాడుతూ ఉండగా కూడా వింటాం.

మతబోధ

ఈ సందర్భంలో 'మహాపురుషులైన మత గురువులను' గురించి మీరు నన్ను ప్రశ్నించాలనుకుంటారు. నిజంగా మీరు ఇలా అనుకోడం చాలా విచిత్రమైన విషయం. ఏ ఆశయాలకోసం ఏవిధంగా ఈ మతగురువులు 'మహాపురుషులు' అయ్యారనే విషయాన్ని నేనిప్పుడిక్కడ చర్చించబోవడంలేదు. అయితే ఒక చిన్న విషయాన్నిమాత్రం ఈ సందర్భంలో చెప్పక తప్పదు మీరామహాపురుషులను విశ్వసించే ముందు అసలు వారెంతవరకు విశ్వసనీయులో ముందు పరీక్షించండి. 'చర్చికోసం'—మత శ్రేయస్సుకోసం— అని వాదించడంలో మీరు మీ 'అమెరికన్ ఆధ్యాత్మిక వాదాన్ని' బైటపెట్టుకుంటున్నారు. అజ్ఞానం బాగా అవరించి ఉన్నచోటనే మీ ఆధ్యాత్మికవాదం వేరూని బలపడేది. చర్చి అంటే ఏమిటో ఇంతవరకు మీకు - అమెరికన్లకు సరియైన అనుభవం లేదని ఇందుమూలంగా మీరే తేటతెల్లం చేసుకుంటున్నారు. చర్చి అంటే మానవుని ఆత్మపై జరిగే హింసాపూరిత బలప్రయోగం అనే విషయాన్ని మీరింకా గుర్తించలేదు. దీన్నిగురించి యూరప్ ప్రజలు పడినబాధల్లో మీరు ఎన్నోవంతు కూడా అనుభవించలేదు. 'చర్చి మహోపదేశికుల' స్వార్థం, దురాశ, దురహంకారాల ఫలితంగా రోమన్ కేథలిక్ సమావేశాల్లో జరిగిన రక్తస్రావంతో మొదటిసారి మీ అమెరికన్లు కొంత అనుభవాన్ని గడించి ఉంటారు. ఎఫెసస్ కౌన్సిళ్ళ చరిత్రను అధ్యయనం చేయడంకూడా మీకీవిషయంలో కొంత లాభించి ఉంటుంది. క్రీస్తుశకం మొదటి శతాబ్దంలో భిన్న మతావలంబకులైన యూదులు అల్‌బిగెన్లూ టబోరైట్లూ వగైరాలను చర్చి పేరుతో ఏవిధంగా చిత్రహింసలకు పాలుజేశారో మీరుపుస్తకాల్లో కొంతఅయినా చదివేఉంటారు, విమర్శనాత్మక చరిత్రకూడా ప్రజానీకానికి కొంతవరకు ఉపయోగకారిగానే ఉంటుంది. కాని అదికూడా మీవాషింగ్‌టన్ 'లీ' బోధించిన ప్రకారం బోధిస్తే శుద్ధదండగే అవు

తుంది. 'లీ' బోధలన్నిటిపైనా వాటికన్ (క్రైస్తవమతపీఠం) తన అంగీకార ముద్రి వేసింది. ఈ విషయాలన్నిటిని మీరు పరిశీలించిచూస్తే అత్యధిక సంఖ్యాకులపై అత్యల్ప సంఖ్యాకుల అధికారాన్ని నిలబెట్టడానికే ఈ మతగురువులు తమ సర్వశక్తులా పాటుపడు తున్నారని మీరంగీకరిస్తారు. ఇతర సిద్ధాంతాలనూ, ఇతర మతాలనూ ఎదిరించి వీరు పోరాడుతున్నారంటే అవి ప్రజల్లో బలపడుతున్నాయనే ద్వేషమే ఇందుకు కారణం.

ఈ మతబోధలన్నీ - ధర్మోపదేశాలన్నీ - బానిసలకు మాత్రమే. యజమాను లెన్నడూ వాటిని పాటించరు.

మీ చరిత్రకారుడైన వాన్‌లూన్ 'చారిత్రిక మహాదోషాలు' అనే వ్యాసంలో ధర్మసూత్రాలకోసం పని చేయకుండా చర్చి తద్ వ్యతిరేకంగా పనిచేసిందని ఇలా చెప్పాడు :

"జెరూసలేంను విధ్వంసం చేయడంలో టిటుస్ గొప్ప పొరపాటు చేశాడు. పాలస్తీనానుంచి తరుమబడిన యూదులు ప్రపంచమంతటా వ్యాపించారు. వారు నిర్మిం చిన కమిటీలు క్రైస్తవ సిద్ధాంతాల్లో పరిపక్వతను సాధించాయి. మార్క్స్ లెనిన్ సిద్ధాంతాలు పెట్టుబడిదారీ రాజ్యాలకు కలిగించిన హానికంటె ఆనాటి క్రైస్తవ సిద్ధాంతాలు రోమన్ సామ్రాజ్యానికి ఇంకా ఎక్కువ హాని కలిగించాయి. ఆ సిద్ధాంతాల ఫలితం గానే ఆనాడు రోమన్ సామ్రాజ్యం కూలిపోయింది."

నిజమే. ఈ సూత్రం నేటికికూడా అన్వయిస్తుంది. మతధర్మాల్లోని స్వాభావిక కమ్యూనిజానికి వ్యతిరేకంగా చర్చి పోరాడింది. చర్చి చరిత్ర అంతా ఇదే.

ఈనాడు చర్చి చేస్తున్న పనేమిటి? ప్రార్థనలుమాత్రం చేస్తూంది ప్రప్రథమంగా, అవును, అంతవరకు నిజమే. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా 'క్రూసేడ్' (మతయుద్ధం) సాగించాలని బోధించే యార్క్, కాంటర్బరీ ఆర్చిబిషప్పులు ఇప్పు డొక కొత్తరకం ప్రార్థనను కనిపెట్టారు. ఈ ప్రార్థనలో ఇంగ్లీషు హాస్యంతోపాటు ఇంగ్లీషు మోసంకూడా చక్కగా మిళితమై ఉంది. ఈబిషప్పులు భగవంతుని ప్రార్థించే దేమిటయ్యా అంటే!

"ఓ ప్రభువా! మా ప్రభుత్వం ధనధాన్యసమృద్ధితో తులదూగుగాక! ఇతర దేశాలను రుణాలుబెట్టే మా ప్రభుత్వపాలసీ జయప్రదమగుగాక! భారతభావి ప్రభుత్వ నిర్మాణానికి అవసరమైన ఒడంబడికలకు మా ప్రభుత్వము చేసినకృషి అంతా ఫలప్రద మగుగాక! నిరాయుధీకరణ సమస్యపై జరగబోయే సభ దిగ్విజయమగుగాక! భూమిపై శాంతిని నెలకొల్పడానికి మా ప్రభుత్వం వేసే ప్లానులన్నీ కొనసాగుగాక! మా వర్తక

వ్యాపారాలు లాభప్రదంగా జరుగుతూ పరస్పర సద్భావం నెలకొనుగాక! ప్రతిదినం మాకు ఇష్టమృష్టాన్నం లభించుగాక! వివిధవర్గాల పరస్పర సహకారముతో "సర్వజన సుఖానికై" మాకీనాడు ఇష్టమృష్టాన్నం లభించుగాక! జాతీయాహంకారానికి మేము గురిఅయి, ఇతర జాతులకు యథాశక్తి తోడ్పడ్డానికి బదులు మేము వారిపై అధికారం చలాయించే దోషానికి పాల్పడితే, ఓ ప్రభువా! మా అపరాధాలను క్షమించు! మా వ్యవహారాల్లో మేము స్వార్థదృష్టితో హద్దుల నతిక్రమించి ప్రవర్తిస్తే మా అపరాధాలను క్షమించు! తదితరుల ప్రయోజనాలన్నిటికంటె మా ప్రయోజనాలనే, మా వర్గప్రయోజనాలనే, మేం ప్రధానంగా భావిస్తే ఓ పరమాత్మా! మమ్మలను క్షమించు." ✓

భయభీతులైన పెట్టుబడిదార్లు చేసే ప్రార్థన ఇదే. ప్రార్థన చేసినంతసేపూ తమ 'అపరాధాలను' 'క్షమించ'వలసిందని భగవంతుణ్ణి కనీసం ఒక డజనుసార్లయినా క్షమాపణ వేడుకుంటారు. కాని ఇలాంటి అపరాధాలను ఇకముందు చేయం అని చెప్పడం మాత్రం మరచిపోతారు. వారుకోరే క్షమాపణల్లో ఒకటి:—

"జాతీయాహంకారానికి మేము గురియై, ఇతరజాతులకు యథాశక్తి తోడ్పడడానికి బదులు మేము వారిపై అధికారం చలాయించే దోషానికి పాల్పడితే ఓ ప్రభువా! మా అపరాధాన్ని క్షమించు."

ఈపాపాన్ని క్షమించు; కాని మేం ఇంతటితో ఆగం. ఇకముందు కూడా ఈ పాపంచేస్తూనే ఉంటాం. ఇదీ ధోరణి. పదేపదే ఈవిధంగా క్షమాపణలు చెప్పుకోడం తమ ప్రతిష్ఠకు భంగకరంగా తోచింది కాబోలు. బ్రిటిష్ మతగురువులు దీనికి స్వస్తి జెప్పారు.

జనవరి 2 వ తేదీన ఈ సమస్య బ్రిటిష్ భగవత్సన్నిధానం వరకు - సెయింట్ పాల్స్ కేతడ్రల్ వరకు - పోయింది. ఈ ప్రార్థన తమకు నచ్చకపోతే ఈ క్షమాపణ భాగాలను వదలిపెట్టివేయవచ్చునని కాంటర్బరీ ఆర్చిబిషప్ తనకిర్రింది మతగురువులందరిని ఆదేశించాడు.

క్రైస్తవ చర్చి, ఎంత విచిత్రంగా మారిందో దీనినిబట్టి మీరు స్పష్టంగా తెలుసుకోవచ్చు. మతగురువులు తమ దేవుణ్ణికూడా ఒక పెట్టుబడిదారుగా (సీనియర్ షాప్ కీపర్) మార్చివేశారు. యూరప్ వర్తక వ్యాపారాలన్నింటిలో ఈ దేవుడుకూడా ఒక భాగస్థుడే. అయితే ఈ 'శ్రేయస్సు'నంతా ఒక్క బ్రిటిష్ మతగురువులకే అంటగట్టడం న్యాయంకాదు. ఇటాలియన్ మతగురువులు భగవంతుణ్ని ఒక బ్యాంకుగానే మార్చివేశారు. ప్యారిస్ పత్రికలో ఒకసారి ఈ క్రిందివార్త ప్రచురించబడింది.

"కేతలిక్ పుస్తక ప్రచురణాలయమైన 'యూనియన్' బుక్‌స్టోరు మేనేజరునీ, గుమాస్తాలనూ అరెస్టుచేయవలసిందని అధికారులు ఉత్తరువు జారీచేశారు. జర్మనీనుంచి దిగుమతి అయిన అర్ధనగ్న, దిగంబర చిత్రాలను ఈ బుక్‌డిపో అమ్ముతూ ఉంది. ఈ డిపోలోఉన్న 'స్టాకునంతా ప్రభుత్వం' స్వాధీనపరుచుకుంది. ఈ డిపోలోఉన్న పుస్తకాలు పట్టి బూతుల బొమ్మలతో నిండిఉండడమే కాకుండా మతాన్నే దుమ్మెత్తిపోస్తున్నాయి."

ఇలాంటి ఉదాహరణలు ఎన్నిఅయినా ఇవ్వవచ్చు. ఇవన్నీ ఒకేఒక విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి. పెట్టుబడిదారీ విధానానికి బానిసగా, బోధకుడుగా పనిచేస్తూ ఉన్న చర్చి అవలక్షణాలన్నింటికీ ఆలవాలంగా తయారయింది. ఈ అవలక్షణాల ఫలితంగానే పెట్టుబడిదారీ విధానం నాశనమైపోతూ ఉంది. ఒకప్పుడు చర్చి నైతిక పరివర్తనకు కొంత ఆదర్శంగా ఉన్నమాట వాస్తవమే. కాని ఇప్పుడు మతగురువులు 'ఆధ్యాత్మిక పోలీసులు'గా మాత్రమే ఉపయోగపడుతున్నారు. ప్రభుత్వ యంత్రం కష్టజీవులను అణచివేస్తూ ఉంటే అందులోనే ఒకభాగమైన 'చర్చి' అందుకు భిన్నంగా ప్రవర్తిస్తుందా? కష్టజీవులను ఊరడిస్తుందా? ఊరడించింది అనికూడా నేను అంగీకరిస్తారు. కాని ఈ ఊరడింపుకూడా ఒకరకమైన బూర్జువా తెలివితేటలే.

ధనికులను ప్రేమించమని పేదలకు బోధించడం, యజమానిని ప్రేమించమని బానిసను ఆదేశించడం నాపనికాదు. అలాంటి అఘటన ఘటనా సామర్థ్యం నాకులేదు. పరస్పర ద్వేషపూరిత వాతావరణం ప్రపంచం అంతటా ఆవరించి ఉన్నదని నేనెప్పటినుంచో బాగా ఎరుగుదును. ఈ వాతావరణం రోజురోజుకు ఇంకా ద్వేషపూరితంగా మారిపోతూవుంది, ఇందుకు మనం అభినందించాలి.

రెండు రకాల ద్వేషం

"క్రియాశీలురు కాగోరుతూఉన్న జీవకారుణ్య హృదయులు" అయిన మీరు ప్రపంచంలో రెండురకాల ద్వేషం పని చేస్తూఉందని ఎప్పుడో గుర్తించివుంటారు. ఒకటి పెట్టుబడిదారుల్లో ఉండే ద్వేషం. దోపిడీలో పరస్పర పోటీలవల్ల ఏర్పడే ద్వేషం యిది. రెండవది శ్రామికవర్గ ద్వేషం. వాస్తవిక పరిస్థితులనుంచి ఈ ద్వేషం ఉత్పన్నమయింది. ఇది నానాటికి ప్రబలమవుతూ ఉంది. ప్రభుత్వాధికారాన్ని హస్తగతం చేసుకొనే అధికారం తనకున్నదని శ్రామికవర్గం స్పష్టంగా గుర్తిస్తూవుంది. ఈ రెండు ద్వేషాలమధ్య పొత్తుకుదరడం అసంభవం. ఈ రెండువర్గాల మధ్య సంఘర్షణ జరగక తప్పదు. ఆ సంఘర్షణలో శ్రామికవర్గం విజయం సాధించితీరుతుంది. ద్వేషం నుంచి ప్రపంచాన్ని విముక్తంచేస్తుంది. (సశేషం)

రుతువు

రోడ్డుమీద
సాయంత్రం శవంమీద చీమల్తోపాటు నడుస్తున్నాను
రోడ్డుపక్కన మరిన్ని చీమలు గుంపులుగుంపులుగా వింటున్నాయి
లౌడ్‌స్పీకర్లలో గాడిదలు ఓండ్రబెడుతున్నాయి
ఏమిటదని అడిగాను
'ఎలక్షన్లొస్తున్నాయి నాయకులు ఉపన్యసిస్తున్నారు'
అన్నది ఓ గుమస్తా చీమ.

— నగ్నముని

మళ్లీ వస్తున్నాయి మన ఊరికి

మళ్లీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల డేగలు
రక్తం తాగే రాబందుల మూకలు

కలల కరివేపాకు చెట్లూ
కళ్లలోగిళ్లలోని ఆశాప్రసూనాలు
పాపలూ కనుపాపలూ జాగ్రత్త

రెండు దశాబ్దాల గాయాల నొప్పులతో
విసిగి వేసారిన సూర్యుడు
రాజీలేని ఎర్రని మంటలతో
ఇప్పుడిపుడే ఇంటింటి తలుపు తడుతున్నాడు
ఉషస్సులూ మనస్సులూ జాగ్రత్త

మొత్తంగా రెక్కలిప్పి
ఇనపముక్కలకూ ఉక్కుగోళ్లకూ
లేచిగుల్ల కవచాలు కప్పి
దేశం ఆకాశం నిండా
దోపిడీ దేశభక్తిగీతాలు పాడుకుంటూ
పుక్కిటినిండా పుచ్చు వాగ్దానాల గింజల్ని నములుకుంటూ
వలల వలయాల్ని అల్లుకుంటూ
వస్తున్నాయి డేగలు
రక్తం తాగే రాబందుల మూకలు

పరమ కిరాతకంగా
ప్రజల ప్రాణాల్ని పొట్టనపెట్టుకుంటూ
నైదోడు వంతపాటల్లో
గుండెల్ని అమ్ముకుంటూ
కాలాన్ని వెనక్కినెట్టే
కలవాళ్ళకూ రాళ్ళకూ బాకాపట్టే
రకరకాల జనద్రోహపు సంఘాల
చిలుకపలుకుల డేగలు
మళ్ళీవస్తున్నాయి మన ఊరికి
రక్తంతాగే రాబందుల మూకలు

ఊళ్ళోవాటికి గూళ్ళున్నాయి గుళ్ళున్నాయి
అంతశ్శత్రువుల పళ్ళమధ్య
మనయిండ్లూ నలిగే ఉన్నాయి
అయినా మిత్రులారా పుత్రులారా
శత్రు శిబిరాల శిఖరాగ్రాల మీదికి
దోపిడీ గుండెల పాదాలమీదికి పోరాటం బండల్ని దొర్లించి
ఊరూరికి ప్రాకుతున్న
ఎరుపుండగ వెరపేటికి

అవని మనది ఆకాశం మనది
ఊరు మనది పేరు మనది
మనపేదల ఎదల మెదళ్ళలోని ఎరుపును
ఏ శక్తీ చెరపలేదు
కష్టజీవి కడుపుకొట్టే
ప్రతివ్యక్తిని కాల్చుతుంది
ఈ మూకల కుతంత్రాల్ని
బట్టబయలు చేస్తోంది.

మళ్లీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల డేగలు
రక్తంతాగే రాబందుల మూకలు
ఉషస్సులూ మనస్సులూ జాగ్రత్త
పాపలూ కనుపాపలూ జాగ్రత్త

— చెరబండరాజు

నేతలు

వీళ్ళు
నేతలు
చట్టాల్ని
సేస్తారు
ఏడాదికి
రెండుసార్లు
లోఫర్ సభలో
బ్రాంచాఫీసుల్లో
ఐందా ! ఇక

రాష్ట్రపతి
మొహర్ వొత్తి
దేశానికి
కట్టబెడ్తారు
(దేశమంటే
బుర్రికాదోయ్
దేశమంటే
గొర్రెలోయ్)

వీళ్ళే
ఐదేళ్ళు
జనం ముందర
అడ్డంగా
నిలువుగా
అందంగా
ఉపన్యాసాల
ముగ్గులేస్తారు
సమస్యలమీద
సవతిపక్షాలమీద
చిందులేస్తారు.

వీళ్లే నేనన్నది
చాన్నాళ్ళుగా
నల్లనోట్లకు
రిబ్బన్లు కత్తిరించి
బ్లాక్ మార్కెట్లకు
పునాదిరాళ్లేసి
సోషలిజానికి
మైలురాళ్ళయ్యారని

వీళ్లేగా నేనన్నది
గబ్బిలాలని
అందిన పీతాల
చూర్లు పట్టుకొని
శంకర్ మఠాల
కాళ్ళుపట్టుకొని
వేళ్ళాడ్తారని

స్వయంగా
వస్తున్నారు
పేగులమీద
ఆకలిగోళ్ళ
రక్కుల్ని చూపెట్టండి
భయమెందుకు!
వీధివీధినా
వీళ్ళుచేసిన
దోపిడీల తోరణాలు
వేళ్ళాడగట్టండి

ఓట్లను, నోట్లను
వాళ్ళతోనే
పూడ్చిపెట్టి
తుడుచుకోండిక
నెత్తురు చేతుల్ని.

— ఎస్. మౌలాలి

పట్టుకోండి నేరస్తుల్ని

చేతిలో కాంగ్రెస్ ధ్వజం
మాటల్లో కమ్యూనిజం
ఏపార్టో తెలియకుండా
ఎప్పుడూ ఏదో మెస్మరిజం.

పదవుల ననుసరించి పార్టీ
పార్టీ బలగంమీదే 'అథార్టీ'
నీతీ న్యాయం గురించికాదు
మెజార్టీ పై పేమొగ్గు మైనార్టీ.

ఐదేళ్ళ కొకరోజు
సామాన్యుడు మహారాజు
ఆపైనవీడు బానిస
వాడురాజు - యిది రివాజు.

ఎప్పుడూ వస్తాయి ఎన్నికలు
ఎప్పుడూ పల్కుతాయి బాకాలు
ఎంత హెచ్చరించినా గాని
పప్పులోనే పడుతుంది కాలు.

కట్టేవి ఖద్దరు గుడ్డలు
మెక్కేవి నెత్తురు ముద్దలు
పట్టుబడని నేరస్తులు
మనదేశంలోని పెద్దలు.

చెట్లు చిగురిస్తాయి
లతలు కుసుమిస్తాయి
ఓట్లరోగం వదలగొడితే
ఈదేశమూ వికస్తుంది.

— బి. భారతి

రివిజనిస్టుల సీట్లకింద డైనమైట్లు పేల్తాయి-

తలతో నడిచిందే తప్పించి
చేతులతో తలను సర్దుకున్నదే తప్పించి
ఎప్పుడన్నా ఎప్పుడన్నా
కాళ్ళమీద నిలబడ్డదా
చేతుల్లోకి పోరాటాన్ని తీసుకున్నదా 'నాయకత్వం'

ప్రజా పోరాటాలని బయటపడ్డప్పుడల్లా
తలలమీద నడిపించటానికి కుతంత్రం చేసిందేకాని
సాహసాల ఆయుధాలని విమోచనగమ్యం దగ్గరయ్యేవరకు
చేపట్టమని
ఎన్నడన్నా ఎన్నడన్నా చెప్పిందా 'నాయకత్వం'

తమలో తాము తగలడ్డారేకాని
తలో యింత గడ్డితిన్నారేకాని
కాగితప్పులులను ఒకరిమీది కొకరు విసురుకున్నారేకాని
ఎక్కడన్నా ఎక్కడన్నా
కనీసం పోరాడుతున్న సాహసికులకన్నా
పోరాటం సంగతి చెప్పారా
ప్రజాద్రోహులయిన అహంకారం నెత్తికెక్కిన
ఈ రివిజనిస్టు కిరాతకులు

— ఎక్స్-రే

అహింసా గుండాలు

గుండాలెప్పుడూ పంటలు పండించలేరు
పొలాల్లో నాగలి చేబట్టలేరు
నాట్లు వేయలేరు
రైళ్ళు నడపలేరు
తలమీద తట్టపెట్టుకుని వేగన్‌కి బొగ్గు ఎక్కించలేరు
ప్రజల భుజాలతో భుజాలు కలిపి నడువలేరు.

గుండాలెప్పుడూ సోడాసీసాలతో దాక్కుంటారు
ప్రజల గుడిసెలకి నిప్పెట్టే పెట్రోలు వాళ్ళు
ప్రజా శత్రువుల కాపలా కుక్కలువాళ్ళు
హోటళ్ళలో, అసెంబ్లీల్లో, కౌన్సిల్‌లో గుండాలు
ఆ గుండాలకితోడు లైసెన్స్‌డ్ కాకీయునీఫామ్ గుండాలు
ప్రజల ఆస్తుల్ని వీధుల్లోకి విసిరేసి తగలెట్టే గుండాలు

ఇరవై యేళ్ళు నిండాయి
దోచుకున్నంతా దోచుకున్నారు
ఈ దోపిడీ దొంగలమధ్య పంపకాలు కుదురలేదు
సర్దుబాటు జరుగలేదు
పంపకాల్లో హెచ్చు తగ్గులొచ్చేసరికి
వీధుల్లో పడ్డాయి కుక్కలు
విస్తరించాయి కుక్కలు
కుక్కలుకావు పురుగులుకావు పాములుకావు పశువులుకావు
ఇవి గుండాలు
ఇవి కాంగ్రేసులు

వల్లకాటికి పోయేదారి ట్రాఫిక్ పోలీసులతో సిద్ధంగావుంది
ద్రోహులను పాడెమీదికెక్కిస్తున్నారు ప్రజలు
తలా ఒకచేయివేసి పాడె నడిపించండి
చచ్చిందని డాక్టర్ రిపోర్ట్ ఇచ్చినా

బతికేవుందని పార్లమెంటులూ, ప్రెస్సులూ, రేడియోలు
ప్రకటించవచ్చు
టెలివిజన్‌లో చూపించనూవచ్చు
శవాన్ని కాల్చందే బూడిదని మీకళ్ళతో చూడందే వొదులొద్దు
జాగరణ చేయండి
జాగ్రత్త పడండి

ఏ భాషా ఏ ప్రాంతమూ ఏ ప్రజలూ ఏ దేశమూ
ఏ పూలూ ఏ చెట్లూ ఏ నదులూ ఏ అరణ్యాలు
ఏ సముద్రాలూ ఏ ఎడారులూ ఏ అరణ్యాలూ
మనుషులమధ్య మంచితనంమధ్య శత్రుత్వపు గోడలు నిలుపవు
దోపిడీ దొంగల కుట్రలూ కుళ్ళూ తప్ప
గుండాల ముఠాల దురహంకారాలమధ్య తప్ప
కానిస మనస్తత్వాల వాళ్ళకాపలా కుక్కల మధ్య తప్ప

లాఠీలతో బులెట్లతో పాశవికంగా హింసించిన, చంపిన
గుండాలను కూకటివేళ్ళతో పీకిపారేయండి
మళ్ళీ ఈ పందులమీద పన్నీరుపోసి వేడుకలు చేసుకోకండి
గుండాల పత్రికల పతాక శీర్షికలకు మోసపోకండి
పేదతల్లుల తండ్రుల కడుపుశోకాన్ని
వాళ్ళ ఆకలి అరుపుల్ని మరిచిపోకండి
కొత్త మేకప్‌లో మారుపేర్లతో
ఆ శవం వారసులు అటూ ఇటూ పొంచి చూస్తున్నారు.

మళ్ళీ వొచ్చారా
మన చిన్న పిల్లలమీద లాఠీలు తప్పవు
బుల్లెట్లు తప్పవు
వీధుల్లో నెత్తుటి మడుగులు తప్పవు
ఇళ్ళల్లో కన్నీటి చినుకులు తప్పవు
ఈ కసాయి సంకరజాతి పిచ్చి కుక్కల్ని కాల్చండి
దీర్ఘకాల సాయుధ సమరాన్ని సాగించండి.

—చలపతి

భారతీయ తత్వశాస్త్రం - ఒక పరిశీలన

'ప్రజల చారిత్రిక దశలకు సంబంధంలేని తాత్విక చర్చలు మార్క్సిజానికి విరుద్ధం'

నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

ఇక భారతీయ తాత్విక ధోరణులపై మూర్తిగారి అభిప్రాయాలేమిటి?

చార్వాకుల భౌతికవాదంలో అరాచకాన్ని కనిపెట్టిన (పే. 65) వీరు శంకరాచారి మాయావాదంలో విశాలదృష్టి (పే. 124) ని చూడగల్గారు. బౌద్ధుల శూన్యవాదాన్ని, గతితార్కిక వాదం చేయగల్గిన వీరు, సాంఖ్య, వైశేషిక, న్యాయసూత్రాల్లో అభివృద్ధి నిరోధక ప్రయోజనాల కుపయోగపడటం గమనించాడు (పే. 90). జగమంత మిథ్య అని వాదించిన శంకరుడు, బాహ్యప్రపంచ వాస్తవికతను అంగీకరించటం గమనించాడు (పే 121) నాటి భగవద్గీతలో, నేటి [అధునాతన] శాస్త్రాలను చూశాడు. భారతీయ భక్తిధోరణులు, అరవిందుని భావవాదం సమాజాభివృద్ధికి దోహదం చేశాయన్నాడు. కాని ఏనాటి సమాజంలోని ఏయేవర్గాల అభివృద్ధికో వివరించలేదు.

ఈవిధంగ భావవాదాన్ని, భక్తిధోరణులను [ఆరోగ్యకరమైన సంస్కరణ ధోరణులట [పే. 156] డొంక తిరుగుడుగ బలపరుస్తూ, భౌతికవాద ధోరణులను సన్నగ, మెత్తగ విమర్శించాడు. ఇదే నా మార్క్సిస్టు పరిశీలన?

సంస్కరణ వాదం [ఆదర్శవాదం]

"ఇది వైదేశికధోరణి, ఇది పాశ్చాత్య ధోరణి. కనుక భారతీయ తాత్వికధోరణికి విరుద్ధం అని, ఏ ఒక్క ధోరణిని నిరాకరించటం తగదు. ప్రతిధోరణి మంచిచెడ్డలను పరిశీలించి, తాత్విక పురోగతికి అది సహాయకారి ఔనా కాదా తేల్చుకోవాలి. ఉపయోగకరమైన వాటిని స్వీకరించి, తదన్యాలను నిరాకరించాలి. ఇదే ప్రగతి పథం. [పే. 217].

"గాంధీగారి వ్యాఖ్య [భగవద్గీతపై] చారిత్రికంగా సరియైనా, కాకపోయినా, సృజన శీలం. పాత మాటలకు క్రొత్త అర్థాలు కల్పించటాని కాయన జంకలేదు. పైగా అదే సరైనమార్గమని ప్రతిపాదించాడు. ఇది నిజంగా తాత్విక ఆలోచనలో విప్లవకరమైన మార్పు [పే. 204]

ఈరెండు పేజీల్లోని మూర్తిగారి ఆలోచన ఏమిటి? చారిత్రికంగా సరైందికాకపోయినా, సమాజంలో విప్లవకరమార్పు రాకపోయినా, ధైర్యంగ అర్థాలు మార్చి, తాత్విక చింతనను ముందుకు నడపవచ్చు. సమాజాభివృద్ధికి, తత్వశాస్త్రాభివృద్ధికి ఏమి

సంబంధం లేదు. అందుచేత బూర్జువా ధోరణుల్లోగాని, మరే ధోరణుల్లోగాని వుండే మంచిని తీసుకొని ముందుకు నడవటమే ప్రగతిపథం అంటున్నాడు.

ప్రతి ధోరణిని పరిశీలించి, వాటిలోని మంచిని మాత్రం తీసుకొని, చెడును వదిలేశాడు. వేదాల్లోని భౌతికకార్యాల్ని వదిలేసి, దేవతల్నిగురించి, సృష్టినిగురించిన విషయాలు తీసుకున్నాడు. ఉపనిషత్తుల్లోని భావవాదాన్ని, నాటి మేధావి వర్గంలోని ఉదార వైఖరిని తీసుకొని, వర్ణవ్యవస్థను, అవి సమాజానికి చేసిన నష్టాన్ని వదిలేశాడు [పే. 21]. గౌతమ బుద్ధునిలోని గతితర్కాన్ని తీసుకొని, బౌద్ధమతంలోని శూన్య వాదాన్ని వదిలేశాడు (పే. 65). అద్వైతంలోని సమాన భావాన్ని, విశాల దృష్టిని తీసుకొని (పే. 124) అది జరిపించిన మూకవుమ్మడి నరహత్యలను వదిలేశాడు [పే 116] అరవిందయోగిలోని అజాత శత్రువును తీసుకొని, అతీత మానవవాదాన్ని వదిలేశాడు (పే.   ). భగవద్గీతలోని 'గీత'ను మాత్రమే తీసుకొని, భగవంతుణ్ని వదిలేశాడు. (పే. 162)

ఈవిధంగ మంచిని మాత్రం విడదీసి, చెడును వదిలివేయగలట మనేది ఆలోచనల్లో, సాహిత్యంలో, సినిమాకథల్లో వీలౌంటుందేమోకాని, ఆచరణలో పూర్తిఅసాధ్యం. ఆదర్శాలు వల్లించే వీరులకిది అర్థమౌతుందేమో కాని, క్రియాశీలురకిది అసంభవమౌతుంది.

నేటి పెట్టుబడిదారీ సమాజంలోని మంచిని మాత్రమే అనుసరించి, చెడును వదిలేస్తే, అది సోషలిష్టు సమాజం క్రింద మారవీలుందా? లేదు

గతం తీసుకొని చూసినా అంతే, బానిస సమాజంలో మంచి చెడ్డలు రెండు వున్నాయి. దానిలో మంచిని మాత్రమే తీసుకొని ఫ్యూడల్‌సమాజం పుట్టలేదు, పైగా, చెడును మరొకరూపంలో వెంట కొనితెచ్చింది.

వ్యక్తుల్నిపరిశీలించి చూసినా, ఈ ఆదర్శసిద్ధాంతం అనాచరణీయంగ తేలుతోంది. ఏసుక్రీస్తు, గౌతమబుద్ధుడు, గాంధీమహాత్ములు, అశోకమహారాజులు మంచినిమాత్రమే పంచాలని ప్రచారం చేశారు కాని చరిత్రలో వారు చెడుకు బలియైపోయారు.

కాంగ్రెసు మంత్రి పవిత్రశ్రీ గుల్జారీలాల్‌నందాగారు, లంచగొండితనం నిర్మూలనకు శపథంచేశాడు. ఆచరణలో మార్పుతేలేక, తానే మారిపోయాడు.

కనుక, వ్యక్తిలోకాని, సమాజంలోకాని, ఒక తాత్విక సిద్ధాంతంలోకాని మంచిని తీసుకొని, చెడును వదిలేసినంత మాత్రాన మార్పురాదు. లేక ఆ చెడు దానంతటదే

పోదు దానితో పోరాడి పోగొట్టాలి. చెడుతో పోరాడుట ద్వారా మంచిని నిర్మించాలి ఒకశాత్విక సిద్ధాంతంలోని, చెడుతో పోరాటం అంటే, దానివర్గ ఆర్థిక బునాదిని మార్చుట ద్వారా మాత్రమే అది సాధ్యపడుతుంది. ఈవిధంగ క్రొత్తగ నిర్మించబడిన మంచి పాతదానికంటే భిన్నమైంది. పాత మంచికంటే వున్నతమైంది.

ఇలా మంచిని తీసుకొని, చెడును వదలివేసే ప్రగతిపథంలో మూర్తిగారు ఏకక తత్వ ధోరణిని, ఒక యూనిట్ (Unit) గ చూడలేకపోయాడు. బౌద్ధమతాన్ని వేరుగాను, దాని తత్వసూత్రాలను వేరుగాను విడదీసిచూశాడు. తిరిగి బౌద్ధమతాన్ని 'ఆది బౌద్ధం'గాను, 'అంత్య బౌద్ధం'గాను చెప్పుకొచ్చాడు. తిరిగి ఆది బౌద్ధాన్నుండి, బుద్ధుని నీతి సూత్రాలను విడదీసి చూపించాడు. ఆఖరుకు ఆ నీతిసూత్రాలు సైతం ఈ విభజనను తప్పించుకోలేక పోయాయి. ఇంత గందరగోళం చేస్తే తప్ప గౌతముడు మహాత్ముడు కాలేదు. బౌద్ధమతంలో గతితర్కం పుట్టలేదు

అందుచేతనే, భారతీయ భావవాదాల మధ్య ఐక్యతనుగానీ, భావ, భౌతికవాదాల మధ్య సంఘర్షణనుగాని చిత్రించలేకపోయాడు. బౌద్ధతత్వధోరణి భావవాదమో, భౌతిక వాదమో నిర్ణయం చేయలేక, "ఈ రెంటికి మధ్యేమార్గంలో భౌతికవాదానికి సన్నిహిత మైన గతితార్కిక హేతువాద ధోరణిగ భావించవచ్చు" (పే. 72) అని మనకు సలహా ఇచ్చాడు. ఇంక గొప్ప సూత్రీకరణ ఏమంటే, "నాగార్జునుడు భావవాద పరిధిలో గతి తార్కిక దృష్టిని కొనసాగించాడు" (పే. 73) అనేది.

భారత ప్రజలకు, వారు నిర్మించుకున్న తత్వశాస్త్రాలకు సంబంధాన్నే కలపలేక పోయాడు. ఏ ధోరణినుండి ఏది అభివృద్ధి, ఏది తిరుగుబాటో తెలుసుకోలేకపోయాడు. చార్వాకుల భౌతికవాదంకంటే, బౌద్ధుల శూన్యవాదం గొప్ప అభివృద్ధికరమైన శాస్త్రంగ నిర్ణయించాడు. అన్నిటికంటె ముఖ్యమైన బౌద్ధ, హిందూమతాల సంబంధపరమైన వర్గపోరాటాన్ని చూడలేకపోయాడు.

అవకాశ వాదం (వైరుధ్యాలు)

సంస్కరణ ధోరణి పొడిగింపే అవకాశవాదం. మార్క్సిష్టు మూలసూత్రాల కొలబద్దను పాటించనందున, ఈ తప్పుధోరణి, ఈ పుస్తకం పొడవున నడిచింది,

శ్రీ బాలగంగాధర తిలక్, భగవద్గీతపై వ్యాఖ్యానిస్తూ

"విద్యుక్తధర్మ నిర్వహణలో హింసచేసినా తప్పులేదు" అన్నాడు (పే. 203)

అదే భగవద్గీతపై గాంధీగారి వ్యాఖ్యానంలో

"ఏ సందర్భంలో కూడ హింస కూడదు" అన్నాడు (పే. 204)

ఈరెండు వ్యాఖ్యానాలు ఒకే భగవద్గీతమీద, ఒకే సందర్భంలో, ఒకే దేశక్షేమం దృష్ట్యా, ఒకదాని కొకటిపూర్తి భిన్నంగ జరిగాయి మూర్తిగారు ఈరెంటిని పొగిడారు తిలక్ కర్మయోగి, క్రియాశీలుడు. గాంధీగారిది సృజనశీలమైన వ్యాఖ్య, విప్లవకరమైన మార్పు అని. ఈ రెంటిలో మూర్తిగారి అభిప్రాయం ఏది? అందరిలోని మంచిని తీసుకొనే తొందరలో, ఒకరిలోని హింసను, మరొకరిలోని 'అహింసను'ను కలిపి తనవిగ చేసుకున్నాడు. ఇది పచ్చి అవకాశవాదం యొక్క మచ్చుతునక.

'కోరిక' (Desire) సర్వ అనర్థకాలకు మూలమంటూ, సన్యాసిమార్గం ప్రబోధించేవారిని అంగీకరించరాదు, అన్నా తిలక్. మూర్తిగారి దృష్టిలో ఈయన మహనీయుడు, మహోన్నతుడే.

"కోర్కె" సర్వకష్టాలకు మూలం. సర్వదుఃఖాలకు కారణం, దాన్ని జయించడం ద్వారా నిర్వాణం పొందండి అంటూ గౌతముడు బోధించాడు. ఈయనకూడ మహోన్నతుడు మహనీయుడు.

"పదార్థాన్ని పూర్తిగ త్రోసివేసినా, కర్మ, పునర్జన్మ, నిర్వాణం అంగీకరించినా కూడ బౌద్ధులది భావవాదమనటానికి వీల్లేదు. అది గతితార్కిక హేతువాదదృష్టి (పే. 72). సాంఖ్య, వైశేషిక, న్యాయధోరణులు పదార్థం ప్రాథమిక మని అంగీకరించారు. ఐతే వారు ఆత్మ, పునర్జన్మ, మోక్షం అనేవాటిని కూడ అంగీకరించారు గన్క వారు భావవాదులే. (పే 92) భావ, భౌతికవాదుల విభజనను గురించి, ఏంగిల్సు చెప్పినదానికి పూర్తి వ్యతిరేకమైన నిర్ణయాన్ని చేశారిచట మూర్తిగారు.

భౌతికవాద ప్రచారం ద్వారా, వ్యక్తిగత హింసను ప్రేరేపించిన చార్వాకులు అరాచకవాదులు (పే. 65). అదేరకపు వ్యక్తి హింసలతో పోరాటం నడిపిన 'భగత్ సింగు'లు వీరులన్నాడు. (పే 163). చరిత్రలో దోపిడివర్గాలకు వ్యతిరేకంగ, ఒకే విధానంతో పోరుసల్పిన ఒకరు హింసావాదులు, మరొకరు విప్లవకారులు.

సాంఘిక వ్యతిరేకతను రెచ్చగొట్టిన చార్వాకులు ఉగ్రవాదులు. రాజులచేత, మూకవుమ్మడి హత్యలను చేయించిన శంకరుడు. తన లక్ష్యసాధకుడు తనవర్గాని కొకనీతి, పరాయివర్గానికి మరొకనీతి.

ఈ విధంగ ఈ పుస్తకం పొడవున అనేక వైరుధ్యాలు దొరుకుతున్నాయి. ఒక ధోరణిని ముందు పొగిడి పైకెత్తటం తదుపరి రెండో ధోరణిని పొగిడేపుడు మొదటి దాన్ని తెగడటం మూర్తిగారి పరిశీలన.

"బహుజన హితాయ బహుజన సుఖాయ అనే నినాదంతో బౌద్ధమతం పీడిత జనం మొదలుకొని ధనికులు, రాజులు, మొదలగు అన్నివర్గాల ప్రజలను ఆకర్షించిందన్నాడు (పే 67) తిరిగి భగవద్గీతను పొగడవలసి వచ్చినపుడు "హిందుమతవర్గంలో బుద్ధుని బోధలు పెద్ద ప్రభావాన్ని కల్గించలేదు" అన్నాడు (పే. 165).

ఈరకమైన అవకాశవాద వ్యాఖ్యానాలు. నేటి పైవర్గపు మతవాదులను సంతృప్తి పర్చుటకు పనికివస్తాయి తప్ప సామాన్య ప్రజానీకానికేమాత్రం లాభకరంకాదు.

జాతీయవాదం కూడ (భావవాదమే!)

"విశ్వజనీన సూత్రాలను నిర్వచించిన తత్వశాస్త్రానికి జాతీయ. ప్రాంతీయ సరిహద్దుల్లేవు" (పే. 217) - అదేప్రక్క పేజీలో

"భారతీయ తత్వశాస్త్రంలో అంతః ప్రవృత్తి హెచ్చు.
పాశ్చాత్య ధోరణుల్లో బాహ్య ప్రవృత్తి హెచ్చు.
ఒక్కొకదేశాని కొక్కొక ప్రత్యేకత వుంది" (పే. 218).

ఒకటి అంతర్జాతీయవాదం. రెండోది జాతీయవాదం. ఈరెంటి మేళవింపే బలరామమూర్తిగారి "భారతీయ తత్వశాస్త్రం" ఈక్రింది సూత్రీకరణ గమనించండి.

"గ్రీకు, భారత దేశాల తత్వశాస్త్రాలకు గల ఈ వ్యత్యాసాన్ని మనం గుర్తించక తప్పదు. ఇది మనతత్వశాస్త్రం యొక్క బలహీనతా? లేక ఆధిక్యతా? ఏమైనప్పటికి ప్రత్యేకత అని మాత్రం నిస్సందేహంగ చెప్పవచ్చు" (పే 43).

ఔను. భారతదేశ ప్రత్యేకతను గురించి, మార్క్సుకూడ ఒకచోట అన్నాడు. "భారతదేశంలో ఎన్నిగ్రామాలున్నాయో, అంతమంది రాజులున్నారు. ఎందరు రాజులున్నారో అన్నిమతాలున్నాయి. ఇదీ భారతీయ ప్రత్యేకత" అని.

దీనికి మనం జోడించుకోతగ్గ విషయమేమంటే, ఎన్ని మతాలున్నాయో అన్ని రకాల తత్వశాస్త్రాలుగూడ వున్నాయి" అనేది.

భారతీయ ప్రత్యేకతను గురించి పదేపదే చెబుతున్న మూర్తిగారు. దాన్నిగురించి ప్రత్యేకంగ కొంత వివరణ ఇచ్చివుంటే ఎంతో బాగుండేది. ఇపుడాయన చెప్పినదాన్ని బట్టి, గ్రీకు. యూరోపీయ తత్వశాస్త్రాల బాహ్యప్రవృత్తి అంటే, భౌతిక సుఖాలు— అంటే తిండి, గుడ్డ, ఇల్లు మొదలగునవి— గురించి మాట్లాడుతాయి. భారతీయ తత్వశాస్త్రం యొక్క అంతః ప్రవృత్తి అంటే— ఆత్మ. మోక్షం, భగవంతుడు, గాలి

ఆకాశం వగైరాలు– బ్రహ్మజ్ఞానం గురించి మాత్రమే ఆలోచిస్తాయి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణగారి అభిప్రాయాన్ని అనేకసార్లు ప్రకటించారు– ఐతే మహాభారత యుద్ధం ఆస్తిపోరాటమా? అంతః ప్రవృత్తికొరకా? ఈ జాతీయవాదం యొక్క బునాది ఏమిటి?

వేదాల భౌతికతత్వాన్ని, చార్వాకుల భౌతికవాదాన్ని, సాంఖ్య, న్యాయ, వైశేషిక సూత్రాల్లోని భౌతిక బునాదుల్ని వీరుగుర్తించ నిరాకరిస్తున్నారు భారతీయ భావధోరణు లైన ఉపనిషత్తులు, అద్వైతము, అరవిందులు చెప్పింది మాత్రమే భారతీయ తత్వ శాస్త్రము. ఈ విషయాన్ని మూర్తిగారు ఒక్కముక్కలో ఉటంకించారు. "భారతీయ తత్వశాస్త్రమంటే అద్వైతవేదాంతం ఒక్కటే అనే అభిప్రాయంకూడ ప్రబలంగవుంది" (పే. 118) అన్నాడు. అనగా, అంతః ప్రవృత్తితో బ్రహ్మజ్ఞానం గురించి ఎంత హెచ్చుగ మాట్లాడితే, అంత సిసలైన, అసలైన భారతీయతత్వశాస్త్ర మౌతోందన్న మాట.

వాస్తవానికి, యూరప్‌లో భావ, భౌతికవాదాల ఘర్షణ ఎలా జరిగిందో, భారత దేశంలోకూడ అద్విధంగానే జరిగింది. భేదమంతా మనం వాటిని పరిశీలించటంలోనే వుంది.

మూర్తిగారి, మరొక జాతీయతత్వపు సూత్రీకరణ ఏమంటే, భారతదేశంలోని విజ్ఞానశాస్త్రాలు, యూరప్ దేశంలోకంటే వెనకబడివున్నప్పటికీ (పే 218) భారతీయ తత్వశాస్త్రం గౌతముని కాలానికే గతితార్కిక సూత్రాల్లోని ప్రధాన హంశాలను ప్రతిపా దించిందనేది.

విజ్ఞానశాస్త్రాలు అభివృద్ధి ననుసరించే తాత్వికచింతనలో అభివృద్ధి వుంటుందని మార్క్సిజం చెబుతోంది ఐతే మూర్తిగారు ఈవైరుధ్యపు నిర్ణయాలు ఎందుకుచేశారు? జాతీయ దృష్టివల్లనే ఇంక అనేక తప్పుడు పరిశీలనలు జరిపాడు.

విజ్ఞానశాస్త్రాలు వెనకబడివున్న భారతదేశంలోని చార్వాకులు, గతితార్కిక సూత్రాల్లో ప్రధానసూత్రమైన "పరిమాణాత్మక మార్పులు కొంతకాలం జరిగినమీదట, గుణాత్మక మార్పులు ఏర్పడతాయి" అని కనిపెట్టారు. ఈ మార్పుల్ని మనం ఆధునిక విజ్ఞానశాస్త్ర సహాయంతో గుర్తించగల్గుతున్నాం. 2500 సంవత్సరాల క్రిందటే ఈ విప్లవకర దృక్పథాన్ని ప్రచారంచేసిన చార్వాకుల ప్రతిభ ప్రశంసనీయం (పే. 33)

చార్వాకుల్లోని ఈ విప్లవకర దృక్పథాన్ని మూర్తిగారు ఎలాకనిపెట్టారు? చార్వా కుల బోధల్లోని ఒక చక్కని వుదాహరణద్వారా మనకు చెబుతున్నాడు.

తాటిరసం తీసి, కొంతసేపు కుండలోవుంచితే అది 'కల్లు' ఔతోంది. అంతకు ముందు దానిలోలేని కొత్తగుణం 'నిషా' ఏర్పడుతుందని చార్వాకులు ఇచ్చిన ఒక వుదాహరణను చూపించారు.

ఒక జంతువును చంపిన అనంతరం నాల్గురోజులుంచితే మాంసం క్రుళ్ళుతుందని వేటకాని అనుభవం. మొక్కపీకి ఎండలో వేస్తే ఎండిపోతుందని రైతు అనుభవం. వీటిని గతితార్కికదృష్టి అని మూర్తిగారు చెప్పటం అంటే, ఆధునిక విజ్ఞానశాస్త్ర సహాయంతో కూడ ఆయన గుర్తించలేదని తేలిపోతోంది.

చార్వాకులుకాని, గౌతమ బుద్ధుడుకాని వారి వారికాలపు సమాజాభివృద్ధి కతీతులు కారు. మూర్తిగారు పొగిడినట్లు వారు మహాత్ములుకూడ కాదు. చార్వాకుల కాలానికి విజ్ఞానశాస్త్రాలు అభివృద్ధి చెందలేదని మూర్తిగారే శలవిచ్చారు ఐనపుడు వారు బ్రహ్మ జ్ఞానంద్వారా తత్వధోరణిని అభివృద్ధి చెందించారా? పైగా జ్ఞానసంపాదనలో చార్వాకులు యాంత్రికదృష్టిని అనుసరించారని కూడ వారే అన్నారు. యాంత్రికదృష్టితో ఆలోచించిన చార్వాకులు, గతితార్కిక ప్రధాన సూత్రాలను కనిపెట్టారని చెప్పటం పక్కా జాతీయవాదమే.

గతితర్కం అంటే ?

శాస్త్రీయ గతితార్కిక భౌతికవాదంలోని ప్రధానసూత్రాల్లో కొన్నింటిని గౌతమ బుద్ధుడు కనిపెట్టాడు. మరికొన్నిటిని చార్వాకులు కనిపెట్టారు. మిగిలినవాటిని 'వైశేషికులు' కనిపెట్టేశారు (పే. 128) 19 శతాబ్దంలో మార్క్సు ఏంగిల్సులు వీటన్నిటిని అభివృద్ధి చేశారు (పే. 217).

ఈ జాతీయవాద ధోరణిని, అర్థం చేసుకోటాని కిచట కొంత వివరణ అవసరమౌతోంది

దేవుడున్నాడా ?

లేడు

ఉన్నాడు కూడా ?

ఉండలేదు కూడా ?

ఈవిధంగ ఒక ప్రకటనను, రెండవ ప్రకటనతో వ్యతిరేకించుట ద్వారా వాస్తవ విషయాన్ని తెలుసుకొనేది 'గతితార్కిక ఆలోచనా పద్ధతి' అన్నారు మూర్తిగారు (పే 40).

ఇచట దేవుడాన్నాడా అనేది 'ఆచరణ'కు సంబంధంలేని ఒక వూహ. దీన్ని పూర్వపక్షం చేయుటతో వచ్చేది మరొక వూహ. ఇలా 'ఔను - కాదు' అనుకుంటూ పోయేది వూహలకు స్తీ ఔతుంది తప్ప గతితర్కం కాదు.

'గతి' అంటే 'చలనం' లేక 'కదలిక' (Motion). ప్రకృతికి సంబంధించిన వస్తువుల్లోను, ఆ వస్తువుల కదలిక ననుసరించి, మానవ మేధస్సులో కల్గే ఆలోచన ల్లోను, కల్గే 'కదలిక' ఇది. ఈ చలనం ఏకత్వంగాను, బహుళత్వంగాను ఒంటరిగాను, గుంపులుగాను (quantum), విడిపోతూను, తిరిగి కలుస్తూను, ఎడతెగకుండానూ, అంచెలంచలుగాను ముందుకు సాగుతుంది. మార్క్సిస్టు దీన్ని 'ఐక్యత, వ్యతిరేకతల' కలయికగ చెప్పారు. ఈగతిని తర్కించే ఆలోచననే 'గతితార్కిక దృష్టి' అన్నారు.

ఇది వస్తువుల్లోను, ప్రకృతిలోను, సమాజంలోను జరిగే, క్రమపద్ధతి మార్పుకు సంబంధించి మాత్రమే వుంటుంది. అందుచేతనే 'ఆచరణ'కు సంబంధంలేని గతి తార్కికవాద మంటూలేదు. 'వూహ'కు దీనికి భేదమేచట? 'వూహ'లో దేన్నయినా, ఎపుడైనా, ఎచటనైనా ఔను, కాదు అంటూ పోవచ్చును. అంటే కాలానికి (Time) స్థలానికి (Space) కట్టుబడి వుండనిది 'వూహ' ఔతుంది. తద్భిన్నంగ, పరిణామ సూత్రాలకు లోబడివుండేది 'గతితార్కిక దృష్టి'.

తాటిరసం పులిసి కల్లుగా మారుతుందని, రావిచెట్టు బీజం నుండి మరొక రావి చెట్టు పుడుతుందని, పండు పండిందని, వర్షాలను మేఘాలు కురిపిస్తాయని చెప్పేవన్నీ 'అనుభవాలు'— ఈ వేదనాజ్ఞానాన్ని గురించి మావో ఇలా అన్నాడు.

"పంచేంద్రియాల ద్వారా మనం పొందే జ్ఞానం, కేవలం వస్తువుల వైయక్తిక లక్షణాలు, బాహ్యరూపం, బాహ్య సంబంధాలు మొదలగు వాటినిగూర్చి వుంటుంది. ఈ బాహ్యజ్ఞానాన్ని ఆలోచనాదశకు చేర్చి, వస్తువుల అంతరంగిక వైరుధ్యాలను, అంత స్సంబంధాలను, వాటి పరిణామ క్రమాల పరస్పర సంబంధాలను గ్రహించుటయే 'తార్కికజ్ఞానం'.

భారతం దేశంలో 2500 సంవత్సరాల కాలంనాటి గౌతమ బుద్ధుడుగాని, చార్వాకులుగాని, వైశేషికులుకాని వేదనా జ్ఞానాన్నిమించి గతితార్కిక ఆలోచన లోతుల్ని అందుకున్న ఆధారాలు ఏ మాత్రం లేవు. అందుచేతవారు, పరిమాణాత్మక మార్పులు, గుణాత్మక మార్పుల భేదాన్ని గ్రహించారనిన్నీ, విప్లవకర దృక్పథాలను ప్రతిపాదం చేశారని (పే. 33) చెప్ప బూనుకోవటం, జాతీయవాదపు పరిశీలన మాత్రమే ఔతుంది.

(ఇంకా వుంది)

అతకని బ్రతుకులు

సంపత్‌రావు

శేఖరం అలిగి పడుకున్నాడు. మనస్సు పచ్చి పుండులావుంది. అంతరాల్లో గత స్మృతులు పదును కత్తిలా గుండెను తెగిగివేస్తున్నాయి. కన్నీరు వుడికిపోతున్న మెదడును చల్లార్చుతున్నది. గుండెగాయాలు రెచ్చిపోయినప్పుడు, వేడి నిట్టూర్పులలో ఆత్మ పరితాపము చెందినప్పుడు అనుభవమయ్యే వేదన జీవితంలో మరొకప్పుడు లభించదు. మురిగిపోయిన కండరాలను బ్లేడుతో కోసినపుడు కలిగే స్పర్శసుఖంలాంటిదే ఈ ఆత్మవేదన. శేఖరం ఇలా దుఃఖాన్ని వేపరసంలా త్రాగుతూ పడుకున్నాడు గదిలో నిశ్శబ్దత అతనికి మరింత నిషా కలిగిస్తున్నది ఎంత ప్రయత్నించినా గత జీవితాన్ని మనసునుండి లాగివేయలేక పోతున్నాడు.

* * *

"ఇక్కడే వుండిపోయి సేద్యం చూసుకుంటాను నాన్నా" తండ్రికి జబ్బుగా వుందని కబురుచేస్తే వచ్చిన శేఖరం దూరభారం ఆలోచించిన మీదటే ఈ మాట అనవలసి వచ్చింది.

కుటుంబం అప్పులపాలై పోయింది. నెమ్మదిగా జరిగినంతకాలం భరోసాగానే వుండిపోయారు అప్పులవాళ్ళు పరిస్థితుల రచ్చకెక్కడంతో కాగిత పత్రాలతో కంది రీగల్లా ముసురుకున్నారు. ఇప్పుడుకాదప్పుడని బండిని లాక్కుపోతున్నాడు తండ్రి. కాని యెంతకాలం? అప్పు ముప్పేగా. చూచే దిక్కులేక సేద్యం కాకులు పొడుస్తున్న టక్క గొడ్డులా వుంది. పరిస్థితినంతా అవగాహన చేసుకున్నాడు శేఖరం. ముసలితనంలో తండ్రిని ఈస్థితిలో వదిలిపెట్టి కాలేజీ చదువు వెలిగిస్తూన్నందుకు అసహ్యం వేసింది. నిశ్చయాన్ని ప్రకటించి ఊరుకున్నాడు.

కొడుకు మాటలకు సుందరయ్యగారికి ఆశ్చర్యమూ, భయమూ వేసింది. ఆయన తండ్రితాతలు వ్యవసాయంతోనే కుటుంబాన్ని, దర్జాగా పోషించారు. ఆ వ్యవసాయమే ఈనాడు కుటుంబావసరాలను తీర్చలేక కృంగదీసింది. వ్యవసాయంతోపాటు ఇతర వ్యాపకాలు పెట్టుకున్నవాళ్ళు యెందరో బాగుపడ్డారు. ఇవాళతిండే రేపు కడుపుమాడ్చుకున్న వాళ్ళంతా చూస్తుండగానే ఎంతో ముందుకు వెళ్ళిపోయారు. కంట్రాక్టులో వేలకు

వేలు గడిస్తూన్న శంకరయ్యా. రాజకీయ నాయకుడుగా పేరు ప్రఖ్యాతులతో పాటూ ప్రజలకోసం ఆస్తిని పెంచుకుంటూన్న కొమర్రాజూ, చేస్తున్నది చిన్న ఉద్యోగమైనా నేర్పుతో లంచాలు గుంజి ఊళ్ళో అందరికన్నా యెక్కువగా భూవసతి సంపాదించిన సబిన్స్పెక్టరు కనకాంబరం కొంతకాలం క్రితం తనకు చేతులుచాపిన వాళ్లే. వాస్తవం చెప్పాలంటే రిక్షాడ్రైవర్ పేరిగాడూ, హోటలు సర్వరు మల్లప్పా, కిళ్ళీకొట్టు నాగోజీ, సైకిలుషాప్ పీర్ సాయెబు, దర్జీపని వీరప్పా తక్కువ హోదాగల వాళ్ళయినా ప్రస్తుతం తమకన్న బాగానే బ్రతుకుతున్నారు. అప్పుల బాధలేకుండా యేరోజుకారోజు నాలుగు డబ్బులు చేతుల్లో ఆడుతున్నవి. వీళ్ళంతా వ్యవసాయమే చేస్తున్నారామరి? నిజంచెప్పాలంటే వ్యవసాయం చేసి చితికిపోయి తరువాత బాగుపడ్డాళ్ళేనయిరి. అందులోను తమ బోటి వంటిచేతిగాళ్ల సేద్యాలు ఈ రోజుల్లో మరీ తీసిపోయినవి ప్రతిచిన్నపనికీ ఇతరులపై ఆధారపడాలి. జీతగాళ్లూ, కూలివాళ్లూ వెనకటిలా విశ్వాసంగా పనిచేయటంలేదు. ఆ రోజుల్లో యజమాని ఇంట్లో దీపం చల్లగావుంటే చాలనుకునేవారు. చేమటోడ్చి పనిచేసి పంటలు పండించేవాళ్లు. యేం కాలమోగాని ప్రజల బుద్ధులు పూర్తిగా మారిపోయాయి. తాము యింట్లో కూర్చుంటే పాలేళ్ళు పొలంలో పడుకుంటారు కసురుకుంటే దులుపుకుపోయి వేరేపని చూసుకుంటారు. తన చిన్నతనంలో సుంకిరి పుల్లిగాడు పనిలోకి సరిగా రావటంలేదని చెప్పుతో నాలుగుతన్ని వెళ్ళగొడితే వాడు అటుతిరిగి ఇటుతిరిగి యేపని చిక్కక చక్కావచ్చి కాళ్ళుపట్టుకుని పనిలోచేరాడు. యిప్పుడయితే అట్లా జరుగుతుందా? దేశమంతా అడ్డదిడ్డమైన పనులు పుట్టుకొచ్చాయి. వ్యవసాయ కూలీలకంటే యితరపనుల వాళ్లకే ఎక్కువ గిట్టుబాటుగా వున్నది. పోయినయేడు తమ గ్రామానికి పంట కోతల కాలంలో కాలువపని వచ్చింది. వాళ్ల రోజుకు రెండు రూపాయిలు ఇస్తామన్నారు. కూలీలంతా అటే విరగబడటంతో సమయానికి కోతలు పూర్తిగాక నానా అవస్థలు పడ్డారు. "ఊళ్ళోపంట పాడుచేస్తారర్రా" అని మొత్తుకుంటే "మీరిచ్చే నాలుగుశేర్లకని రెండు రూపాయిల కూలి పోగొట్టుకుంటామా!" అన్నారు కూలీలంతా. అది నిజమే. కాని తాము రెండురూపాయిలెట్లాయిచ్చి చచ్చేది?

ఇదంతా తన కొడుక్కి తెలిసినట్లులేదు. "రైతే దేశానికి వెన్నెముక, అన్నదాత" అనే కట్టుకథలన్నీ కాగితాల్లో చదివి వుంటాడు. ఈనాడు నికృష్టంగా బ్రతుకుతున్నది రైతేనన్న అనుభవం వాడికిలేదు.

తన కుటుంబం తలమునిగే అప్పుల్లో పడిపోయింది. ఇంకో సంవత్సరం యెలాగో కష్టపడితే కొడుక్కి ఉద్యోగం దొరక్కపోదు. ఈ బండబారిన సేద్యమేదో

తను చూచుకోగలడు. రెండుచేతులా సంపాదన కలిసివస్తే తొందరలోనే నలుగుర్లో కలిసిపోవచ్చు. స్థూలంగా సుందరయ్యగారి ఆలోచన ఇది. అందుకే "నీవనుకున్నంత తేలిక గాదురా సేద్యం నాలుగురాళ్లు వచ్చే ఉద్యోగం చూసుకుందువుగానీ," అనకుండా వుండలేకపోయాడు. ఆయన అనుభవానికి గోచరమైన పరిష్కారమార్గం అదే.

తండ్రి మాటలకు శేఖరం నివ్వెరపోయాడు. అతనికి ఉద్యోగమన్నా సంపాదనకోసమే పరిమితమైన నేటి కాలేజీ చదువులన్నా చెడ్డ అసహ్యం. ఉద్యోగాలకోసం కాళ్లకు బలపాలు కట్టుకతిరిగే వాళ్ళని ముఖాన్నే తిట్టిపోసేవాడు. రెండక్షరాలు పొట్టలో పడగానే యే ఆఫీసులోనైనా చొఱబడాలని ఆదుర్దా పడకపోతేయేం. స్వతంత్రంగా జీవించే ఆస్కారం లేదా? జీవితంలో ఆదర్శంగా స్థిరపడిపోయి సమాజంలో మార్పు తేవచ్చునే. ఈ చేతగాని వెధవలంతా నాలుగురాళ్ళకోసం ఆత్మను అమ్మేస్తున్నారు. ఆశయాలనూ, అభిరుచులనూ పొట్టకూటికోసం ఖూనీచేసుకుంటున్నారు. కేవలం ఆత్మసుఖం కోసం అఱ్ఱులు చాస్తున్నారు. ఎగ్జిబిషను బొమ్మల్లా పెళ్ళాలకు అందంగా రంగులువేసి, నాలుగుగోడలమధ్య చెఱబట్టి అనుభవించడం. బ్రతుకును సాధ్యమైనంత తేలికగా గడిపివేయడం, బయటి ప్రపంచాన్ని మనసులోకి రానివ్వకుండా జాగ్రత్త పడడం— శేఖరానికి తగనిమంట.

కాలేజీ విద్యార్థుల జీవితాలు యెంత సంకుచితమో తలుచుకున్నపుడు శేఖరానికి కడుపులో తిప్పేది. వీళ్ళ జీవితాలలో నవీనమైనదీ, విప్లవాత్మకమైనదీ యేమీలేదు. పదిమందితోపాటే చస్తామంటారు. బాధపడటం, త్యాగం చెయ్యడమంటే పెద్దపులిని చూచినంత భయం. తాము నివసిస్తున్నది మానవ ప్రపంచంలోనన్న ధ్యాసేలేదు. ప్రపంచ పరిణామాల గురించి స్టడీచేయరు. ఎవరో గిరిగీసి చూపించిన మార్గమే తప్ప ఇతరత్రా దేనినీ పట్టించుకోరు. ఉల్లాసంగా కాలాన్ని దిగమ్రింగడమే వీళ్ళ జీవిత పరమావధి. యిలా ఆలోచించిన కొద్దీ శే ఖ రా ని కి కాలేజీ జీవితం అసహనమైపోయింది.

శేఖరం ఒక రకమైన మనస్తత్వాన్ని వంటపట్టించుకున్నాడు. సమాజంలో మార్పు నవ వసంతం లాంటిది. నిశ్చింతగా బ్రతకడమంత క్షుద్రమైనది మరొకటి లేదు. ముళ్ళత్రోవలో పయనించాలి. ఆత్మ వేదనలో అభిప్రాయాలను శుభ్రపరచుకోవాలి. ప్రయోజనం కోసం ఎంతటిత్యాగమైనా చేయడానికి సిద్ధంగావుండాలి. అప్పుడే జీవితానికి సార్థకత. ఉద్యోగం చేస్తే ఈ భాగోతమంతా కాల్చి పారేయాల్సిందే. తండ్రితో స్పష్టంగా చెప్పేశాడు.

"ఉద్యోగమంటే బానిసబ్రతుకు నాన్నా. పదిమందికి సాయపడుతూ సేద్యం చూసుకోవాలని నిశ్చయించుకున్నాను.'

కొడుకు మాటలకు సుందరయ్య మరోలా అభిప్రాయపడ్డాడు ఆయన దృష్టి కోణమువేరు. వయసులో వున్నప్పుడు గ్రామంలో పెత్తనం చలాయించి కొంప లార్చాడు. జనమంతా కన్నుగీటితే కదిలివచ్చేవారు. ఇప్పుడు వేరే కుఱ్ఱకుంకలంతా సాగించుకుంటున్నారు. శేఖరం చదువుకున్నవాడు తెలివైనవాడు పదిమందిని గుంపు కట్టి గ్రామంలో భళీ అనిపించుకుంటాడు. తను నిశ్చింతగా వుండొచ్చు. అందుకే శేఖరం నిశ్చయాన్ని ఒప్పుకున్నాడు.

భిన్న మనస్తత్వాల మధ్య ఇరుక్కుపోయిన ప్రారంభదశను జ్ఞప్తికి తెచ్చుకుని చేదుగా నవ్వుకున్నాడు శేఖరం గతాన్ని త్రవ్వి పోసుకోడంలో మనస్సు తేలిక పడుతూన్నది. లేచి కూర్చుని సిగరెట్టు దమ్ములాగి పొగ వదిలాడు. జీవితాన్ని నెమరు వేసుకోడం ప్రారంభించాడు.

* * *

"ఎల్లుండి మీ తాతయ్యశ్రాద్ధం. సంసారం తెరిపిలేకపోయినయేడు బ్రాహ్మడికి బియ్యమిచ్చి తృప్తిపడ్డాను. ఇప్పుడుకాస్త సంతృప్తిగా జరిపిద్దాం' కొంచెం తయాయించుకుని మళ్ళీ ప్రారంభించాడు సుందరయ్య. "మీతాతంటే మామూలుమనిషా? బ్రతికినన్నాళ్లూ నెయ్యి కారంగా తిన్నాడు. నాలుగు డబ్బులు జేబులో లేకుండా ఒక నిమిషం వుండలేదు. ఆయనతోనే పోయింది లక్ష్మమ్మోరు ఆదినాలు తల్చుకుంటే మనసు దిగులుపడిపోతుంది." విచారంగా ముగించి తలవంచుకున్నాడు.

శేఖరం ఓపికగా ఆలోచించాడు. ఇది వట్టి ఛాందసం, చనిపోయిన వాళ్ళ పేరు చెప్పుకుని బ్రాహ్మణులతోపాటూ సపరివారసమేతంగా సుష్టుగా మెక్కడంకన్న ప్రయోజనంలేదు. నాన్నగారేమో ఆప్యాయంగా కోరుకుంటున్నారు. ఏమైనా తన లాంటివాడు ఈ అర్థం పర్థం లేనివాటిని ఊరేగిస్తే అవివేకం. మధ్యేమార్గం ఆలోచించి "ఇబ్బందిగావుందినాన్నా. ఈయేడుకూడా పోయిన ఏడాదిలాగానే సాగనంపుదాం. దినాలు బాగాలేవు. ఇట్లాంటివి ఒకటొకటి వదులుకోవడం మంచిది."అన్నాడు

దీంతో ఊహించనంతగా దుమారం రేగింది. "విన్నారర్రోయ్ మాయింటి పెద్ద నిర్వాకం. పెద్దలకు పిండం పారవేయటం కూడా దద్ధదండుగేనట. ఎంతచెయ్యి తిరక్కపోయినా ఇట్లాంటి కార్యాలంటే మన రోజుల్లో అయితే వెనకాడామా? ఇప్పుడు పెద్దలంటే బొత్తిగా గౌరవం పోయింది ఈ ప్రయోజకులంతా కలసి

అయ్యో—దేనికి పనికిరాకుండా పండుబారి పోయారుకదా ఇంకా బ్రతికి యేం జుబ్బుకుంటారు? తొందరగా ముగింతురూ. "అంటారనటంలో అనుమానంలేదు. వాడేమో మొండిరాత రాసిపెట్టాడు" మొఖాన కొంగు పెట్టుకొని ఊళ్ళోని ముడుగులకంతా యెక్కించి వచ్చాడు తండ్రి.

చావుకు దగ్గర్లో వున్నామనుకున్న వాళ్ళంతా గుంపులు కట్టి సాగదీశారు బ్రతికుండగానే ఇది జరగనిస్తే హరీమన్న పిదప ఇక తమను కుక్కలుగూడ తలవవు. పెద్దలు ఊరికేనే అన్నారా "పిండాలు పెట్టకపోతే ఆత్మ ఇంటిచుట్టే అరుస్తూ తిరుగుతుంద"ని. అంతా శేఖరానికి తీవ్ర నిరసన తెలిపారు.

ఆరోజు రాత్రి సుందరయ్య భోంచేయలేదు "బుక్కెడు వేస్తే దిగమ్రింగడం కన్న ఈయింట్లో మనచేతిలో ఏమున్నది? నేను బ్రతికుండగానే మునలాడికి పిడికెడు మెతుకులు లేని గతి పట్టింద"ని మునల్దానితో వెళ్ళబోసుకున్నాడు. శేఖరం తట్టుకోలేకపోయాడు. అతన్ని ఎవరూ సమర్థించలేదు. మూర్ఖునికింద జమకట్టారు శ్రాద్ధం జరిగిపోయింది. ఎన్నడూ లేనన్ని లాంఛనాలు పెట్టించి దిష్టితీశారు ఆ రోజునుంచీ శేఖరానికి వాస్తవ జీవితంతో పెనగులాట ప్రారంభమయింది.

* * *

కుటుంబ బాధ్యతల్ని నెత్తిన పెట్టుకున్నాక తండ్రిచేసిన అప్పుల్ని లెక్కకట్టి గుండె అదిమి పట్టుకున్నాడు శేఖరం. పదివేలు! ఇంత అప్పు యెందుకు చేసినట్లు? కొందరిలా ఆయన త్రాగుబోతుగాదు. అందరూ ఆయనను మంచివాడుగానేకాక తెలివి గల వాడనికూడా గుర్తించుతారు. అయితే యేం లాభం? గీత గీతేనంటారు. తనతాత బంగారు కడియం చేతికి తొడుక్కొని వీధరుగుపై కూర్చునేవాడు. పదిమంది చేరగానే చొక్కా చేతినిపైకిలాగి ధీమాగా కూర్చునేవాడు. డబ్బున్నవాడిని గౌరవించాలని ఆయన భావన. స్థితి పరడుగానే ఆయన అధిక్యతను అందరూ గుర్తించారు ఇది శేఖరం చిన్ననాటి పరిస్థితి. ఇప్పుడంతా తారుమారయ్యింది.

ఒకనాడు బాగా బ్రతికిన కుటుంబాలన్నీ నేడు ఆర్థికంగా పతనమై పోవడానికిగల కారణాలను శేఖరం గ్రహించాడు. వెనుకటి ఆచారాలతోపాటూ నేటి నాగరిక సమాజపు అలవాట్లను విధిగా పాటించడంతో మితిమీరిన అవసరాలు పెరిగిపోయాయి. సమాజ గమనం మారడంవల్ల దొడ్డిదారి ఆదాయాలు బాగా పడిపోయాయి. సొంత ఆదాయంతో సర్దుకుని మంచమున్నంతలో కాళ్ళు ముడుచుకోడానికి పరువు ప్రతిష్ఠలు

గంగపాలైతాయని వాపోతున్నారు. అవసరంకోసం అప్పుచేయడం, అపకీర్తిపాలు కావడం— ఇదీ నేటి మధ్యతరగతి కుటుంబాల స్థితి.

శేఖరం ఇలాంటి విషయాలన్నీ బాగా బోధపరచుకుని పరిష్కార మార్గం ఆలోచించిపెట్టాడు. అతని ఊహ ఇది. కుటుంబాన్ని తన ఆశయాలకు అనుకూలంగా మలచి పెట్టుకోకపోతే జీవితానికి అర్థంలేదు. దండగ ఖర్చులన్నీ తగ్గించాలి, వ్యవసాయాన్ని అభివృద్ధిచేయాలి. అందరూ నేర్చుకొనేలా కుటుంబాన్ని నడుపాలి.

ప్రథమ కర్తవ్యంగా శేఖరం అప్పుకోసం అగచాట్లు పడవలసిన గతి పట్టింది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా గడిచేట్లులేదు. ఎక్కడికెళ్ళినా "ఇచ్చింది వస్తేనే పదివేలని" చెప్పికొడుతున్నారు. చివరికి ఓ శెట్టివద్ద దాపరికం లేకుండా వాలకబోసుకున్నాడు తండ్రి చేసిన బాకీ యెడమకు వ్రాసుకున్న శెట్టి యెఅనుపెట్టి చేపను గుంజాలనుకున్నాడు. అంతా కలిపియిస్తే అవసరం తీరుస్తానన్నాడు.

శేఖరం అంగీకరించి కాగితం కొత్తచేసి ఊపిరి తీసుకున్నాడు.

శేఖరం ఆశించిన దానికి అంతా భిన్నంగా జరుగుతూన్నది. శ్రద్ధగా పనిచేసి పంటలు కలిసివస్తే అప్పులు సర్దవచ్చుననుకున్నాడు. ఇంట్లో ఎవ్వరూ దీన్నిగురించి ఆలోచించడం లేదు. వీల్లుపోకుండా అన్నీ విధిగా జరిగితీరాలని పంతంవేసి కూర్చొంటున్నారు.

"తిరుపతిపోయి స్వామి దర్శనం చేసుకోవాలనుందిరా శేఖరం" సుందరయ్య అభ్యర్థించాడు. శేఖరానికి పక్లమండి పోయింది. నిన్ననేమో దసరా పండుగనాడు కొత్తబట్టలు లేనిదే జరుగదని పట్టుబట్టి నెగ్గించుకున్నారు. ఇవాళే ఈ భారతం వచ్చి పడింది. ఏది అవసరమో యేది అనవసరమో గుర్తించకుండా ప్రవర్తిస్తున్నాడు తండ్రి. ఆయనకూడా సంసారాన్ని యీది ఆలసిపోయిన వాడే. మండిపోతున్న గుండెను చల్లార్చుకుని అన్నాడు శేఖరం.

"చూడునాన్నా, మనమూ పుట్టెడప్పుల్లో వున్నాం. అవి తీర్చుకోనిదే దివ్వం కూడా పుట్టదు. నీకు తెలియందేముంది?" నచ్చచెప్పానని సంతోషించాడు శేఖరం. అది తనకు గర్వకారణమని మురిసిపడ్డాడు. కాని వెంటనే అదిరిపడ్డాడు.

"ఏదో ముసలివాడు బ్రతికినన్నాళ్ళు బ్రతుకుతాడా? "యెప్పుడూ ఈ జంజాటమేనాయె. స్వామిదర్శనం చేసుకుంటాడట. కాదనకు" అన్నాడు కోడెల్లాంటి కొడుకుల తండ్రి.

ఈ ముసలాళ్ళంతా కలసి కట్టుగా యెందుకు వాదిస్తారో శేఖరానికి తెలుసు. యే కొడుకు తండ్రిపాటకు తాళం కొట్టకపోయినా తొందముదిరి ఊసరవెల్లి అవుతూందనీ, బోసినోటి కోరికలన్నీ చంపుకోవలసి వస్తుందనీ వీళ్ళకుతెలుసు. అందుకే అయినదానికీ కానిదానికీ ఒకరికొకరు సాయమై కొడుకులను సాధించుకుంటారు. తమతద్దినాలు తెల్లవార్చడానికే కొడుకులను కన్నామని వీరి ఉద్దేశము. ఇలా తేల్చేసుకుని శేఖరం కస్సుమన్నాడు కాని యేంలాభం? తంటిరి వాదనముందు తను నిలువలేదు. ఆయన తల్చుకున్నది జరిగితీరాల్సిందే. ఆయనట్లా బ్రతికాడు.

* * *

"ఈ మాసంలో అక్కయ్యకు సారె పెట్టాలి. ముందు ముహూర్తాలు లేవని శాస్త్రులు చెప్పాడు" అన్నంతోపాటు ఇదికూడా వడ్డించింది తల్లి. శేఖరానికి ఏమనాలో తోచలేదు. అంటే మాత్రం ఏమి ఆగుతున్నది? తను నిమిత్తమాత్రుడు. ఫలితం ఏమైనా ఉద్దేశం బయటపడితే మనసుకన్నా ఊరట కలుగుతుంది.

"అమ్మా ఈ సంవత్సరానికి వాయిదా వెయ్యకూడదే" అన్నాడు సమయం కోరుతూ శేఖరం.

"ఆ! అవేం మాటలురా. శుభమా అని అది మన ఇంటికివస్తే జానెడు రవికగుడ్డయినా పెట్టకుండా వెళ్ళగొడితే నలుగురేమనుకుంటారు? దిక్కులేనిదై మనింటికి వచ్చిందా? దానిది గంపంత సంసారం. చుట్టరికం వదలుకుంటామా పిల్లలున్నచోట' అత్యవసరమూ, అతి ముఖ్యమూ, సంసారగతమైన ఆచారాలన్నీ ఏకరువుపెట్టింది.

శేఖరం తల్లి ఏం చేయదలచుకున్నా చేసికాని ఊరుకుంటుంది ఆమె తెచ్చే వాదనలన్నీ సాంప్రదాయ సిద్ధంగా నిర్దేశించబడిన నిబంధనలు. వాటిముందు తన విధానాలు గడ్డిపోచకన్న కనాకష్టమైనవి, నోరు కదపలేకపోయాడు.

ఆ సాయంత్రం శేఖరం పొలంవైపు వెళ్ళి యింటికొస్తున్నాడు పక్కింటిముందు పొరుగింటి అమ్మలక్కలంతా సమావేశమై చెవులు కొరుక్కుంటున్నారు. తన్నుచూచి మూతివిరిచి ముక్కుమీదవేలు వేసుకున్నారు. మధ్యతరగతి కుటుంబాల్లో ఈ అమ్మలక్కలది ప్రత్యేకమైన పాత్ర. గాలి కబుర్లకు తోకలు తొడిమలు చేర్చి సుయ్‌మంటే రోకటి పాటగా అందుకుంటారు. ఆనోటా ఆనోటా అది తొలుత ప్రారంభించిన వాళ్ళకే తెలియనంతటి రూపం సంతరించుకుంటుంది. పడుచువాళ్లో పడకటింటి గుసగుసలు, మెతకబడిపోయిన ముత్తైదువుల మొగళ్ల చీకట్లో మిడికివచ్చిన ముండల మర్మస్థానాలు,

ముసలి మొగుళ్ళ సరసాలు, గోప్యంగా మాట్లాడుకున్న కుటుంబ విషయాలు అన్నీ వాళ్ల చర్చలతో వీధికెక్కవలసిందే.

"ఆడపిల్లయిం తర్వాత సారెచీరె ఆశపడకుండా వుంటుందర్రా— చోద్యం కాకపోతే" అన్నది, ముసలి మొగవి పేరుమీదుగా పిల్లల్నికని వ్యామోహాన్ని చల్లార్చుకుంటూన్న ఒకామె. వెంటనే మరొకామె అందుకొని "పాడుబుద్ధులు' అన్నది— అల్లుణ్ణి మరిగి బిడ్డకు విషం పెట్టిన ఉత్తమ ఇల్లాలు.

వీళ్ల జీవితాల్లోపలి కుళ్ళంతా తనకు తెలుసు చెడామడా నాలుగు వడ్డిద్దామనుకున్నాడు అయినా వీళ్ళదేం తప్పు? తల్లి ఊదందే ఈగోల పుట్టలేదుగదా. సంబాళించుకుని ఊరుకున్నాడు.

* * *

"అంతాకలిసి వచ్చిందిరా శేఖరం, నాన్న దైవదర్శనం చేసుకుని వచ్చాడు. చుట్టపక్కాలను పిలిపించి తీర్థపూజచేస్తే ఖర్చు వెళ్ళిపోతుంది" ఇంట్లోకి కాలుపెట్టగానే కాపురం చేయటంలోవున్న సుఖవుమ బోధించింది అక్కయ్య.

"మహబాగా చెప్పావే తల్లీ. అంతమాత్రం తెలియందే అవలీలగా పెట్టుకొస్తున్నావా కాపురాన్ని" తాళం వేసింది తల్లి. శేఖరానికి వళ్లుస్వాధీనం తప్పిపోయింది. అంతా మనుష్యుల్ని పీక్కుతినే దయ్యాల్లా కనిపించారు. "కట్టకట్టుకుని గంగలో దూకి చావండి. పీడవిరగడైపోతుంది" అన్నాడు ఉక్రోషంగా.

ఇంకేం. ఇంట్లో గంద్రగోళం లేచింది, తల్లీబిడ్డా ఒకళ్ల నొకళ్ళు పట్టుకుని ఏడ్చారు. "మేముండగానే ఇంట్లో నీకీగతిపట్టిందే తల్లీ తర్వాత నిన్ను మందలించే దిక్కుండదు, అంతా వాళ్ల ఆజ్ఞైపోతుంది."

శేఖరానికి ఏడుపొచ్చింది. గదిలోకెళ్లి ఎవరూ చూడకుండా వెక్కి వెక్కి ఏడ్చాడు ఈ లంపటం ఎందుకు తగిలించుకున్నానని బాధపడ్డాడు. ఇక వీళ్ళమధ్య తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోలేడు.

అంతా సవ్యంగానే జరిగిపోయింది. దిమ్మవదిలించి చుట్టపక్కాలు వెళ్ళిపోయారు. శేఖరం పిచ్చివానిలా చూశాడేకాని దేన్నీ ఆపలేక పోయాడు.

* * *

"ఇన్ని దండుగలు తెల్లార్చుకున్నారు గదా ఎన్నాళ్లనుంచో అడుగుతుంటే ఒక పట్టుచీర తెచ్చిపెట్టారూ? అన్నది పెళ్ళాం. ఆకోరిక తీర్చనిదే శరీరంపై ఎవరికీ హక్కు లేదన్నట్లు నసుగుతూ.

పెళ్ళాం ప్రక్కలో పడుకున్న శేఖరానికి సోమిశెట్టి జ్ఞప్తికిరాగానే చివుక్కుమనిపించింది. కళ్ళల్లో నీళ్లుతిరిగాయి. పెళ్ళాం అంటే జీవితాన్ని ముందుకు సాగనివ్వకుండా జుట్టుపట్టికుని లాగేదేనని దృఢపరచుకున్నాడు. అయినా కావుపట్టిన ప్రతిమగాడూ ఆడదానిని ఎందుకు ముడిపెట్టుకుంటాడో అర్థంకాలేదు. ఈరకం మగాళ్ళంతా బ్రతుకును కుందించుకునేందుకే తాపత్రియ పడతారు. బహు ముఖంగా వ్యాపిస్తే దేన్నీ అందుకోలేక హైరానైపోతామని ముడిసివున్నచోటే కూర్చుంటారు.

ఆరోజు సోమిశెట్టి తాడోపేడో తేల్చుకోనిదే లేవనని పట్టేసుకుని కూర్చున్నాడు రెండు జాములైనా కదల్లేదు. దుప్పటి పరుచుకుని వాకిట్లో పడుకున్నాడు.

"ఇవ్వలేకపోతే అప్పులేమని చెప్పి కాగితాలు తీసుకోండి" అన్నాడు సోమిశెట్టి.

దాంతో శేఖరం తండ్రికి జన్మగతమైన ఆగ్రహం కలిగింది— "మా పెద్దలు మీ పెద్దల కప్పు పెట్టర్రా. యిచ్చిన వాళ్లకు యిరువయ్యేకటో వేలు చూపెట్టడమంటే ఏమిటో మీ నాన్ననడిగి తెలుసుకో. ఎంత పుచ్చినా ధన్యాలకన్న జొన్నలు బరువే" మాతాత నెయ్యి తాగాడు— కావలిస్తే మూతివాసన చూసుకోమన్నట్లు సుందరయ్య అన్నాడు.

"మెడపట్టి గెంటినా జరిగేదిలేదు. ఇచ్చినాసరే మెచ్చినా సరే" సోమిశెట్టి మరీ భీష్మించాడు.

సముదాయించి పంపిద్దామని శేఖరం జోక్యం కలిగించుకుని అన్నాడు. "ఇన్నాళ్లు ఓపిక పట్టావు. ఈ నాల్గురోజు లాగుతే పంటలపై తీరుస్తాను".

"ఎన్నాళ్లయ్యా ఆగేది? పెండ్లికి యిచ్చినబాకీ పిల్లలుకనే ఈడొచ్చినా ఇవ్వలేకపోతే సొమ్ము మీకోసమే సంపాదించి పెట్టామా?"

శేఖరానికి చంపపెట్టయింది. అవమానంతో వళ్లంతా కూలబడి పోయింది— 'ఇంకా నయం. పెళ్ళాంతో కులికేటప్పుడైనా నేను కన్పించనా' అనలేదనుకున్నాడు. ఆ మాటలు ఉతల్చుకుని శేఖరం గుండె చెరువు చేసుకున్నాడు. ఏం లాభం? మాటలుదక్కేట్టు లేదు వీధిలో అప్పువాళ్ళతో అభానుపాలు కావలసి వస్తుందేమో! ఆరాత్రింతా శేఖరం కుమిలిపోయాడు.

* * *

శేఖరం పరిస్థితినంతా తరచి తరచి చూచుకున్నాడు. చీకటి దయ్యంలాంటి వాస్తవం బయటికొచ్చింది. తల్లీ, తండ్రీ, భార్యా తనను అర్థంచేసుకోలేదు. వాళ్ళ

సంస్కారానికి అందకుండా ఉన్నవి తన ఆదర్శాలు. నలుగురిలో కలిసి బ్రతకడమే వాళ్లకు కావలసింది. మానవత్వపు విలువలను కొలతలోకి తీసుకోరు. ఇన్నాళ్లబ్రతుకుతూన్న బ్రతుకులో యేచిన్నపాటి మార్పువచ్చినా విలవిలతన్నుకుంటారు. నలుగురిలో స్థాయి దిగజారిపోతుందని వాపోతారు. వాళ్ళకు కావలసింది ఆదర్శాలు కాదు డాంబికంగా హోదాగా నెట్టుకుపోవడం. తనను గురించి వాళ్ళకో అభిప్రాయం ఉంది. కుటుంబాన్ని పోషించలేని నిష్ప్రయోజకుడై పోయాడని ఈసడించుకుంటున్నారు.

తను ప్రయోజకుడు కావాలంటే యేం చేయాలి? ఎలాగో సంపాదించి కుటుంబాన్ని దర్జాగా నడిపించాలి. కానీ అది తనవల్ల కానిపని. తన చిన్నాన్న కొడుకు వంశ గౌరవం నిలబెట్టాడనీ కాపురాన్ని గట్టెక్కించాడనీ, బుద్ధిమంతుడనీ, ముల్లెకట్టి వెనకేసుకొస్తున్నాడనీ — చుట్టపక్కాలూ. ఊళ్లోని ముసలి తండ్రులు చెప్పుకుంటారు. కానీ వాణ్నిచూస్తేనే తనకు మలినం తొక్కినంత కంపుకొడుతుంది. ఎవనికైనా దురవస్థ సంభవిస్తే దాని ఆసరాగా వాడు బాగుపడుతాడు. చాకలి చిన్నోడి పెళ్లాం బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నది. "హత్యచేసి బావిలో వేశారని పోలీసుకు రిపోర్టుచేస్తా"నని బెదిరించాడు. వాళ్ళ సర్వస్వంగా చూచుకుంటూన్న అరకఎద్దుల నమ్మి చేతిలోపోస్తే ఊరుకున్నాడు, బెల్లం పైసా బెల్లంబాపతు పైసా ఖాతాలో కెక్కించి, వడ్డీకి వడ్డీకట్టి కొండంత అప్పుచేసి మాల శాయన్నకు చూపించాడు. వాడు ఎదురు మాట్లాడితే దావావేసి మరింత దిగద్రొక్కాడు. శరీరంలో ఒకభాగంగా చూచుకుంటున్న వాని పదెకరాల భూమినీ స్వాధీనపరుచుకున్నాడు, సంపాదన కోసం ఎదురైన గడ్డి కరవడమంటే తనకు సరిపడదాయె.

తన పెదనాన్న కొడుకు ఊళ్ళో మందినంతా పిడికిట్లో పెట్టుకుని అడ్డమైన చాకిరీ చేయించుకుంటున్నాడు. ఏదో స్టంటుచేసి పిచ్చిగా వెంటతిప్పుకుంటాడు మందిని, లేనిపోని భ్రమలు కల్పించి ఎటంటే అటె యెగరేపుతాడు. ఎదురు మూలిగిన వాణ్ని నాలుగు తన్నిస్తాడు. అప్పివ్వకపోతే కొంపలు దోపిస్తానంటాడు. బిగువైన వక్షోజాల ఆకర్షణ కారణంగా భర్తను చంపించి బోయ చిన్నిని సొంతంచేసుకున్నా వీడూ ఒక ప్రయోజకుడే అయిపోయాడు.

తన బావ భార్యకు వశమైపోయి తలిదండ్రుల్ని నిర్దాక్షిణ్యంగా అణచి పెట్టాడు. వాళ్ళ గోల ఎవరితోనైనా చెప్పుకున్నట్లు తెలిస్తే సర్వ ఛండాలంగా తిట్టి నోళ్లు నొక్కేస్తాడు. పాపమా ముసలాళ్లు యింట్లో బోరుమని యేడ్చినా బయట యే బాధా లేనట్లు బరువుగా తిరుగుతున్నారు.

యిస్తానన్నంత వరకట్నం ఇవ్వని కారణంగా నానాఅవస్థలు పెడితే గుండెపగిలి చనిపోయింది కరణంగారి కోడలు.

భార్య అపురూప లావణ్యం బయటపడిపోతే ఎవరైనా అపవిత్రం చేస్తారేమో నన్న అనుమానంతో కిటికీ సందుగుండాకూడా బయటి ప్రపంచాన్ని చూడనివ్వకపోతే విరక్తిచెంది చేదబావిలో దూకి చనిపోయింది శాస్త్రులవారి భార్య.

ఈ ప్రయోజకుల బ్రతుకులోని బండారమంతా తనకు తెలుసు. తాను ఆశిస్తున్నది వ్యక్తి ప్రయోజనంకాదు. సమాజ ప్రయోజనాన్ని సాధిస్తే వ్యక్తి సమస్యలేదనే భావించాడు. ఈ దాహం తీర్చుకోలేక తపించాడు.

పాత క్రొత్తలను ఎంత సమన్వయపరచుకున్నా శేఖరం తండ్రి ఆశలను తీర్చ లేదు. ఆయనేమో అందరిలా తన కొడుకు త్రోవలో పడిపోతాడని భ్రమించాడు. శేఖరం ఒక్కొక్కప్పుడు అతి సాధారణంగా ఆలోచించేవాడు— మనిషి బ్రతకడానికి ఈ బాదరబందీ అంతా ఎందుకు. పూరిపాకవేసుకుని మొగుడూ పెళ్ళాం ఏకాభిప్రాయంతో కష్టిస్తే యెకరా భూమిలో జీవితాన్ని సాఫీగా గడుపుకోవచ్చు. ఏ హంగామా లేకుండా సహజంగా, సాధారణంగా జీవిస్తూ సాంఘిక ప్రయోజనం కోసం కృషి చేయవచ్చు.

వాస్తవ జీవితం అంతా తలక్రిందులు చేసింది. ఆశయాలూ, ఆదర్శాలూ సాంప్రదాయాల సుడిగాలిలో దూదిపింజల్లా యెగిరిపోయాయి గాయపడ్డ లేడిలా ఆత్మ విలపిస్తూన్నది. ఈ భిన్న మనస్తత్వాలమధ్య ఇక తను జీవించలేడు.

అప్పుడే శేఖరం ఎక్కడికైనా పారిపోవాలనుకున్నాడు నీచాతి నీచంగా చనిపోవాలనుకున్నాడు. ఉన్నచోటనే అమాంతంగా మాయమైపోవాలనుకున్నాడు. జీవితాంతం వేధించిన నరమానవులందరిపైనా కక్ష తీర్చుకోవాలనుకున్నాడు.

శేఖరం ఈ నిర్ణయానికొచ్చిన మరునాడే శుభలేఖలు వచ్చాయి. మేనకోడలు పెళ్ళి నిశ్చయమైపోయింది. "అయినసంబంధం చేస్తున్నాం. వరకట్నమే పదివేలు. తాహతుకు లోపంరాకుండా పెట్టె సామాను చేసుకురమ్మని" ఉత్తరాలు తెచ్చిన మనిషితో ప్రత్యేకంగా చెప్పి పంపించింది అక్కయ్య. ఈ విషయానికి ఏయభ్యంతరమూ తెలుప లేదు. ఇక బంది ఆగదని తనకు తెలుసు.

తల్లీ తండ్రీ పెళ్ళికి సిద్ధమయ్యారు. కట్నాలూ, కానుకలూ వాళ్లుకోరిన విధంగా సరిచూచి పంపి చేతులు దులుపుకున్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయింతర్వాత ఒక రోజంతా ఏడ్చాడు శేఖరం. కన్నీళ్ళే అతణ్ణి ఓదార్చాయి. అప్పులవాళ్ళు యమభటుల్లా కనిపించారు. తల్లీ, తండ్రీ, భార్యా పెను భూతాల్లా భయపెట్టసాగారు. బ్రతుకును కుదించుకుని స్వారీచేస్తున్నవాళ్ళంతా హేళనగా భయంకరంగా నవ్వుతున్నారు. అప్పుడనుకున్నాడు శేఖరం— 'అన్నీ తెలుసుకుని ఆవేదన పడేవానికన్నా పరిమితంగా తెలుసుకున్నవాళ్ళే మనుష్యుల మార్కెట్లో బాగా చలామణి అవుతారని.'

కొన్నాళ్ళపాటు మూగబ్రతుకు బ్రతికాడు శేఖరం. ఎవళ్ళతోను మాట్లాడేవాడు కాదు. హృదయంలేని మనుష్యులతో మాట్లాడాలంటే అతనికి హేయంగాతోచేది. అట్లా మాట్లాడకుండా ముఖమడ్డంపెట్టుకుని పగసాధించినట్లు తృప్తిపడేవాడు. అయితే తాను వాళ్ళకు అర్థమై చావద్దూ? వాళ్ల మామూలుగానే కనిపించేసరికి మరింత బెంగ పెట్టుకునే వాడు.

ఆనాడే చావాలని నిశ్చయించుకున్నా ఇప్పటికీ బతికేవున్నందుకు శేఖరం తనను తాను దూషించుకున్నాడు. బ్రతుకులోపడిన ఆరాటమంతా జ్ఞాపకం చేసుకునేసరికి ఎక్కడలేని దుఃఖం ముంచుకొచ్చింది. అవును తానిక బ్రతికి సాధించేదేమీలేదు. చనిపోతే పిరికివాడని దూషిస్తారేమో. బ్రతికి ఉన్ననాడు తన అభిప్రాయాలను గౌరవించలేని వాళ్లు చనిపోయాక యేమనుకుంటే యేం? గుడ్డికన్ను మూసినా తెరిచినా తనకు లక్ష్యంలేదు. లోకమెంత తిట్టిపోస్తే అంత తృప్తిపడుతుంది తన ఆత్మ.

శేఖరానికి చటుక్కున మరికొన్ని దృశ్యాలు స్మృతిపథంలో మెరిశాయి. వెంటనే దానిని మననంచేసుకోకుండా ఉండలేకపోయాడు. బ్రతుకునంతా చివరి క్షణాలలో కళ్ళ ముందు ప్రతిబింబించుకోడంలో ఆత్మానుభూతులు రాలిపడే నక్షత్రంలా చటుక్కున మెరిసి ఆరిపోతాయి. అస్తమించే సూర్యుడు ఆఖరి కిరణాన్ని భూమినుండి లాక్కున్నప్పుడు కన్పడే దృశ్యంలాంటిదే ఈ పరిస్థితి.

* * *

పుట్టింటికి వెళ్ళి సాలు గడచినా రాలేదు శేఖరంభార్య తను వెళ్ళవలసినఅగత్యం తప్పనిసరిగా ఏర్పడింది. వెళ్ళటంతోనే ముల్లే మూటా సర్దుకొమ్మని భార్యతోచెప్పాడు. ఆతిథ్యానికని రెండు రోజు లుండిపొమ్మన్నాడు మామ. అక్కడ ఉండాలంటే ఎందుకో మనస్కరించలేదు. కుంటి కోడిలా కాలం గడిపాడు.

"మేమూ కోడళ్ళతో కాపురం చేయించుకుంటున్నాం. ఇంత రాచి రంపాన పెట్టేవాళ్ళను చూడలేదు. ఆడదైయుండీ అచ్చట్లూ ముచ్చట్లూ చూడొద్దూ? ఎప్పుడూ

గొడ్డుచాకిరీయేనా?' అత్తగారు తనను ఆసాంతంచూస్తూ ఆమె ఏమాత్రం కనపడకుండా అంటిస్తున్నది.

ఏ లోకంలోనో ఉన్న శేఖరం ఈ లోకానికి వచ్చాడు. భార్యా, తల్లీ—కుక్క మీద, కోడిమీద పెట్టి తిట్లూ, శాపనార్థాలూ పెట్టుకోవడం తమ యింట్లొ ఒక రివాజై పోయింది. ఎన్నోసార్లు ముఖాముఖి చెరిగిపోసుకున్నారు.

"ఆ యింటి ఆడపడుచువై పుట్టాక ఈమాత్రం నిప్పులు పోయకుండా ఉంటావే? తల్లికి బొల్లి, పిల్లకు మచ్చని ఊరికే అన్నారా?'

"ఈ యింటికొచ్చి యింత గొల్లుమనిపించావులే. మా యింటిని వేలుపెట్టి చూపొచ్చావు. మా ఆడపడుచులెవరూ అడుక్కు తినడంలేదు

సాధారణంగా అత్తాకోడళ్లు జగడంలో అటు మూడుతరాలూ ఇటు మూడుతరాలు తూర్పారబట్టుకుంటారు. ఆఖరి తిట్టు తిట్టిన వాళ్ళదే గెలుపుగా గుర్తిస్తారు. అందుకే మనసులో ఉన్న కుళ్ళంతా ఒకరిమీద ఒకరు దుమ్మెత్తిపోసుకోడం కోసం గుప్పించుకుంటారు. దానికి అంతం అంటూ ఉండదు.

"బెల్లంకొట్టిన రాయిలా నిలబడకపోతే దాని నోరు మూయించరాదురా. పెళ్లాన్ని వొంగదీయలేకపోతే ఎందుకు మగసిరి."

"ఆడదాని అతీగతీ పట్టించుకోని వాళ్ళు పెళ్ళి పెడాకులూ యెందుకు తగలబెట్టుకోవాలి? మీరు కొంచెం కీలు తిప్పితే ఆమె అలా యెగసి పోతుందా?"

అత్తాకోడళ్ళ పోరాటంలో తను ఎవరిని సమర్థించాలో శేఖరానికి తెలియలేదు. ఆలోచించగా ఇరువురి చిత్తప్రవృత్తులూ ఒకటేనని తేలింది. వీళ్ళ వైరుధ్యమంతా ఒకరి పైన మరొకరి ఆధిక్యత పెంచుకోడం కోసం. ఈ ఆడవాళ్ళ మనసులు అతి సంకుచితాలు. కాపురంచేస్తున్న ఇంటి గోడలే వీళ్ళ ప్రపంచానికి హద్దులు. నచ్చిన బట్ట కట్టుకోడం. నాణ్యమైన నగలు ధరించడం, శారీరక వాంఛలు తీర్చుకోడంలో, పిల్లల్ని కనడం, ఏ కష్టం లేకుండా హాయిగా కాలం గడపడం— జీవితమంతా పీటముడే పరిభ్రమిస్తూంది. వేరే విషయాలు ఏమీ తెలిసి ఉండవు. తెలుసుకోడానికి గూడా ప్రయత్నించరు. స్వల్పమైన వాటి కోసం ఘర్షణ పడుతుంటారు.

శేఖరం మొదట్లో భార్యకు మెరుగులు దిద్దాలని ప్రయత్నించాడు. విఫలమై పోయింది.

"ఈ రోజుల్లో చదువుకున్నవాళ్లు పెళ్ళాలను పువ్వుల్లోపెట్టి పూజిస్తున్నారు. ఏ ఉద్యోగమన్నా చూచుకోక ఆ పాడుకాపురం మెడకు తగిలించుకోకపోతే యేం?" ఉద్యోగంచేస్తున్న భర్త ఆలనలో లాలనలో సర్వాంగాలు కోమలంగా పన్నెవారించికొన్న శేఖరం వదినెగారు హితోపదేశం ప్రారంభించింది.

శేఖరానికి చిఱ్ఱుమన్నది. పెళ్లాన్ని సుఖపెట్టడం కోసమని ఆమేరకే జీవితాన్ని పరిమితంచేసుకున్న వాళ్ళంతా ప్రపంచానికేం చేస్తున్నట్లు? సిగ్గులేక కడుపులో చల్ల కదలకుండా బ్రతుకుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిల్చిపోవాలని ఆశించే వాళ్ళను వరసగా నిలుచోబెట్టి కాల్చేయాలనిపించింది ఇక నిలువలేకపోయాడు.

"ఇదిగో నేను వెళుతున్నాను. వస్తావా లేదా చెప్పు" పెళ్ళాన్ని నిలదీసి అడిగాడు.

"ఎందుకూ? మీ అమ్మతో చీపురు దెబ్బలు తినడానికా: మీరేమన్నా ఆ రొంపి లోనికి మాత్రం నేను రాను." అన్నది భార్య. ఆమె విజ్ఞానం ఆమెతో అంతకన్న ఏమనిపిస్తుంది?

శేఖరం ఇక అక్కడ నిలవలేదు. ఇంటికిరాగానే తల్లీ తండ్రీ ఎంత అడిగినా సమాధానం చెప్పలేదు. అతని నరాల్లో అగ్ని కాగడాలు మండుతున్నాయి. ఆరోజు నుంచే శేఖరానికి జీవితం దుర్భరమైపోయింది. ఎవళ్ళకీ ముఖం చూపెట్టకుండా ఇంట్లోనే తుళ్ళిచస్తున్నాడు.

ఆఖరిసారిగా శేఖరం ఇలా అనుకున్నాడు. తల్లీ, తండ్రీ, భార్యా తన ప్రమేయంలేకుండా హాయిగా ఉన్నారు. వాళ్ళకోసం అనవసరంగా తను బాధపడుతున్నాడు. ఇక సాధించేదేమీలేదు వ్యక్తిత్వాన్ని చంపుకుంటేనే వీళ్ళ ఆదరణ లభించేది. కుటుంబంలో ఏ ఒక్కరూ తనతో ఏకీభవించలేరు. పోనీ వాళ్ళైనా సన్నిహితంగా ఉన్నారా అంటే అదీ లేదు. ఒకరి నొకరు సానుభూతితో పరిశీలించుకోలేక పోతున్నారు— వాస్తవ జీవితంలోపడిన అగచాట్లను తలుచుకుని భోరున ఏడ్చాడు

శేఖరం జ్ఞాపకాలన్నీ సమాప్తమయి పోయాయి. గతం నుండి ప్రస్తుతానికి వచ్చాడు. నికృష్టంగా, నీచంగా, హీనంగా, దీనంగా, దిక్కులేని విధంగా ఘోరమైన చావుచచ్చి తనవాళ్ళను ఏడ్పించాలనుకున్నాడు. తన చావు జీవమున్న ప్రతివస్తువునూ ఏడ్పించేటంత దారుణంగా విషాదంగా ఉండాలనుకున్నాడు.

చీకటి పడింది. తల్లి భోజనానికి రమ్మంటే పలకలేదు శేఖరం.

శేఖరం అలకను గురించి అమ్మలక్కలు "ఆ ముసలాళ్ళతో తెగదెంపులు చేసుకుని పెళ్లాంతో వేరే కాపురం పెట్టదలచుకున్నాడు తీయవే. అత్తగారు ఆ మాత్రం నూరిపోయకుండా ఉన్నారా?" అని వ్యాఖ్యానించారు.

శేఖరం తల్లీ, తండ్రీ కూడా అనుకున్నారింతే. గోలచేసి లేపి ఏదోటి తేల్చేద్దామని గదిలోకి వెళ్ళారు, ఆశ్చర్యంగా బయటికి వచ్చారు.

* * *

అటవిక జాతిని జాగృతపరిచే కార్యకలాపాల్లో జీవిస్తున్నట్లు—రెండేళ్ళ తర్వాత శేఖరాన్ని గూర్చినసమాచారం తెలిసింది. అంతా విస్తుపోయి తెల్లమొఖాలు వేసుకున్నారు.

"అర్థశాస్త్ర సూత్రాల్ని బుద్ధితోగాక శరీరంతోనే గ్రహించేను. ఈ ప్రపంచంలో అధిక సంఖ్యాకుల పరిస్థితి నాకంటే భిన్నమైనదిగా లేనప్పుడు పెద్ద పెద్ద పుస్తకాల్ని ఎవరికీ తెలియని మాటలతో రాయడంలో ప్రయోజనం నాకేమీ కనిపించదు. ఇంకోడికి లాభాల్నీ, సుఖాన్నీ చేకూర్చడంలో తన శక్తిని ధారపోసేవాళ్లకి స్పష్టంగా కనిపించే సిద్ధాంతాలు బోధించడానికి రాసిన ఈ పుస్తకాలుచూస్తే, ముంజేతి కంకణానికి అద్దమెందుకు? అన్న సామెత ఊరికే పుట్టలేదని తెలుస్తుంది."

— మాగ్జిం గోర్కీ

సమీక్షలు :

రెక్కవిప్పిన రివల్యూషన్

"విప్లవం పారిస్‌లో ఓడిపోయినా విశ్వమంతా వ్యాపించి వీరవిహారంచేస్తుంది.. పేదవాళ్ళకి, పెత్తందార్లకి మధ్య శాంతి. సామరస్యం లేవు కొన్నాళ్ళపాటు పెత్తం దార్లు జులుం చలాయించవచ్చు. పేదవాళ్ళనోళ్లు నొక్కవచ్చు. విప్లవం నివురుగప్పిన నిప్పు. మళ్ళీమళ్ళీ రగులుతుంది."— నూరేళ్ళనాడు పారిస్ కమ్యూన్ (మొట్టమొదటి) శ్రామిక విప్లవం గురించి మార్క్స్ చెప్పిన మాటలు నేటి ఫ్రెంచి విప్లవం (1968 మే) పట్లకూడా అక్షరాలా నిజం. ఈ ఫ్రెంచి విప్లవాన్నే ఏంజలో కార్బోచ్చీ రక్తాక్షరాలతో "Begining of the End" రాశాడు. శ్రీశ్రీమాటల్లో అదే 'రెక్కవిప్పిన రివల్యూ షన్'.

'పుస్తకం హస్తభూషణం' అంటారు. కాని యీ పుస్తకం మన మస్తిష్కానికి పదునుపెట్టే వజ్రం. మనగుండెల కొండలలో మోగే నగారా, చివికి, జీర్ణించిపోయిన పాతవ్యవస్థను కూకటివేళ్ళతో పెకలించివేసే అపూర్వశక్తి యీ రెక్కవిప్పిన రివల్యూ షన్. ఇది భేరీనినాదం, యుద్ధగీతం, విప్లవ సంగీతం. "రాజీలేదు. తిరుగుబాటే శరణ్యం."అని గర్జించాయి యువకిశోరాలు. పిడికిలి బిగించింది యువతరం. తిరగ బడింది యువతరం కొత్తనెత్తురుతో, సరికొత్తశక్తులతో, ఉత్తమ చైతన్యంతో, ఉజ్వల ఉత్సాహంతో ఉరకలువేసింది యువతరం రెక్కవిప్పింది రివల్యూషన్.

ఇంతకీ 'రెక్కవిప్పిన రివల్యూషన్' కథా? కావ్యమా? నవలా? నాటకమా? ఏ ఒకటీకాదు. కాని అన్నీను ఇది కేవలం ఓ మూలకూర్చుని సిరాతో కాగితాలమీద రాసిందికాదు. పారిస్ నగర వీధుల్లో గుండెనెత్తుటితో కనిపించిన గోడలనిండా రాసిన నినాదాలే ఈ పుస్తకం, 1968 మేలో 20 రోజులపాటు పారిస్ నగరంలో జరిగిన విప్లవ సంగ్రామమే ఈ పుస్తకం. ఏదో ఒకసారి చదివి అవతల పారేయలేం. ఇది చదివాక "విప్లవం జీవితంలో ఒక భాగం" అన్నది పోయి "విప్లవంజీవితం, జీవితమే విప్లవం" అన్న భావం కలుగుతుంది, కేవలం విప్లవభావాలు సరిపోవు. కార్యశూరత్వంకావాలి. అందుకే "ప్రేమపారవశ్యంలో మైమరచినప్పుడుకూడా తుపాకినిమాత్రం వదలవద్ద" ని

యువతరాన్ని హెచ్చరించిందీ పుస్తకం. ఎందుకంటే "సమాజం ఒక ప్లాస్టిక్ పువ్వు మూసపాతదే. పైపూతమాత్రం కొత్తది, అంతే. ప్లాస్టిక్‌పువ్వు వాడిపోదు. దానిని వేడిచేసి కరిగించాలి. సమాజాన్ని కొత్తమూసలో పొయ్యాలి," అంటూ నవీన మానవుడికి వివాళిపట్టిందీ పుస్తకం.

యువకులు దేనికీ వెనకాడరు. అన్నింటికి తెగిస్తారు. శ్రమజీవులే సమాజానికి ఆధారం. అందుకే విద్యార్థులు కార్మికులతో చేతులుకలిపారు. కార్మికులకు జీవితమే తిరుగుబాటు నేర్పుతుంది. సాహసమే ఒరవడి పెడుతుంది. ఈ విప్లవంలో కాలేజీలు, కర్మాగారాలు పడుగుపేకల్లా కలిసిపోయాయి.

దోపిడీదారులను గురించి యువకులు ఏమనుకుంటున్నారో విందాం— "వాళ్ళు కేవలం కాసులకోసమే ఆరాటపడతారు. కాని మనం ఆశయాలకోసం పోరాడతాం"

యువకులను ముందుకుతోసి తప్పుకునే వారివిగురించి "విప్లవాలను అ సగంలో ఆపేసేవాళ్లు తమగొయ్యి తామే తవ్వుకుంటారు" అంటున్నారు. పోరాటాన్ని నీళ్ళుగార్చి ద్రోహం చేసేవాళ్ళని శపించింది యువతరం. "సంస్కరణ వాది నరాలతో షావుకారుని ఉరితీసినప్పుడే సమాజం బాగుపడుతుంది."

రెక్కవిప్పిన రివల్యూషన్ రెక్క తెగిపోయిందని కలవాళ్ల పత్రికల వాళ్ళు ఎగతాళి చేశారు. విప్లవాలు ఆగిపోవు. నిర్విరామంగా జరుగుతూనే వుంటాయి. ఇది 'రెక్కతిప్పిన రివల్యూషన్' అని ఇక్కడి సంజకెంజాయపార్టీ గేలి చేసింది. అవును మరి, ఫ్రాన్సులో తనజాతి పార్టీవారే ఆపుణ్యం మూటకట్టుకున్నారు. "ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ ఈ విప్లవానికి వెన్నుపోటు పొడిచింద"ని జీన్‌పాల్‌సార్త్రే తెగేసిచెప్పాడు

అందుకే ఈ విప్లవానుభవాన్ని నవరసభరితంగా వర్ణించాక పాతపాత్రల కొత్త స్వభావాలను ఈ పుస్తకం ఆఖర్లో తేటతెల్లం చేశారు.

కార్మికులు :—

ధనంగాడి కోరలుపీకి, లాభాలను బూడిదపాలుచేసి, సర్కారును గద్దెదించనిదే విముక్తిలేనివారు.

కమ్యూనిస్టుపార్టీ :—

'వేతనశర్మ'ల సంఘం. ఒకప్పుడు పాత వ్యవస్థను పడగొట్టడానికి సాధనం. కాని ఇప్పుడు కొత్త వ్యవస్థకు పెద్ద అడ్డుగోడ. ఎందుకంటే. కలవారితో చేతులు కలిపిందీ శిఖండి.

యువకులు :—

లేమి అంటే భయం, కలిమి అంటే భక్తిలేని వాళ్ళు. తమ భవిష్యత్తుకు తామే కర్తలమని నమ్మేవాళ్ళు.

అణగారిన ప్రజల గుండెలాగవులే ముమ్మాటికి
దిగజారిన తిరుగుబాటు తిరిగి లేచు నొకనాటికి.

రెక్కవిప్పిన రివల్యూషన్ లోకం అంతా నిండి విజయ పరంపరలను సాధిస్తుంది.

తుది విజయం — తొలి పయనం

—సి. ప్రసాద్

[రెక్కవిప్పిన రివల్యూషన్ — మూలం : ఎంజెలో కాత్రొచ్చీ అను : శ్రీశ్రీ ఉద్యమ సాహితి - కరీంనగర్, ప్రతులకు : సృజన, వరంగల్ - 1.
వెల : 2 రు.]

మూడు "బంగ్లాదేశ్" లు

సమకాలిక ఉద్యమాలకి, వర్తమాన సంఘటనలకి స్పందించటం ఆధునిక కవిత్వానికి ఒక మంచి లక్షణం. కవిత్వం ఒకవర్గానికి వినోద సాధనంగా విజ్ఞానదాయకంగా ఉండటం మాని ప్రజా జీవనానికి సన్నిహితమైంది. సమాజ జీవితంలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించలేని కవికి ఈనాడు ఆదరణలేదు. ప్రజాస్వామ్యం అనబడే సామాజిక వైఖరి కవుల్నికూడ సమాజపరం చేసింది. దేశదేశాల్లో ఏం జరిగినా ఇతర ప్రాంతాల కవులందరు వెంటనే స్పందిస్తున్నారు. ఫ్రాన్సులో, వియత్నాంలో, కంబోడియాలో ఏ దేశంలో ఏ అన్యాయం జరిగినా అది ఈరోజు కవిమీద ప్రభావం చేస్తోంది. ఆంధ్రదేశానికి సంబంధించినంత వరకు స్వాతంత్ర్య ఉద్యమకాలంలో కవులు వర్తమాన ఉద్యమాలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోవటం ఆరంభించారు. 'మాకొద్దీ తెల్లదొరతనం' అని ఆనాటి కవులు గర్జించారు. ఇతర రంగాలతోబాటు సాంస్కృతిక రంగం

కూడ స్వాతంత్ర్య సముపార్జనంలో ప్రధానపాత్ర నిర్వహించింది. చైనా ఇండియా యుద్ధకాలంలో, పాకిస్థాన్‌పై సైనికచర్య సందర్భంలో కవులు వారివారి దృక్పథాల నుంచి గేయాలు రాశారు, సంపుటాలు ప్రకటించారు. గాంధీగారి జీవితంమీద కావ్యం, కెన్నెడీ చచ్చిపోతే గేయం. నెహూర్ గులాబీమీద గేయం, చివరికి కామరాజు అడ్డ పంచమీద గేయం. ఈవిధంగా సమకాలిక దేశ విదేశ సంఘటనల మీద కవిత్వం రాయటం వర్తమాన సాహిత్యంలో అలవాటుగా మారిపోయింది ఈధోరణి సంక్రాంతి మీద దీపావళిమీద ప్రతి సంవత్సరం కవిత్వం రాయటం వరకు వ్యాప్తమైంది. వార్తా స్పృహ, పత్రికల ప్రత్యేక సంచికలు, కీర్తి కాంక్ష, రాసిని ఉత్పత్తి చేయాలనే కోరిక ఈరకం రచనలకు ప్రధాన కారణాలు. అయితే ఇలాంటి రచనల్లో ఎక్కువ భాగానికి వార్తకుండే శక్తికూడ ఉండటంలేదు. ఒక్క రోజుకూడ సజీవంగా వెలగటంలేదు. దీనికి కారణం స్వీకరించిన సంఘటనలలో శక్తిలేకకాదు చిత్రణ విధానంలో, వస్తుసేకరణలో కవి జాగ్రత్తపడకపోవడంతో ఇలాంటి రచనలు రాసినప్పుడే చస్తున్నాయి. లేకపోతే వీర వియత్నాం మీద రాసిన కవితా సంకలనం కూడ అంత నీరసంగా వుంటుందా మరి. వార్త ప్రచురించటానికంటె వార్తా స్పృహతో గేయం రాయటానికి ఎక్కువశ్రమ తీసుకోవాలి. అవకాశం వున్నంత మేరలో, వివిధమార్గాల్లో వస్తువును సేకరించాలి. చిత్రణలో కవితాస్థాయిని ప్రదర్శించాలి. అన్నిటికంటె కవికి అత్యవసరమైంది దృక్పథం. ఎంత పేలవమైన తాత్కాలిక విషయమైన పటిష్ఠ దృక్పథంవున్న రచయిత చేతిలో కళాఖండం అవుతుంది. కేవలం రచనాశక్తి ఒక్కటే ఇలాంటి విషయాలకు చాలదు.

బంగ్లాదేశ్ ఉద్యమంతో ప్రభావితులైన కవుల కవితా సంకలనాలను ఈదృష్టితో పరిశీలిస్తే ఆశ, నిరాశ రెండూ కలుగుతాయి. ప్రసిద్ధకవులు, యువకవులు అనేకమంది ఎంతో సానుభూతితో బంగ్లాదేశ్ సమస్యని ఆలోచనాత్మకంగా ఆదేశనాత్మకంగా అమాయకత్వంతోను అయోమయంతోను చిత్రించారు.

రేపు విప్లవం – 'బంగ్లాదేశ్'

ఈ సంకలనాల్లో మొదటిది 'బంగ్లాదేశ్' అనే పేరుతో ఎన్. కె. సంకలనం చేసింది. ఈసంపుటి కవితాదృష్టితోను, భావదృష్టితోను, సామాజిక స్పృహలోను గొప్ప సంకలనం. ఇందులో కవులందరు రాజకీయ పరిణతి, సాంఘిక చైతన్యం శాస్త్రీయ దృక్పథం, విప్లవ జాతీయత, ఉజ్వల కవితాశక్తి వున్నవాళ్లే. ప్రపంచ చరిత్రలో ప్రజా ఉద్యమాల చరిత్ర అవగాహన, శాస్త్రీయమైన వర్తమాన పురోగామి దృక్పథం

బంగ్లాదేశ్ కవితా సంకలనంలో కవులందరికీ పటిష్టంగా వుంది. అలాగే బూర్జువా ప్రభుత్వ ద్వంద్వనీతుల్ని ఆధునికంగా అవగాహన చేసుకునే శక్తివుంది. ఒక ఉద్యమం మీద వుండవలసిన తాదాత్మ్యం దానితో అవగాహన రెండూ బంగ్లాదేశ్ కవులలో స్పష్టంగా వున్నాయి. భారత ప్రభుత్వ స్వార్థనీతిలోగాని, అగ్రిరాజ్యాల స్వార్థప్రయోజనాల వలలోగాని వీళ్ల చిక్కుకోలేదు. అలాగే కాగితం పువ్వు దేశభక్తి, కుహనా జాతీయతల ఇరుకు సందుల్నికూడ ఈకవులు దాటిపోయారు. స్వతంత్రంగా, ధైర్యంగా విప్లవ దృక్పథంతో అవసరమైన కవితావేశంతో ఈకవులు బంగ్లాదేశ్ ఉద్యమ స్వరూపాన్ని బహుముఖాలుగా చిత్రించారు. అందరు మర్చిపోయినా, మర్చిపోయినట్లు నటిస్తున్నా సింహళ సమస్యను అవగాహన చేసుకోవటంలోనే ఈకవుల అవగాహనా పరిణతి కన్పిస్తుంది. కవులందరికి బంగ్లా ప్రజలమీద సానుభూతి అపారంగా వుంది. కావి అ సానుభూతి అతిశయోక్తులతోను, ఆవేశంతోను ఏ అవగాహనా లేకుండా భజన చేసే పద్ధతిలోలేదు. ఒక స్పష్టమైన దృక్పథం, ప్రయోజనకరమైన సందేశాత్మకత లేకుండా రాయటం అనవసరం. పాఠకులకు ఉద్యమంమీద బలమైన అభిప్రాయముద్ర వేయగలగాలి. ఊరికినే మత్తుకలిగిస్తే విసుగుకలిగిస్తే అది రచనకాదు, క్రూరత్వం అవుతుంది. బంగ్లాదేశ్‌లో అతిహీనమైన పీడనకు, దీనమైన బానిసత్వానికి గురైనవాళ్ళు సామాన్యప్రజలు అస్వతంత్రదశలో మతకలహాలకి దేశీయ సంపన్నవర్గాల విదేశీయ శక్తులదోపిడికి దారుణంగా గురి అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పాకిస్థాన్ పాలకుల, సింధ్ పంజాబి కులక్కుల పాదాలదగ్గర జీవచ్ఛవాలుగా బ్రతికారు. ఇప్పుడు కేవల వేర్పాటు ఉద్యమం జాతీయ బూర్జువా విప్లవం. రాజకీయ స్వాతంత్ర ఆశయం ఈదీన జనతను ఉద్ధరించటానికి కాదు. ముజీబ్ అమాయకత్వం, రాజకీయ ఊహాశక్తి లేకపోవటం, పేరుకున్న సామ్యవాద వ్యతిరేకత, కాలదోషం పట్టిన సహాయనిరాకరణాది అహింసా పద్ధతులు ప్రజల్ని సాయుధుల్ని చేయలేకపోవటం కారణంగా మళ్లీ లక్షలాది పీడితజనం అన్నీ కోల్పోతున్నారు. ఇవాళ ప్రత్యేక బంగ్లా ఊడిపడి జాతీయప్రభుత్వం ఏర్పడినా, ముజీబ్‌వర్గానికి నాయకత్వం వచ్చినా శ్రామికజీవితంలో ఏమీ మార్పురాదు. ఇప్పుడు పోరాటం చేయవలసింది ఆర్థిక స్వాతంత్రంకోసంగాని, రాజకీయస్వాతంత్ర్యం కోసం కాదు. ఆర్థిక బానిసత్వమే సాంఘిక సాంస్కృతిక బానిసత్వానికి దారితీస్తుంది. ఫ్రెంచి విప్లవం నుంచి అనేక మహోద్యమాలలో సామాన్య ప్రజలు, శ్రామిక జన సందోహం దారుణంగా వంచితులయ్యారు. అంచెలంచెలుగా ఆర్థిక స్వాతంత్ర సాధన కాలదోషం పట్టిన దొంగ దృక్పథం. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థికవిముక్తి పోరాటాలు జరుగుతుంటే ఈ బూర్జువా జాతీయ తిరుగుబాటును నిర్ద్వంద్వంగా, నిస్సంశయంగా

విప్లవ దృక్పథంవున్న మేధావులు సమర్థించటం, సమర్థించాలనుకోవటం హాస్యాస్పదం, ఆత్మవంచన. బంగ్లాదేశ్ ఉద్యమంలో ఒకభాగంగా, అంతర్వాహినిగ జరుగుతున్న గెరిల్లా పోరాటం శాస్త్రీయమైన పోరాటం 'బంగ్లాదేశ్' కవుల ఈమేరకు ఆ ఉద్య మాన్ని సమర్థించారు. ఈ దృష్టినే వీరు సిలోన్ ప్రజా ఉద్యమాన్ని సమర్థించటం, ఈ అగ్నిగృహానికి నజ్రుల్ ఇస్లాం మార్చింగ్ గీతం తలుపులు తెరిచింది. క్రూర ఫ్యూడల్ శక్తుల రాక్షస కౌగిలినుంచి, నిస్తేజమైన ఒంటరిపాటునుంచి ప్రజా సమూహం సమూహ దృష్టితో సమిష్టి చైతన్యంలోకి మేల్కొన్న వాస్తవికతను చిత్రించిన కె. వి. రమణారెడ్డి 'పద్మానది' గొప్ప కళాఖండం.

"మతం పాతరలోంచి జాతి జాతరలోకి'
"ఒంటరి పాటులోంచి లోకకుటుంబంలోకి
గలగలా కదిలి సాగుతూంది
పద్మ."

అని పద్మానదీ ప్రవాహాన్ని జడత పగిలి, చైతన్యం రగిలి సమిష్టి చైతన్యంతో కూడిన జనతా ప్రవాహానికి గలగలసాగుతున్న పద్మ ప్రవాహం సంకేతం. రవీంద్రుని 'సోనార్ బంగ్లా' కంటె కవితలో, దృక్పథంలో 'పద్మానది' బలమైంది. వృద్ధ సిలోన్ సాంఘికవ్యవస్థ పునాదుల్ని కదిలించి ఉన్నత సమాజస్థాపనకి బడబాగ్నిలా ఉరుకుతున్న గువేరా తరాన్ని, ఎరువు తెచ్చుకున్న ఆయుధాల్తో తాత్కాలికంగా ఉపశమించినా శ్రీలంక విప్లవ లంక అయితీరుతుందని 'శ్రీలంక' లో కె. వి. రమణారెడ్డి స్పష్టం చేశారు వరవరరావు 'రేపు విప్లవం లేడిచూపులు చూస్తూ సింహగర్జన చేసిన గేయం. ప్రజా హృదయాల్లో సాహసంగా రేకులువిప్పి, వాస్తవికత ఆయుధాలు ధరించి, రేగినకోరికలే పోరాటశక్తియై, సకల ప్రజావ్యాప్తమై, సత్యమై విప్లవంగా పరిణమిస్తున్న శక్తిని వరవరరావు గుర్తించారు.

"నీపేరు నిన్న ఆకాంక్ష
ఇవ్వాళ తిరుగుబాటు
రేపు విప్లవం.
రేపు
విప్లవం."

ఈ వాక్యాలు పైకి అంచెలవారి విప్లవం సాధ్యమన్న తెల్ల విప్లవకారుల భావా లకు దగ్గరగా వున్నట్లు కన్పిస్తూనే ఆర్థిక పోరాటమే అనివార్యమన్న నేటి విప్లవ

దృక్పథాన్ని వ్యంగం చేస్తున్నాయి. ఆకాంక్ష తిరుగుబాటుగా మారి రేపు విప్లవంగా పరిణమిస్తుంది. రేపంటే ఇవ్వాళలో దాగిన రేపే. ఈ విషయాన్నే రేపు విప్లవం అన్న పునరుక్తితో వరవరరావు సూచించారు.

"ప్రపంచ పీడిత వర్గీయులందరికీ
ఒకే సమస్యలు, ఒకే కష్టాలు
పరిష్కార మార్గం ఒకటే!
అందుకే,
దేశదేశాల పీడితులారా! ఏకమవుదాం."

అన్న శేషిరెడ్డి వాక్యాలు నిజమైన విప్లవ జాతీయతకు అక్షరరూపాలు. ఎన్.కె. 'రక్తాగ్ని', కలం వీరయ్య 'ఊం కానీయ్' 'స్వాధీన్ బంగ్లాదేశ్' కవితలు లోచన్ 'రక్తం రాస్తున్న చరిత్ర' ప్రజా ఉద్యమ స్వరూపాలకి రక్తాగ్ని పతాకాలు మొత్తంమీద 'బంగ్లాదేశ్' కవులు బంగ్లా ఉద్యమాన్ని శాస్త్రీయమైన పరిమితులలో, చిత్తశుద్ధితో గుర్తించారు. సిలోన్ యువ విప్లవ శక్తిని గానం చేశారు. ఈ సంకలనం పాఠకుల మనస్సుమీద స్పష్టమైన విప్లవ దృష్టిని ముద్రిస్తుంది.

"బంగ్లాదేశ్ గీతాంజలి"—దిగుమతి చేసుకున్న ఉత్సాహం

రెండవది వికాస సాహితివారి 'బంగ్లాదేశ్ గీతాంజలి' వివిధ ప్రపంచ సంఘటనలమీద చాలాకాలం నుంచి తెలుగులో వస్తున్న మత్తుకవిత్వాన్ని పోలివుంది. బంగ్లాలో జరుగుతున్న హింసాకాండను భారతీయ పత్రికల నుంచి చదివి ఆవేశంతో ఊగిపోయి విన్నవి విన్నట్లే ఏ ప్రయోజనం ఆశించకుండా శాపనార్థాలతో చిత్రించారు 'గీతాంజలి' కవులు. వీళ్ళకి ముజీబ్ బంగ బంధువు. ఆయనే హీరో. భారత ప్రభుత్వానికి ఈ 'గీతాంజలి' కవులకి బంగ్లా ఉద్యమం మీద సమానమైన అభిప్రాయాలే వున్నాయి. మానవతావాదంతో, టన్నులకొద్దీ కన్నీటితో బంగ్లాప్రజల దీనావస్థను హృదయవిదారకంగా, జుగుప్సాకరంగా చిత్రించారు. యాహ్యాఖాన్‌ని ఆడవాళ్ళు తిట్టినట్లు శాపనార్థాలు పెట్టారు.

"ధర్మం గెలుస్తుంది
దానవుడు నశిస్తాడురా!" అని పురాణంకూడా చెప్పారు.
"అభ్యుదయ కవి కలంలో ఆవేశం

అగ్నియై జ్వలిస్తున్న కాలం' అని తిరునగరి అన్నారు కాని అగ్నిస్థానంలో ఆరుపు. ఏడుపు మాత్రమే కనిపిస్తాయి.

"ఎన్నాళ్లు పాడుతావు విషాదాల గీతలు"
"శాపాలతోటి కాళ తమోరాసి తూలదు"

అని రాంభట్ల నిజం చెప్పారేకాని 'గీతాంజలి' నిండా విషాదాల గీతాలే, శాప నార్థాలే నెత్తుటి ముద్దలు. మేదావుల డొక్కల్ని చీల్చుకు తింటున్న నక్కలు, తల్లుల శవాలపైవడి పొర్లుతున్న పసిపిల్లలు, పసిపిల్లల నెత్తుటితో యాహ్యా షవర్‌బాత్, పీకల పిసికిన పిల్లల కేకల్లాంటి జుగుప్సాకరమైన ఆలోచనలు, పదాలు, వర్ణనలు ఏ ప్రయోజనం సాధించటానికో తెలియదు. పత్రికల వార్తలకు పీక్ల కొన్ని జోడించారు, బాగా రూడించారు. యాహ్యాను రాక్షసులతో. హిట్లర్‌తో పోల్చటం, ముజీబ్‌ని ఘోరంగా పొగడడంతో ఈసంకలనంలో పురాణాల పొగలు వ్యాపించి పాఠకుడి మనస్సునీరసమై పోతుంది. అసలు సమస్య మాత్రం బంగ్లాదేశ్‌లోనే వుంటుంది. బంగ్లాదేశ్‌ని గూర్చి పాఠకులకి చెప్పటం—

"ఉహనా విప్లవ వినాద ఘూర్ణిత
హిమ తిమిరాచ్ఛాదిత గహనానికి
ఉతార ధారా– ప్రాగల్భ్యం"–

వంటి అర్థహీనమైన, భయంకర సమాసాలతోనా ? "దిగుమతి చేసుకున్న ఉత్సాహం" అని ఆరుద్ర దేన్ని ఉద్దేశించారో గాని ఈ సంకలనమంతా అలాంటి ఉత్సాహంతోనే నిండివుంది. ఏడుపుకి ఏడుపే సమాధానం అనే మానవతావాదం కాల దోషం పట్టింది. అభ్యుదయ కవిత్వం ఏస్థాయికి దిగజారిందో ఈగీతాంజలే నిదర్శనం.

"ఆకలి ఆవరించినపుడు
ఆవిర్భవించేది విప్లవం"

అని బొయినెపల్లి కిషన్‌రావు చెపితే పరోక్షంగా పీఠిక ఖండించింది. విప్లవాలు విఫలం కావటానికి కారణం విజ్ఞతలోపించికాదు, తప్పుడు భావాల ప్రభావమూ కాదు. సుదీర్ఘపోరాటాల పరంపరలో అనేక స్థానిక విప్లవాలు తాత్కాలికంగా పరాజయం పొందినా మహావిప్లవానికి రంగం సిద్ధంచేస్తాయి. ప్రతిచిన్నవిముక్తి పోరాటం సంఘాన్ని విప్లవభావాలతో ప్రభావితం చేస్తుంది. విజ్ఞతవుంటే ఈ విముక్తి సమరాలు తెరుస్తున్న

కొత్త తలుపులలోపలికి చూడటం కష్టంకాదు. తెల్లవన్నీ పాలుకానట్టే ఎర్రజెండా పట్టుకున్న వాళ్ళంతా కమ్యూనిష్టులు కారుమరి. ఈ సంకలనంలో ఆంధ్రేతర భారతీయ కవులవి, బంగ్లాదేశ్ కవులవి కవితలున్నాయి. వీటివి మాత్రమే సంకలనంగా వేస్తే ఇంకా బాగుండేది.

అయోమయం జరామయం – "సమర్ పథే బంగ్లా"

మూడవ సంకలనం "సమర్ పథే బంగ్లా" సమీకర్త వే. నరసింహారెడ్డి ఈ సంకలనంలో పద్యాలు, గేయాలు, వచన కవితలు వున్నాయి గ్రాంధిక వ్యావహారిక రచనలున్నాయి. ఇవి చదువుతుంటే 'అయోమయం జరామయం' అన్న తిలక్ మాటలు గుర్తుకొస్తాయి. సంకుచితమైన దేశభక్తి, స్వాప్నికమైన ఊహాత్మకమైన జాతీయత ఈ సంకలనంలో చాల రచనలకు పునాదులు కనీస రాజకీయ పరిజ్ఞానం, వర్తమాన భారత దేశ అవగాహన కూడ కొరవడింది. ఆశ్చర్యమేమంటే కొంతమంది కవులు స్వాతంత్ర్యం రాక ముందున్న సాంఘిక పరిసరాల్లో వున్నారు. మళ్లీ ఎక్కువమంది డాక్టరేట్ లనుకూడ తగిలించుకున్నారు. మనదేశంలో విద్యాధికుల, పండితుల ప్రమాణాలెలావున్నాయో "సమర్ పథే బంగ్లా" చదివితే తెలుస్తుంది. 'వందేమాతరం' అనే పేరుతోవున్న పీఠిక చిన్నపిల్లలకు స్కూల్లోచెప్పే వ్యాసంలా వుంది. అఖండతాభావం, ఐక్యతా సూత్రం, జాతీయ భావన సంస్కృతి, చైతన్యం లాటి నిండుసున్న మాటలతో ఒక స్వప్న మందిరాన్ని సృష్టించారు వే. నరసింహారెడ్డి బ్రిటిష్‌వాళ్ళ కాలంలోనే మొదటిసారిగ భారతదేశం అంతా ఒక పరిపాలనలోకి వచ్చిన చారిత్రక సత్యంపూర్తిగా విస్మరింపబడింది. వీళ్లు జాతీయత అన్నా, అఖండత అన్నా, దేశభక్తి అన్నా మతానికి జలతారు ముసుగులు వేయటమే. కొందరైతే బంగ్లాదేశ్ ఉద్యమం భారతదేశంలో కలిసిపోవటానికన్నట్లు భ్రాంతిని కలిగించారు దేశవిభజనకు అందరూ దోషులే. మరి ముజీబ్ కూడ అప్పుడు దేశవిభజననే కోరాడే. యాహ్యాకి అప్పుడు ఈగోలలేదు మరి.

"మనం పాతికేళ్ళ క్రితం
ఒకతల్లి పిల్లలం
ఒకే స్వాతంత్ర్య గీతం పాడినవాళ్ళం"— డా॥ సుప్రసన్న

మరి పశ్చిమ పాకిస్థాన్ ప్రజలుమాత్రం మన సోదరులు కారా? ఈ రచయితలు తూర్పు పాకిస్థాన్‌కి సమర్థించిన హేతువులతోనే పశ్చిమ పాకిస్థాన్‌ని కూడ సమర్థించవచ్చు.

ప్రజాకవి దాశరథి 'యని' 'యెంతే' 'బిడునొకో' 'విడునొకో' 'కానవచ్చునొకో' అని మృతభాషలో రావణుని ఆశ్రయించారు. వీరు వ్యావహారికం గ్రాంధికం రెండూ రాయగలరు. ఇక్కడేమో బంగ్లాని సమర్థిస్తారు. అక్కడ 'ఆంధ్రప్రభ'లో సమైక్యాంధ్ర దీపావళిలో రెండుమూడవటం ఇష్టంలేనట్టు చెపుతారు. సామ్యవాదం, పత్రికా స్వామ్యం అంటారు. సామ్యవాదకవుల్ని దేశద్రోహులంటారు. అమధ్య కవిరాజుమీద రాస్తూ రావణునికూడ సమర్థించారు. ఏమి చెప్పేది? —డా॥ సి. నారాయణరెడ్డి.

"ఏడుకోట్ల ముక్తకంఠాల
ఎలుగు బంగ్లాదేశ్
ఏడుకోట్ల సిక్తనేత్రాల
వెలుగు బంగ్లాదేశ్"లో కంఠాలు, నేత్రాలు

ఏడుకోట్లే అని భ్రాంతిపడే అవకాశం వుంది. ఎలుగు, వెలుగు మీదున్నదృష్టి అసలు విషయం మీదకూడా వుండాలి.

"రేకులు విరిసే ప్రాయంలో
ఆకులు రాసిన తరువులు"

అని శరణార్థులను గురించి సినిమా భాషలోనేనా రాయటం. ఈ శరణార్థులు "పరమాత్ముని శప్తమూర్తులు". దేముడికేమొచ్చింది వీళ్ళని శపించటానికి. అయితే ఇంక యాహ్యా తప్పేముంది? మరి నారాయణరెడ్డి అరవటం ఎందుకు? నారాయణరెడ్డి కొ స్తమంచి తెలుగులో శ్రద్ధగారాస్తే చూడాలనికోరిక. కాని ఇది సిద్ధించేమార్గం లేదు.

"ఓసి స్వేచ్ఛాభావమా!"
"ఓసి ఆత్మవిశ్వాసమా!"
"ఓసి ప్రజాస్వామ్యమా!"

"ఓసి తిరుగుబాటూ!' లాంటి సంబోధనలు, 'కద్రువ' 'కర్కోటకులు' 'అభిమన్యుడు' 'శమీవృక్షం' లాంటి ఉపమానాలు.

"నీపేరు స్వేచ్ఛ, నీపేరు దేవుడు" లాంటి సైదుకాలవ ఆవేశాలు
శరణార్థుల్ని—"నీవు రుద్రుడవా, ముక్కంటివా, త్రిశూలివా
మృత్యుంజయుడవు నీవు" లాంటి పూనకాలు
ఓరి (మైత్రి) సుప్రసన్నా ఏమిటిది? అని అడగాలనిపిస్తుంది.

డా॥ ముదిగొండ శివప్రసాద్ వెంటుక్రిక కవిత్వం ముస్లిముల నుద్దేశించింది. ఈయన మతం కోసం ఈయన ఏడుస్తుంటే వాళ్ళమతం కోసం వాళ్లు ఏడుస్తారుకదా? "మమత లేని సమత నీకు మానవుడా గగనసుమం" అని కాలజ్ఞాన తత్త్వవేత్త వీరబ్రహ్మం గారి పోజులో చెప్పారు. ఈకవి శరుడుగట్టిన ముస్లిం మతద్వేషి. యాహ్యా ముస్లిం మతం కోసం ఇదంతా చేస్తున్నాడట. మరి ముస్లిములను ఎందుకు చంపుతున్నాడు? అసలు బంగ్లాదేశ్ దమనకాండకి ఇవతలపక్క ఇలాంటి జాతీయ దురహంకారులు కూడ కారణం.

ఈ సంకలనంలో ఒక మాంత్రిక కవికూడ వున్నాడు—

"కాలపైశాచికీ కర్ణకుండల కాంతి"
"వికట తుచ్ఛమ్లేచ్ఛ విస్ఫోటనముతోడ"

అని కులపతి ప్రసాదరాయలంగారు భాగవతం భాషలో "మహాకాపాలిక క్రూర కహాకహారావము" చేశారు. ఈ వర్ణన యాహ్యా చర్యలకంటె భయంకరంగా వుంది. జై కాలభైరవి.

వి. ఆర్. విద్యార్థి పేరుగల విద్యార్థి కొంత పిడకలవేట చేశాడు మావోని 'గోముఖ వ్యాఘ్రం' అని వర్ణించాడు. నీ దగ్గరున్న బోడ్డుల్ని అందరికీ తగిలించటమేనా? మావోని మనస్సులో నింపుకున్నవాళ్లు అమాయకులు కాదు అమాయకుడా. ఈ విద్యార్థిలాటి వాళ్ళే రష్యా, చైనాలు ఈ దేశంలో విప్లవాలు తెస్తాయని భ్రాంతి పడతారు. ఇప్పటికీ పాకిస్థాన్ ప్రజానీకంలో చైనాకి పాప్యులారిటీ ఎక్కువ. బంగ్లాదేశ్ ఉద్యమ నాయకులుకూడ చైనాను మర్యాదగా ప్రశంసిస్తారు.

ఇంకా కొందరు కవులు "పుత్రోహం పృథివ్యాః". "నహన్యతే హన్యమానే శరీరే" అని సంస్కృతం పేర్లతో చిందులాడుతున్నారు. ఈ కవులు అయోమయ జరామయ స్థితినిదాటి ఈ క్రింది యువకవి వాక్యాలనుంచి చైతన్యాన్ని పొందుతారని—

"పలుగురాళ్ళ పక్కచుట్ట
తలగడగా పాముపుట్ట
ఒంటరి వ్యాఘ్రరాత్రి
కౌగిలిలో వెచ్చేలికాదు
బందూక్
స్వాతంత్ర్యేచ్ఛా బంధూక్".

చిత్రకళ – చర్చ:

నేటి చిత్రకళ - కళా విమర్శ ... ఒక పరిశీలన ...

మనోహన్‌దత్

గత మూడు మాసాలనుంచి చిత్రకళపై సృజనలో జరుగుతున్న చర్చలో చిత్రకారునిగా పాల్గొనడం నాకు తప్పనిసరి అని అనిపిస్తున్నది.

శ్రీపతిగారు వారి తొలివ్యాసంలో శ్రీ దొరైస్వామి చిత్రాల్లో ఎంతమాత్రం లేనిదాన్ని దేన్నో వారికి అంటకట్టి చూడటం కొంతవరకు శ్రీ ప్రసాదరావు అన్నట్లు గాడిదగుడ్డుకు ఈకలుపీక చూడటమే అవుతుంది. శ్రీ దొరైస్వామి చిత్రాల్లో బాధగాని, కసిగాని కనిపించడానికి కారణం అతను అనుభవాల్ని తమ చిత్రాల్లో తీసుకురావాలి అనుకోవటం కాదు, అది అతని శైలిలోనే వున్నది. అతని చిత్రాల్లో కనుపించే క్రూడ్‌నెస్ అతని స్వంతం. ఆ క్రూడ్‌నెస్ నుంచి బయటపడలేక అందమైన బొమ్మలు వేయలేక (కొంతకాలం క్రితం ప్రయత్నించి విఫలులైనారు), ఆ క్రూడ్‌నెస్‌తోనే సరిపెట్టుకోవటం కోసం, లేదా తెలివిగా ఆ క్రూడ్‌నెస్‌నే వాడుకోవటం కోసం వికారమైన ముఖాలతో, అస్తవ్యస్తంగా వున్న అవయవాలతో భిక్షగాళ్ళను, లేదా ఆతరహా మనుషుల్ని వేయడానికి పనికివచ్చే విధంగా వుపయోగించుకొంటాడు. అంతేగాని అతని గుండెల్లో నిజంగా బాధితులపైన జాలిగాని పీడితులపైన సానుభూతిగాని లేవు. ఉన్నవి అనుకోవటానికి గత దశాబ్దంగా అతనితోను అతని చిత్రాలతోను అతి సన్నిహిత సంబంధం కలిగిన నాకు ఏ అవకాశమూ కలుగలేదు.

శ్రీ దొరైస్వామి చిత్రాల్లో చాలభాగం, గోయా, ఓరోజ్‌కోలాంటి విప్లవ చిత్రకారుల చిత్రాలకో, లేదా ప్రెస్ ఫోటోగ్రాఫ్‌లకో అనుకరణలు. కాని వీటిని మనం అంతతేలిగ్గా కనుక్కోలేక పోవటానికి కారణం; వాటి మూలమైన చిత్రంలోవున్న లాలిత్యంగాని, సుందరతగాని శ్రీ దొరైస్వామి కుంచెతో మార్పు చెందేటప్పటికి ఆటోమాటిక్‌గా వికారతను, క్రూడ్‌నెస్‌ను పులుముకొంటాయి. అదే శ్రీ దొరైస్వామి సక్‌సెస్, అందుకే శ్రీపతిగారు అతని చిత్రాల్లో ఏదోవుందని పల్టీకొట్టింది.

గతంలో శ్రీ దొరైస్వామి చిత్రించిన 'పీడిత ప్రజలు' 'రాజకీయ బాధితులు' 'బానిసలు' అతని గుండెల లోయల్లోనుంచి, అతని రాజకీయ నమ్మకాలలోనుంచి

పుట్టుకొచ్చినవి కావు........ అనటానికి నాకు ఎన్నో కారణాలు తెలుసుకాని స్థలాభావంచేత యిక్కడ ఒక్కటి మాత్రం మనవిచేస్తాను. ఈమధ్య కొందరు చిత్రకారులు కలకత్తాలోని నక్సలైట్ వుద్యమాన్ని గురించి మాట్లాడుకొనే సందర్భంలో శ్రీ దొరైస్వామి "ఛీ.... ఛీ.... కలకత్తాలో మరీ లైఫ్‌కు సెక్యూరిటీ లేకుండపోయింది. Thats why I hate this communist government..." అంటూ ఒకవేళ కమ్యూనిష్టు ప్రభుత్వం వస్తే ఎలా అని.... తమ బాధను అసహ్యతను వ్యక్తం చేశారు. అటువంటి శ్రీ దొరైస్వామి విప్లవాన్ని సమర్ధిస్తూ చిత్రాలు వేస్తారంటే ఎలా నమ్మటం.

ఇక శ్రీ దొరైస్వామి విప్లవ అవగాహన ఎంత అంటే నవంబరు సృజన ముఖచిత్రంలో వారి 'రేప్ ఆఫ్ బంగ్లాదేశ్' చిత్రంలో ఒక పాక్ సైనికుడు భుజానికి తగిలించుకొన్న అమెరికన్ తుపాకిని .. అప్పు గడకర్రలా చిత్రించారు. అంటే కనీసం పత్రికలోని ఫొటో చూసికూడా సరిగా కాపీ కొట్టటం రాని ఈ తరహా చిత్రకారులకు ఏదో రంగుపూసి శ్రీపతిగారి లాంటి బాధ్యత నెరిగిన మనిషి పరిచయం చేయటం మిగతా కళాకారులకు అన్యాయం చేయటమే. ఈ విషయంలో శ్రీపతిగారు పునరాలోచన చేస్తారని ఆశిస్తాను.

శ్రీ దొరైస్వామి బంగ్లాదేశ్ చిత్రం వెయ్యటానికి కారణం, అతను పాక్ నియంతల భయంకరవైఖరి ఖండిస్తూ మాన ప్రాణాలు కోల్పోయిన అమాయక బంగ్లాదేశీయుల దయనీయమైన పరిస్థితికి కరిగిపోయి, గుండెల్లో మంట రగిలి మాత్రంకాదు. ఇదో క్రొత్త సమస్య క్రొత్త సబ్జెక్. చిత్రంగా వేస్తే నావెల్‌గా వుంటుంది. దేవుడు మేలుచేస్తే శ్రీ హెబ్బార్ లాంటి న్యాయనిర్ణేతవున్న.... పేనల్‌లో, దేవుడు మేలుచేస్తే నలుగురి నోట్లో నానే సబ్‌జెక్ట్ కాబట్టి అవార్డు రావచ్చు. రాకపోయిందే అనుకోండి. అకాడమీ వుండనే వుండె శ్రీ దొరైస్వామి లాంటి చిత్రకారులను ఆదుకోను. వారు కొనవచ్చు, అయ్యా యిదీ బంగ్లాదేశ్ తెర వెనుక కథ.

కాబట్టి శ్రీపతిగారుకాని మరే విమర్శకుడుకాని ఈ తరహా జంతర్ మంతర్ అవకాశవాదులైన చిత్రకారులను ఏదో మహామేధావుల కోవలో జమచేసి లేనిగొప్పతనాన్ని రుద్దకండి.

శ్రీ సూర్యప్రకాష్ కాన్వాస్–3–1970. లో అతను అబ్‌స్ట్రాక్‌నుంచి ఫిగర్‌టివ్ వైపుకు వస్తున్నట్లుంది అని కాన్వాసులోని ఎద్దుతల లాంటి ఆకారం చూసి శ్రీపతిగారు

పొరపడ్డారు. ఈ చిత్రం చిత్రించే సమయంలో నేను శ్రీప్రకాష్ స్టుడియోకి వెళ్లటం తటస్థించింది, అప్పుడే యీ ఎద్దుతలలాంటి ఆకారాన్ని శ్రీప్రకాష్ దృష్టికి తీసుకురాగా అతను "ఛా... ఛా.... అలాంటి దేమీలేదు. అది మోటారు భాగాల్లో నలిగిపోయిన ఒక తుక్కు రేకు మాత్రమే" అని సమాధానం యిచ్చారు. అంటే ఆ ఎద్దుతల కేవలం శ్రీపతిగారి వూహ మాత్రమే.

"శ్రీ లక్ష్మగౌడ్ "పెయింటింగ్ జూలై–1" మాంసపు ముద్దల్లో ఒక గర్భవతి స్త్రీ బెడ్ మీద పడుకొన్నది కండరాల, ఎముకల పురుషుడు అలసటతోను, ఆలోచనల తోను, అసంతృప్తితోను ఘర్షణ పడుతున్నాడు" అని పై చిత్రంపై శ్రీపతిగారు వ్యాఖ్యానం చేశారు. ఈ విషయంలో శ్రీ లక్ష్మగౌడ్ ని అడిగితే "నో... నో... ఇటీజ్ నథింగ్ బట్ ఎడిజైన్ ... నేను యిద్దరు పిల్లల తండ్రిని.... ఐ నెవర్ థాట్ ఆఫ్ దట్" అన్నారు.

శ్రీ ప్రసాదరావు విమర్శ చాల ఘాటుగాను చాల సందర్భాలలో పించింగ్‌గాను వున్నది. అయితే చాల సందర్భాలలో నిజానికి దగ్గరగా వున్నది. అందుకు బహుశ కారణం శ్రీపతిగారు పొగిడిన అందరు చిత్రకారులతోను శ్రీ ప్రసాదరావుకు, వాళ్ళు చిత్రకారులు కాకముందు నుంచి, వారి కళాశాల రోజుల్లోనుంచి సన్నిహిత సంబంధం వుండటం కారణం కావచ్చు. లేదా వారి బలహీనతలను పూర్తిగా ఎరిగి వుండటం కావచ్చు. శ్రీపతిగారు అకాడమీ ప్రదర్శనలోని కొన్ని చిత్రాలను గురించిమాత్రమే వ్రాశారు శ్రీ ప్రసాదరావు వాళ్ళ పూర్తి చరిత్రలోని ఎన్నో నిజాల్ని బట్టబయలు చేస్తూ వ్రాశారు. అయితే కొన్ని ఆరోపణలలో శ్రీ ప్రసాదరావు నిజానికి దూరంగా వెళ్లటమూ జరిగినది.

"తమ తమ మానసిక చీకటి గూహల్లో విహరిస్తూ ప్రపంచ వ్యాపితంగా ప్రసిద్ధిలోనున్న యూరోపియన్ కళావిలువలనూ, భావజలాన్నీకూడా అనుకరిస్తు" అన్నారు. ఇది నిజంకాదు. యూరోపియన్ కళావిలువలు మనం అరువు తెచ్చుకొన్న "ఆయిల్ మీడియం" (ప్రస్తుతం ప్రపంచ మీడియం) వలన కొన్ని కనిపించవచ్చు. కాని భావ జలాన్ని మాత్రం ఏమాత్రం స్వీయ శైలి కలిగిన చిత్రకారుడయినా అరువు తెచ్చుకోడు.... తెచ్చుకోలేడు. ఈ విషయంలో శ్రీ ప్రసాదరావు పునరాలోచనం చేయటం మంచిది. ఇక చిత్రాల్ని అటకలమీద పెట్టుకోవటం, అవార్డుల కోసం గడ్డితినటం అందరూ చేసేపనికాదు. కొందరు వెధవలు ఏరంగంలోనైనా వుంటారు. అది చిత్రకళా రంగమే కానవసరం లేదు.

శ్రీ ప్రసాదరావు గారు వూహించినట్లు నేటి చిత్రకారుడు మరీ దయనీయమైన పరిస్థితిలో మాత్రం లేడు. ఈమధ్య నేను బొంబాయిలో వున్న నెలన్నరలో దాదాపు 12 చిత్రికళా ప్రదర్శనల్ని చూడటం జరిగినది. అందులో ప్రతి ప్రదర్శనా డబ్బు చేసికొన్నదే. ఏడెనిమిది వేలనుంచి 70 వేలదాకా (శ్రీ స్వామినాథన్ 70 వేలదాక తొలిరోజే అమ్మారు) చిత్రాలు అమ్ముడయ్యాయి. సగటు చిత్రకారుడు తన చిత్రాలతో బ్రతికే అవకాశం ఈనాడువున్నట్లు ఈదేశంలో ముందెన్నడూలేదు(వెనక కళాకారులు బానిసలలా బ్రతికి సొమ్ము చేసుకొనేవారు. నేడు అలాకాదు).

ఇక చిత్రాలకు పేరు పెట్టటంలో వైరూప్యంకన్న వైరూప్యంగా వుండే పేర్లు పెట్టటం జరుగుతోంది. "అసలు పేరంటూ ఎందుకు వుండాలి. అని తిరుగబడతారు." అని శ్రీ ప్రసాదరావన్నది నిజం. చిత్రకారులలో ఈతరహా ఆరగంట్ వైఖరిని విమర్శకులు తప్పనిసరిగా డిస్కరేజ్ చేయాల్సిందే.

"అకాడమీ న్యాయమూర్తులకు సరిగా తెలీదు" అని శ్రీ ప్రసాదరావన్నది అక్షరాల నిజం. ఈ మాటను శ్రీపతిగారు ఖండించకుండా వుండి వుండాల్సింది. కొన్నేళ్ళ క్రితం అకాడమీ బంగారు పతకాన్ని పొందిన శ్రీ అజీజ్ చిత్రం ఒక పేరుమోసిన మెక్సికన్ చిత్రానికి కేవలం ఎన్లార్జిమెంట్, ఈప్రదర్శనకు కొమ్ములు తిరిగిన భారతీయ చిత్రకారులు, విమర్శకులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అయితే వీరు కేవలం కాన్వాసు వెనుకచూసి (పేరు స్లిప్ వెనుక అంటించి వుంటుంది) అవార్డు యిచ్చే అనవాయితీని నిలబెట్టారు. అంతే.

ఈ మహానగరంలోని మన ఆంధ్ర కళాకారుల గొప్పతనం. వారి ధైర్యస్థైర్యాలు ఒక చిన్నసంఘటనతో చెప్పి ముగిస్తాను.

ఈమధ్య ఒక ప్రదర్శనలో ఒకప్రసిద్ధ ఆధునికశిల్పి ఒకశిల్పం ప్రదర్శించటం జరిగింది. క్యాటలాగ్‌లో ఆశిల్పం పేరు 'బెగ్గర్'. అయితే ఖర్మంకాలి ఆశిల్పికి కొందరు ప్రోగ్రెసివ్ మిత్రులు వున్నారు. వారు ఆ ప్రదర్శనకు వచ్చారు. ఓహో ఈ శిల్పం అద్భుతంగా వుంది. సమకాలీన సమస్యల్ని మూసలోకి ఎక్కించినట్లుంది. మనవాడు విప్లవ శిల్పి అయిపోయినా డోచ్.... అంటూ చంకలు గుద్దుకొని, టైటిల్ అడిగారు. అందరు వినేలా పెద్దగా 'బెగ్గర్' అని వాళ్ళకు మరికొందరికి వినిపించేలా చెప్పి.... వాళ్లను ఓమూలకు తీసుకుపోయి, దరిదాపుల్లో ఎవ్వరూలేరని నిర్ణయించుకొని, చిన్నగా

వారికి మాత్రం వినిపించేలా చెవుల్లో "అందరికీ 'బెగ్గర్' అని టైటిల్ చెపుతున్నాను అసలు టైటిల్ తెలుసా" అన్నాడు. అటూ యిటూ చూస్తూ ... మిత్రులు ఏదో ఆశగా బాంబు పేలబోతోంది అన్నట్లు. ఏ మారువేషంలో 'మావో' అంటాడోనని అతనివైపు చూస్తున్నారు శిల్పి మరోసారి సిఐడీలు హాల్లోలేరని నిర్ధారణ చేసికొని... చల్లగా.... 'రెఫ్యూజీ' అన్నాడు. అయ్యో యిదీ మనచిత్ర శిల్పకారుల పరిస్థితి.... వున్నదివున్నట్లు చెప్పే దమ్ముల్లేని మన యువచిత్రకారుల కేదోవుందని ... లేనిపోని రంగులుపూసి మన విమర్శకులు తిక మక పడుతూ. పాఠకుల్ని కన్‌ఫ్యూజ్ జేయటం అన్యాయం. శ్రీ ప్రసాదరావు అన్నట్లు. ఈ దమ్ముల్లేని యువ కళాకారులు పెట్టే గాడిద గుడ్లకు (క్రియేషన్) ఈకల్లేవు.... ఇక ఏ విమర్శకుడు మాత్రం ఏం పీకగలడు.... ఆఖరుకు అదీ ఆబ్‌స్ట్రాక్ట్ అవుతుంది.

సాహిత్య లేఖలు :

సాహిత్యంలో విప్లవోద్యమం

ఈ సందర్భంలో నేను మీదవేసుకున్న బాధ్యత గురించి కొంత చెప్పవలసిన బాధ్యత నాపైనపడింది. దీనికి ముఖ్యకారణం ఫిబ్రవరి సృజనలో ప్రభాకర్ రెడ్డివ్యాసం.

విరసం ఏర్పడేనాటికి నేను సాహిత్యంలో విప్లవోద్యమంవస్తే దాన్ని బలపరచటానికి తగినస్థితిలో ఉన్నాను. నేనుగా విప్లవసాహిత్యాన్ని సృష్టించటం సాధ్యంకాదని నాకు తెలుసు. ఆయినా యువతరం కవులు ఆధునిక సాహిత్యంలో విప్లవ భావాలను ప్రవేశపెట్టటంచూశాను. నానాటికీ జడత్వాన్ని పెంచుకుంటూ నిర్జీవస్థితికి చేరుకుంటున్న వర్తమాన తెలుగు సాహిత్యం విప్లవ సాహిత్యోద్యమంతో తిరిగి చైతన్యంపొందగలదని నాకు నమ్మకం పూర్తిగా కలిగింది, విప్లవ కవితల ప్రభావం యువతరంమీద యెలా ఉన్నదీ ప్రత్యక్షంగా చూశాను.

అయితే విప్లవ రచయితల సంఘంలో ప్రముఖపాత్ర వహించాలన్నకోరికగాని, వహించగలనన్న దృఢనమ్మకంగాని నాలో లేకపోయాయి. అయితే విరసం స్థాపనకు కృషిచేసిన యువకులు పట్టుబట్టి నన్ను ఉపాధ్యక్షుణ్ణి చేశారు. నామూలంగా విరసంకు లాభం ఉండేపక్షంలో నేను దానికి అడ్డుతగలదలచ లేదు.

విరసం పుట్టటంతోనే ఛొక్కసాలు ప్రారంభమయాయి. ప్రతిఘటన ఆరంభమయింది. ఈ ప్రతిఘటన రాజకీయ పార్టీలనుంచీ, రచయితలనుంచీకూడా వచ్చింది. (రచయితలలో హెచ్చుభాగం రాజకీయపార్టీలను ఆశ్రయించినవారే అనుకోండి)

సాహిత్యోద్యమాలను రాజకీయ పార్టీల దృక్పథంనుంచి దెబ్బతీయటం నాకు పాతకథే. కాని విరసం ఒక రాజకీయపార్టీ గొడుగుకింద, ఆపార్టీ ఆశీస్సులతో పుట్టినదికాదు. ఇదీ జీవితంలో తలయెత్తిన తిరుగుబాటు శక్తులనుంచి, ఆ శక్తులను బలపరచటానికి పుట్టినది. అందుచేత విరసం పుట్టుకను మరొక లెఫ్టిస్టుపార్టీ పుట్టుకకింద జమకట్టి ఆంధ్రలో ఉండే లెఫ్టిస్టుపార్టీలు అనబడేవిదానిమీద దాడిచేశాయి।

విరసంపైన జరిగిన దాడులలో విరసం సభ్యులను సాటి రచయితలు దుమ్మెత్తిపోయటం జరిగింది, విరసం సభ్యులు తాగుతారనో, తిరపతికి వెళ్లారనో, సత్యనారా

యజ్ఞవ్రతాలు చేసుకున్నారనో, ఇద్దరు పెళ్ళాలను పెట్టుకున్నారనో వంకలు వెతికి, వాళ్లు మార్క్సిస్టులు కారని దుష్ప్రచారాలు ప్రారంభించారు ఒక్కముక్కలో చెప్పాలంటే, విప్లవ రచయితలకూ, విప్లవ రచనలకూ అవినాభావసంబంధం ఆపాదించారు. ఇలాటి విమర్శలు విరసం సభ్యులనుంచి, లేదా విప్లవ సాహిత్యంపట్ల ఆదరంకలవారినుంచి వస్తే అర్థంచేసుకోవచ్చు. విరసం కు విరోధులైనవారు యెందుకు బెంగపడుతున్నట్టు? విరసం సభ్యులమూలంగా విప్లవ సాహిత్యోద్యమం పతనమవుతుందని వారు సంతోషించవచ్చుగా.

వాళ్లచేసినవి కపట విమర్శలు, పాక్షిక విమర్శలు వాటికి సమాధానం ఇచ్చాను నా సమాధానానికి ఎవరూ జవాబు చెప్పలేదు — చెప్పలేరు. ఆ సమాధానం మిత్రుడు టంకసాల అశోక్‌కు నచ్చకపోవటం నేను అర్థం చేసుకోగలను. అతను విరసం సభ్యుడు. సాటివాళ్ళలోగల లోపాలను సమర్థించటం అతనికి బాధగానే ఉంటుంది. నేను సమాధానం ఇచ్చింది విరసం సభ్యులను మభ్యపెట్టటానికి కానేకాదు. కాని విరసంలో ప్రముఖులమీద వ్యతిరేకులు దుమ్ముచల్లినప్పుడు వారిని సమర్థించటంగాని, అంతకు ముందు తానే విరసం సభ్యుల బలహీనతలను విరసం పరిధిలో విమర్శించటంగాని అశోక్ చెయ్యలేదు. ఎందువల్ల? ఇది ఆలోచించదగిన విషయం అనుకుంటున్నాను.

అటు తరవాత యువ రచయితలు— ముఖ్యంగా కథకులు తాము విప్లవ సాహిత్యం ఎలా సృష్టించాలనే సమస్యతో సతమతమయారు. నేను కథలూ, నవలలూ రాయటం మానేసినప్పటికీ, ఆ యువకులు తెచ్చిన ప్రశ్నలమీద దీర్ఘంగా ఆలోచించి, నాకుతోచిన భావాలను ఎప్పటికప్పుడు ఒక్కొక్క వ్యాసంగా పత్రికలకు పంపుతూ వచ్చాను. నిజానికవి చర్చనిమిత్తం రాసినవేగాని రచయితలకు ఆదేశాలుకావు. చర్చలు జరిగాయి కూడా. ఆ వ్యాసాలు పుస్తకరూపంలో వెలువడాలని నేను కోరలేదు. సృజన ప్రచురణగా దాన్ని వెలువరిస్తామని వరవరరావుగారు అన్నప్పుడు, ఆ వ్యాసాలలో ఎలాంటి లోపాలుంటాయోనన్న అనుమానంతో, జాగ్రత్తగా ఎడిట్ చేయించమని హెచ్చరించాను.

విప్లవోద్యమానికి గురుపీఠంగా ఉండాలన్నకోరిక నాకు పీకోశానాలేదు. ఎవడన్నా "గురువు" పోజు పెట్టినవాణ్ని చవట వెధవ కింద పరిగణిస్తాను విప్లవ రచయితల మధ్య తారతమ్యాలు పరిగణించటం కూడా నాకు సమ్మతం కాదు.

నిజానికి నా వ్యాసాలను ఎప్పటికప్పుడు ఉద్యమంలో వాళ్ళు పూర్తిగా విమర్శించి ఉండవలిసింది. ప్రభాకర్ రెడ్డిగారైనా ఉన్న లోపాలన్నిటినీ విమర్శించా రనుకోను. నేనావ్యాసాలు రచించిన పద్ధతిలో తడువుకోవటం చాలా ఉన్నది. అలా రాసినవాటిలో ఎన్నిరకాల ప్రమాదాలైనా రావచ్చు, తప్పులు చెయ్యకుండా ఉండే హక్కూ, చేసినా అవి తప్పులుకావనే హక్కూ ఒక్క గురుపీఠాలకే ఉంటుంది!

దేశకాలాలను బట్టి మార్క్స్, లెనిన్, మావోలకు వర్గ ప్రాముఖ్యం తేడాగా కనిపించిందాన్ని నేను రాసినప్పుడు అది నిజమేనని నమ్మే రాశాను. నా వాక్యంలో ప్రభాకర్ రెడ్డిగారికి స్ఫురించిన అర్థాలు నాకు స్ఫురించలేదు. అది పూర్తిగా మార్క్సిజానికి వ్యతిరేకమని ప్రభాకర్ రెడ్డిగారు చెప్పేదాకా నాకు తెలీదు. అయితే ఆ వాక్యం విప్లవ సాహిత్యోద్యమానికి నష్టం కలిగించకపోతే నేను అంతగా బాధపడను

"తిరుగుబాటు", "విప్లవం" అనే మాటలకు నా నిర్వచనం ఏమిటని ప్రభాకర్ రెడ్డిగారు అడుగుతున్నారు. ఇలాటి మాటలకుకూడా తలా ఒక నిర్వచనమూ ఉండటం హాస్యాస్పదం. సాధారణంగా విప్లవాలు తిరుగుబాటు నుంచే పుడతాయనుకుంటాం. అన్ని తిరుగుబాట్లూ విప్లవ స్థాయిని అందుకోలేవు. తిరుగుబాటు సాంఘిక పరిస్థితుల లోనూ, ఉత్పత్తి విధానాలలోనూ, ఉత్పత్తి సంబంధాలలోనూ మౌలికమైన మార్పులను సాధించినప్పుడు విప్లవం అనిపించుకుంటుంది. శ్రీకాకుళంలోగాని. నక్సల్‌బరీలోగాని ఇటువంటి పరిణామం జరగలేదన్న ఉద్దేశంతో అక్కడ జరిగినవి విప్లవాలు కావన్నాను నేనిలా అనుకోవటంలో ప్రాముఖ్యత ఏదన్నా ఉంటే అది రాజకీయమైనదే కావాలి. కాని ఒకటి చెప్పగలను. నాకు తిరుగుబాట్లమీద కూడా అంతులేని గౌరవం ఉంది. విప్లవాలుగా పరిణితి చెందలేకపోయినంత మాత్రాన నేను తిరుగుబాట్లను తక్కువ చూపు చూడను.

—కొడవటిగంటి కుటుంబరావు

అన్యాయవాది

శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ సీరియల్ నవలల గురించి సీరియస్‌గానే రాశారు సాహిత్యం సమాజానికి అద్దం పట్టాలనుకున్నప్పుడు, వాస్తవాన్ని తలకిందులు చేసే నవలల్ని ఆయన దుయ్యబట్టడంలో తప్పులేదు. కాని నవలల తారతమ్య పరిశీలన చేసేటప్పుడు విమర్శలో ఆయన కొన్ని వింతపోకడలు పోయారు.

నవల సాంతం చదవకుండానే సమీక్ష. విమర్శరాసేవారి కోవకు చెందరు శ్రీ 'పురాణం'. కాని ఎందువల్లనో స్త్రీ రచయితల రచనలను కొన్నిటిని విమర్శించేటప్పుడు మాత్రం ఆయనలో దూకుడు కనిపిస్తుంది.

కౌసల్యాదేవి, సులోచనారాణి నవలల్లో మౌలికమైనభేదాన్ని చూపించాలని తాపత్రయపడ్డారు పురాణం! నిజానికి యీ యిద్దరి రచనల ప్రభావం ఒకేరకమైన మత్తుని, చెడుని కలిగిస్తోంది. కాని సులోచనారాణిని విమర్శించేటప్పుడు చాలా మెతక దనాన్ని చూపించారు 'పురాణం'— 'ప్రేమ కథలకు రాణి' అంటూ. "కథానాయకి భుజంమీద కథానాయకుడు చెయ్యి వెయ్యడు" అన్నారు ఆయన. ప్రాచీన నాటకాల మూసలో ధీరోదాత్తంగా, ధీరలలితంగా వుండే నాయకుడు (సులోచనారాణిగారి) బొమ్మ మినహా మరేమీలేని బొమ్మలాంటి అబలా నాయికను తనబలమైన చేతులతో కావిలించు కుని ముద్దెట్టేసుకుని వెళ్ళిపోతాడు. అలాంటి సన్నివేశాల కోసం వెర్రెత్తిపోతూ, ఆతురతగా ఎదురుచూస్తూంటారు పాఠకులు— ఆ సీరియల్స్ రెండేసేళ్లు నడిచినా. సామాజిక దృక్పథం కించిత్తుకూడా వుండదు యీబాపతు రచనల్లో. ఒక్కపాత్రకూడా సహజంగా వుండదు.

కాని రంగనాయకమ్మగారికి సామాజిక దృక్పథం వుంది. ఆమె పాత్రలు నేల విడిచి సాముచెయ్యవు. స్త్రీరచయితలలో తీవ్రమైన ఆవేదనతో రాసేది ఆమె ఒక్కతే. అయితే యీ ముగ్గురు రచయిత్రుల గురించి 'పురాణం' చెప్పేటప్పుడు సమగ్రమైన దృష్టి చూపించలేకపోయారు.

'మనవిచేస్తూనే చాడీచెప్పినట్లు' రంగనాయకమ్మగారి నవలల్లో 'సోషల్ప్రొటెస్టు ప్రధానంగా వుందం'టూనే, "దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకునే దృక్పథంవుంద"నీ, "సాధారణ గృహిణి ఇన్ని నవలలు రాయడం సాధ్యమయే విషయం కాద"నీ ఎత్తి పొడిచారు. విమర్శించడమంటే నిందలుమాత్రమే వెయ్యటం కాదుగదా?

విద్యావంతుల ఇళ్ళల్లోకూడా సాంఘికంగా స్త్రీ ఎలా అణగద్రొక్కబడుతోందో సమగ్రంగా చిత్రిస్తూనే, ఆ సమస్యా పరిష్కారం మగవాడిలోని మార్పుతో ముడి పెట్టడం రంగనాయకమ్మగారి అవగాహనలో లోపం. దోపిడీ అనే పునాదిమీదే యీ సమాజవ్యవస్థ నిర్మాణమయిందని ఆమె స్పష్టంగా గ్రహిస్తే ఆమె రచనల్లో వున్న ఒక్కలోపమూ తీరిపోతుంది. దేవుడు, మతం, ఆస్తిలాంటివాటితో ఆమె రాజీపడదు. మధ్యతరగతి ఆడవాళ్ళలో తిరుగుబాటు కల్గించే ప్రయత్నం చేస్తుందావిడ. ఆవిడరచన

లన్నీ సరిగా పరిశీలించకుండా, 'స్వీట్ హోం'లో మాత్రం వున్న కర్టెన్ లెక్చెర్లను అన్ని రచనలకు వర్తింపచేయడం సబబుకాదు.

మధ్యతరగతి జీవితాన్ని వాస్తవికతతో పరిశీలించే ద్వివేదుల విశాలాక్షినిగాని, చైతన్యం తొణికిసలాడే నవలలురాస్తున్న వాసిరెడ్డి సీతాదేవినిగాని 'పురాణం' పేర్కొననే లేదు.

రచయిత న్యాయవాది అయితే విమర్శకుడు న్యాయమూర్తి. కాని శ్రీపురాణం సుబ్రహ్మణ్యశర్మగారు సమకాలీన సాహిత్యచరిత్రరాస్తూ ఎందువల్లనో అన్యాయవాదిగా మారిపోయారు.

—కృష్ణాబాయి

పాబ్లో నేరూడా

జనవరి 'సృజన' జనవరి—మార్చి 'వేకువ'లో పాబ్లోనేరూడాను గురించి రెండు వ్యాసాలు కె. వి. గారివి ప్రచురించబడ్డాయి, అయితే రెండూ పరస్పర విరుద్ధాలు, సృజనలో నేరుడాను విమర్శించితే వేకువలో పొగిడారు కె. వి. గారు. ఈ మార్పు ఎందుకు జరిగింది. నేరుడాలో మార్పు వచ్చిందా? లేక కె. వి. లో మార్పు వచ్చిందా? అదీ కాకపోతే రెండు పరస్పర విరుద్ధ వ్యాసఅస్త్రాలు కె వి.గారి అమ్ముల పొదిలో ఉన్నాయా? ఏమో! వ్రాసింది కె. వి. గారు కాబట్టి ఆయనే చెప్పాలి. చెప్తారామరి!

రవి

సమాధానం:

'వేకువ', 'సృజన' లలో ప్లేబోనేరుడా గురించి నేనురాసిన వ్యాసాలనుగురించి పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు గుంటూరునుంచి రవి చేసిన విమర్శ నిరాధారమనుకొంటున్నాను. మొదటరాసిన వ్యాసం పూర్తిగా biographical. దాన్నే 'వేకువ'కుపంపాను. అది రాశాక కొంతకాలానికి, చాలా కొద్దికాలానికే మరొక వ్యాసంరాస్తే బాగుంటుందని అందులో నేరుడా ప్రస్తుత స్థితిని విమర్శ చేస్తే మొదటిదానికి సమగ్రత చేకూరినట్లౌతుందని అనుకొని సృజనకు వ్యాసం రాసి పంపాను. నిజానికి యివి రెండూ ఒకే వ్యాసంలోని రెండు భాగాలనుకొన్నా తప్పులేదు.

నేరుడా గొప్పదనం గురించి నాకెన్నడూ, ఇప్పుడుకూడా చిన్నచూపు లేదు. నిస్సంశయంగా నేరుడా మహాకవి. సోవియట్ యూనియన్‌ను అభిమానిస్తున్నాడని మాత్రమే బాధపడాలిగాని మరొకందుకు ఎందుకూ కాదు. అందుచేత నా వ్యాసాలు రెండూ పరస్పర విరుద్ధంగా ఉండే అవకాశంలేదు. Positive and Negative aspects రెండూ వేర్వేరు వ్యాసాలలో చర్చింపబడ్డాయి.

బంగ్లాదేశ్ - జాతుల సమస్య

తూర్పు పాకిస్తాన్‌లో భారతసైనిక జోక్యంను జాతి యావత్తు ఒక్కటిగా సమర్థిస్తున్న సమయంలో భారతదేశం వర్తమాన రాజకీయ సమస్యలపై 'బంగ్లాదేశ్' ప్రభావం ఎలా వుంటుందో పరిశీలించవలసిన అవుసరం యెంతైనా కలదు.

చారిత్రకంగా పరిశీలించిన యెడల అవిభక్త భారతదేశంలోని ప్రాంతాలుగా అవిభక్త పాకిస్తాన్ సార్వభౌమాధికార ప్రాంతాలుండేవి. వివిధ జాతుల సమైక్య స్వరూపం నాటి భారతదేశం. ప్రాదేశిక, భాషా, సంస్కృతుల, భావసమైక్యత ఒక జాతికి నిర్దేశికాలుగా వుంటాయనవచ్చు. ఫ్యూడల్ రాజరిక వ్యవస్థనుండి నేటివరకు, ఆయా జాతులు స్థిరమైన రాజ్యాధికారాన్ని నెరపలేక జాతీయ ప్రభుత్వములు యేర్పడలేదు. ఆనాడు జాతులు చిన్నాభిన్నమై వుండేవి. బ్రిటీషు వలస పాలకుల పుణ్యమా అని కేంద్రీకృత రాజ్యాధికారం కల్గిన "భారతదేశం" యేర్పడినది. అప్పటినుండియే "భారతజాతి" ఉద్భవించినదని చెప్పవచ్చు.

అయిననూ బ్రిటీషువారు భారత దేశంలోని వివిధ జాతులను విభజించియే వుంచారు. పరిపాలనా సౌలభ్యం కొరకు యేర్పాటుగావించిన రాష్ట్రాలలో ఆయా జాతులను చీల్చి వుంచారు. తెలుగుమాట్లాడే వారిని, మద్రాస్, ఒరిస్సా, మధ్యప్రదేశ్, మైసూరురాష్ట్రాలలో వుంచి ఆంధ్రజాతిని ఛిన్నాభిన్నం చేసారు. మత ప్రాతిపదికపై బెంగాల్ జాతిని రెండుగా చీల్చుట వుదాహరణలుగా తీసుకోవచ్చును.

వలస పాలకుల 'విభజించి పాలించు' సిద్ధాంతం ఫలితంగా జాతులు నిర్వీర్యమైనవి. మతవైషమ్యాల ఫలితంగా భారత్ - పాకిస్తాన్‌లుగా భారతదేశం విడిపోయినది. భారత - పాకిస్తాన్‌ల అస్థిరతలు యిచట చూడవచ్చు.

మత ప్రాతిపదికగా యేర్పడిన పాకిస్తాన్‌కు జాతీయస్వభావం శూన్యం. 'ముస్లిం' మతంకల్గిన అనేక జాతుల ప్రభుత్వాలను మనం ప్రపంచపటంలో చూస్తున్నాం కదా? ఒకజాతి మనుగడకు మతం "గీటురాయి" కాదని "బంగ్లాదేశ్" రుజువుచేసింది. ప్రజాస్వామ్య కేంద్రీకృత ప్రభుత్వంలోగాని, కేంద్రీకృత నియంతృత్వ ప్రభుత్వములోగాని ఆయా జాతులకు స్వయం పరిపాలనాధికారాలు నిరాకరించబడినాయి.

భారతదేశంలోని జాతీయ భూస్వామ్య బూర్జువావర్గం కాంగ్రెస్ వెనకాలవుండి అధికారాన్ని చెలాయిస్తున్నది, భారత రాజ్యాంగం- ఆవర్గప్రయోజనాలను మాత్రమే కాపాడగలదు. ప్రజలు యెన్నోత్యాగాలు చేసిన తరువాతగాని భాషాప్రయుక్త రాష్ట్రాలు

యేర్పాటుగాలేదు. కేంద్రీకృత నియంతృత్వ పాలనలో భాషారాష్ట్రాలు తమ జాతీయ ప్రయోజనాలను నెరవేర్చజాలవని అనుభవం రుజువుచేసింది రాష్ట్రాలకు రాష్ట్రాలకు మధ్య అనేకమైన వైరుధ్యాలున్నాయి. రాష్ట్రాలమధ్య ఆర్థిక వ్యత్యాసాలు అనివార్యమైనవి.

కేంద్రలో స్థానికభాషలకు తగిన గుర్తింపులేదనే భావం నానాటికి తీవ్రమౌతోంది. హిందీభాషా ఉన్మాద ఉద్యమం దానికిప్రతిగా హిందీ వ్యతిరేకోన్మాదం వుద్యమ రూపం దాల్చినది. ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేక విదర్భ, కొంకణ లాంటి అనేక ప్రాంతీయతత్వ ఉద్యమాలు కూడా పుంజుకుంటున్నాయి.

బూర్జువావర్గం తమ అంతర్గత వైరుధ్యాల ఫలితంగా, జాతుల మధ్య వైరుధ్యం, మతాలమధ్య వైరుధ్యం, ప్రాంతాల మధ్య వైరుధ్యం, ప్రజలమధ్య వైరుధ్యం సృష్టించి కలకాలం మనగల్గటానికి ప్రయత్నిస్తుంది.

కేంద్రంలోని పాలకవర్గం. తమ, వర్గ, ముఠా రాజకీయ ప్రయోజనాలకు భంగం కల్గినప్పుడు, ఆర్థిక దిగ్బంధనం, రాజకీయవత్తిళ్ళు కలుగజేసి, రాజ్యాంగానికి సమయానుకూలంగా భాష్యం చెప్పి కలంపోటుతో రాష్ట్రాల్లో యెన్నికైన ప్రజాప్రభుత్వాలను కూలదోస్తుంది. కేరళ, బెంగాల్ అనుభవం. ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, పంజాబు, హర్యానా మొదలైన రాష్ట్రాలలోని మంత్రివర్గ పతనాలు కీలుబొమ్మ ప్రభుత్వాలు యేర్పాట్లు, మనకు యేమి తెలియజేస్తున్నాయి?

కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార నినాదం చల్లారలేదు. నాగా, మిజోలు, జాతీయ స్వయం ప్రతిపత్తి పోరాటాలు సాగుతునేవున్నాయి. ప్రత్యేక శిక్కుస్థాన్, ద్రవిడస్థాన్, తమిళనాడ్, కేరళ లాంటి అనేకరకాల నినాదాలు వినిపిస్తున్నాయి.

ఒకజాతిపై మరియొకజాతి, ఒక ప్రాంతీయులను వేరొక ప్రాంతీయులు, "కేంద్రీకృత ప్రజాస్వామ్యం" చాటు చేసుకొని దోచుకుంటున్నారని, పెత్తనం చేస్తున్నారనే భావం ప్రబలమౌతోంది. యథార్థం కాదా?

యిన్ని వైరుధ్యాల మధ్య వివిధ జాతులుకల్గిన భారత దేశ సమగ్రసమైక్యత యెలా సాధ్యమౌతుంది?

"బంగ్లాదేశ్" అవతరణ ఫలితంగా వంగప్రజలలో ఆశలు రేకెత్తుట సహజం. పదిన్నరకోట్ల బెంగాలీలను వేరుచేసి వుంచుట సాధ్యమా? పశ్చిమ పాకిస్తాన్‌లోకూడా జాతీయ విముక్త పోరాటాలు బలపడుతున్నాయి. వాటికి మనసౌహార్దత యివ్వగల్గినప్పుడు భారత దేశంలో వెల్లివిరిసే జాతీయ విముక్తి ఉద్యమాలపై మనవైఖరి యేమిటి?

ప్రతి భారతీయుడు ప్రతి రాజకీయపార్టీ వర్తమాన రాజకీయ పరిస్థితులపై తమ తమ వైఖరులను నిర్ణయించవలసిన సమయం ఆసన్నమైనదని భావిస్తాను. జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని గుర్తించే జాతుల స్వయం ప్రతిపత్తిగల నూతన సమాఖ్యలు అనివార్యం కాదా?

—"ఒక పాఠకుడు"

ఇండియా-చైనా-బంగ్లాదేశ్

'హిందూ' దినపత్రికలో రా. వి. శాస్త్రిగారు రాసిన ఉత్తరం 'సృజన'లో కూడ చూసిం తర్వాత ఈలేఖ రాస్తున్నాను. రా. వి. శాస్త్రిగారు తొందరపడ్డారేమో నని పిస్తుంది.

'బంగ్లాదేశ్'లో నియంత యాహ్యాఖాన్ రాక్షస కృత్యాలను, హింసాకాండను గర్హించవలసిందే. 'బంగ్లాదేశ్' ప్రజాపోరాటాన్ని గుర్తించవల్సిందే. ఇక్కడ రష్యాపై గాని, చైనాపైగాని గుడ్డివ్యామోహం ఎవరికీ వుండాల్సిన పనిలేదు. ఈ సందర్భంలో సోషలిస్టు దేశాలకు కూడ జాతీయ ప్రయోజనాలున్న సంగతి విస్మరించకూడదు.

జాతీయ ప్రయోజనాలను కాపాడుకోడం కోసం గావచ్చు, వ్యూహం, ఎత్తుగడల రీత్యాకావచ్చు. 'బంగ్లాదేశ్'పై చైనా వైఖరి నచ్చకపోయినంత మాత్రాన ఒక సోషలిష్టు దేశంపై అబద్ధాల్ని రుద్దాల్సిన పనిలేదు.

వియత్నాంలో అమెరికా చర్యలను ఖండిస్తూ చైనా ఐ. రా. స. లో ఏతీర్మానమూ ప్రతిపాదించ లేదంటున్నారు, ఇది నిజంకాదు.

See the following lines in a Bulletin issued by China Embassay. New Delhi Nov. 17, 1971.

"The U. S. Govt's armed aggression against Vietnam. Combodia and Laos and its encrroachment upon the territorial integrity and Sovereigrty of these three countries have aggrovated tension in the Far East ..... the chinese Govt. and people firmly support the peoples of the three countries of indo china in their war against U. S. aggression and for national Solvation and firmly support the joint decleration of the summit conference of the indo chinese peoples and the 7 point peace proposal put forward by the provisional Revolutionary Govt. of the Republic of South Vietnam-

The U. S. Govt. should withdraw immediately and unconditionally all its armed forces and the armed forces of its followers from the three countries of indo-china".

—Chiao vuan - hua:
—Chairman of Chinese delegation
at General Assembly of U. N. O.

దీనిప్రకారం వియత్నాంలో అమెరికా చర్యలను చైనా ఖండించినట్లేగదా.

—జైరామ్

రావిశాస్త్రిగారి 'వేతనశర్మ' కథపై బలరామమూర్తిగారి విమర్శకు సమాధానం

శ్రీ ఏటుకూరి బలరామమూర్తిగారు రావిశాస్త్రిగారి 'వేతనశర్మ' కథ చదివి ఉలిక్కిపడ్డారు. వెంటనే భుజాలు తడుముకొని వాపోయారు. (విశాలాంధ్ర 21-11-1971)

'వేతనశర్మ' కథలో ఉద్యోగుల సమ్మె వెల్లువను అపహాస్యం చేశారని, రావిశాస్త్రిగారు సమ్మెలను విప్లవ వ్యతిరేకశక్తులుగా చిత్రించి, విప్లవశక్తుల సమైక్యతకు ద్రోహం చేశారని విరుచుకుపడ్డారు. ఈ కథద్వారా రచయిత చెప్పదలచిం దేమిటి? పత్రికలకు కనువిప్పు కలిగించి వారిలో జాగృతి, చైతన్యం రంగరించి పోయాలని చూశారు. రావిశాస్త్రిగారు తప్పుపట్టింది గుమాస్తాలను కాదు. 'వేతనశర్మ'ల్లా తయారైన నేటి నాయకత్వాన్ని, అసెంబ్లీ దర్బారులో అకుపచ్చని సీట్లకై పోటీపడుతూ, చెట్టుపేరు చెప్పుకుని విప్లవానికి వెన్నుపోటు పొడిచి రంగు మార్చకుండా దిక్కుమార్చిన పార్టీలను ఎండేశారు. అందుకే బలరామమూర్తిగారికి అంత కడుపుడుకు.

అలహాబాద్‌లో వెనకటికి ఒక హిందీపత్రిక ట్రేడ్ యూనియన్ అంటే వ్యాపార సంఘం అని అనువాదం చేసిందట. తథాస్తు! మనదేశంలో ఈ పార్టీల పుణ్యమా అని కార్మిక సంఘాలు అచ్చం అలాగే తయారయాయి. అందుకే సమ్మెలను గురించి మార్క్సు 1865 లో ఏమన్నాడో చూద్దాం. "They (workers) ought not to forget that they are fighting with effects, but not with the causes of those effects; but they are retarding the downward movement, but not changing its direction; that they are applying palliatives, not curing the malady. Instead of the conservative motive: 'A fair day's wages for a fair day's work!' they ought

to inscribe on their banner the revolutionary watch word: **'Abolition of the wage system'**.

ఇవి కార్మికులు మర్చిపోకూడని మాటలు. వారు ఫలితాలతోనే కుస్తీపడుతున్నారు. కాని మూలకారణాలతో కాదు. దిగజారిపోకుండా ఆపుతున్నారేకాని దిక్కు మార్చడం లేదు; తాత్కాలిక వుపశమనం కోసం మందువేస్తున్నారే కాని రోగనిర్మూలనకు ఏమీ చేయడంలేదు. 'పనికి సరిపడ జీతం' అనే పాతమాటను వదిలి 'జీతాల పద్ధతి అంతరించాలి' అని విప్లవ పతాకం ఎగరెయ్యాలి.

రష్యా విప్లవ రథసారథి లెనిన్ *1902* లో ఏమన్నాడో చూద్దాం. 'The economic struggle of the workers is very often connected (although not inseparably) with the bourgeoisie politics, clerical politics." కార్మికుల ఆర్థిక పోరాటాలు బొత్తిగా బూర్జువా రాజకీయాలు, గుమాస్తా రాజకీయాలు.

మార్క్సు, లెనిన్‌లు అనాడే యీ ప్రమాదాన్ని పసికట్టారు. కనుకనే అంత నిశితంగా హెచ్చరించ గలిగారు. రావిశాస్త్రిగారికి ఆయనే అన్నట్టు మార్క్సిజాన్ని గురించి పుస్తకజ్ఞానం లేకపోవచ్చు. బలరామమూర్తిగారు మంచి మార్క్సిస్టు మేధావి అందుకే అంటారు—

నవకాయ రుచులన్ని
నాలుకెరుగును గాని
అడ్డబిడ్డము తిరుగు
తెడ్డు ఏ మెరుగు?

—చలసాని ప్రసాద్

ప్రత్యేక తెలంగాణా - స్వాధీన్ బంగ్లాదేశ్

పై విషయమై నేను ఏప్రిల్, 71 నెలలో వివరణకై పంపిన లేఖను 'సృజన' మేనెల సంచికలో ప్రచురించలేదు. మేనెల సంచిక చూసి, మరొకసారి నా లేఖను మరికొన్ని చేర్పులతో పంపినా ప్రచురించలేదు. ఆఖరుకు డిశంబరు 71, సంచికలో నా మొదటి లేఖను ప్రచురించారు. దీనినిబట్టి 'సృజన' వైఖరిని ఏవిధంగా తీసుకోవాలి? నా లేఖకు జనవరి 72, సంచికలో ఆర్. జి. ఆర్ (వరంగల్) గారి మార్క్సిస్టు దృక్పథమనే జవాబు చూశాను.

ఆ సమాధానంలో దోపిడీని వర్గదోపిడీ అనీ, ప్రాంతీయ దోపిడీ అని చెబుతూ— ప్రాంతీయ దోపిడీకి తెలంగాణా అట్టడుగు ప్రజలతో సహా పాల్గొన్న కారణంచేత

మేధావులు కూడ సానుభూతి చూపారన్నారు-. అటువంటిదాన్ని నేనేదో చిన్నచూపు చూస్తున్నాననుకొని, అలా చేయరాదన్నారు. ఏ ఉద్యమమైనా అట్టడుగు ప్రజలుకూడ పాల్గొన్నారన్న కారణం చేతనే అది మార్క్సిస్టు పరిధిలోకి రాదు. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి బ్రిటిషువాళ్ళు వెళ్ళిపోతే మనకష్టాలన్నీ తీరుతాయని చెప్పబట్టి ప్రజలంతా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం వచ్చినా కొంతమంది కమ్యూనిష్టులు మనకు నిజమైన స్వాతంత్ర్యం రాలేదు" అని అంటే ఆ ఉత్సవాలు జండా వందనాల హడావిడి చూసికూడ వీళ్ళు ఇల్లాగంటున్నారు.... "స్వాతంత్ర్యం వచ్చినా కళ్లుండీ చూడలేని గుడ్డివాళ్ళని" తిట్టారు- (ఆర్థిక స్వాతంత్ర్యం లేనిదే నామమాత్రపు రాజకీయ స్వాతంత్ర్యం వల్ల ప్రయోజనం ఉండదు.) ఇప్పుడిన్ని పంచవర్ష ప్రణాళికల తరువాత అది అనుభవంలోకి వచ్చింది. అయినా గుణపాఠాలు తీసుకోలేనివాళ్లు మెజారిటీగానే ఉన్నారు.

ఆ విధంగానే ప్రత్యేక తెలంగాణావల్ల తెలంగాణా ప్రజల సమస్యలు తీరి సుఖ పడతారని ప్రజలను నమ్మించితే అట్టడుగున ఉన్నవాళ్లుకూడ పాల్గొన్నారు. పాల్గొం టారు. అంతమాత్రం చేత దాన్ని సరియైన ఉద్యమమని ఈ సందర్భంలో ఎల్లాగ అనుకోమంటారు? ప్రజలందరూ పాల్గొనడం గీటురాయిగా పెట్టుకుంటే ద్రవిడస్థాన్ కావాలనే డి. యం. కె. ఉద్యమం, మహారాష్ట్రలో శివసేన లేవదీసిన దక్షిణాదివారి నందర్నీ తరిమేసే ఉద్యమం సరియైనవని అంగీకరించాలి కదా! ఆంధ్రరాష్ట్రం ఏర్పడినా, ఇక్కడి పరిశ్రమలలో, తమిళులు మళయాళీలు, ఇతరులు కీలకస్థానాల్లోను ఇతరత్రా గణనీయమైన సంఖ్యలో కొనసాగుతున్నారు. స్థానికులకు ఉద్యోగాలు సరిగా ఇవ్వడంలేదని ఆందోళన ఉన్నది. ఇది ఏప్రాంతీయదోపిడి క్రిందకువస్తుంది? ప్రత్యేక తెలంగాణా వస్తే తెలంగాణావారు ఇంక ఎక్కడా ఉద్యోగాలు చెయ్యరా? ఇతరులను తెలంగాణాలో పనిచేయనియ్యరా? ముల్కీల పేరున ఇతరులెవరైనా పర్వాలేదా? మిగతా రాష్ట్రీయులు తెలంగాణాలో భూములు కొనకుండా పరిశ్రమలు పెట్టకుండా అడ్డుకో గలరా? భాషా ఐక్యతవల్ల జరుగుతున్నదనుకునే దోపిడీకి విరుగుడు ప్రాంతీయ ఐక్యత అనుకొందామా? ముల్కీ నిబంధనలతో నిరుద్యోగం రూపుమాసి పోతుందని తెలం గాణా ఉద్యమంలో చెప్పకపోయినా, ఆ ఉద్యమ ఫలితమే ముల్కీనిబంధనలు ప్రత్యేక బడ్జెట్ వగైరాలు- మనదేశంలో వెనకబడి ఉన్న తక్కిన రాష్ట్రాలు ఏ ప్రాంతీయ దోపిడీకి కళ్ళు తెరవకుండా ఉన్నాయో తెలుసుకోవాలని ఉంది.

ఈ సందర్భంలో చెరబండరాజు గారి 'రాజధాని లేఖ' [దిక్సూచి పుస్తకం పేజి 75] మరొకసారి అధ్యయనం చేయమని సలహా।

పడమటి బెంగాల్లో విప్లవ జ్వాలలు రగుల్కొన్నట్టు తూర్పు బెంగాల్లోనూ రగుల్తాంటే, ఆ రూపంలో రెండూ ఏకం కావాలన్న విజన్కి ... తెలంగాణాలోను శ్రీకాకుళంలోనూ రగుల్తున్న అదే జ్వాలలు ఏకమవడం ఇష్టం లేనట్టున్నది। ఆ జ్వాలలు మండించేవారు ప్రత్యేక రాష్ట్రాలను కోరడం లేదు. వర్గదోపిడీని అంత మొందింపదలచారు. అధికారం శ్రామికవర్గం చేతిలోకి తీసుకోదలచారు. తెలంగాణా లోను బంగ్లాదేశ్లోను లేక మరెక్కడయినా భూస్వామ్య— పెట్టుబడిదారీ— నిరంకుశ— ఉద్యోగాధినేతలే అసమానతలకు కారణం. ప్రజలలోని అసంతృప్తిని అజ్ఞానాన్ని ఆధారం చేసుకొని ధనికవర్గాల ప్రాబల్యానికి, అధికార పంపిణీకిచేసే ప్రాంతీయ విభజనకు ప్రక్కతాళం వేయడం మార్క్సిజమని అసలు అనిపించుకోదు. పైగా ఇది వర్గపోరాటాలను తప్పుదోవ పట్టిస్తుంది. శ్రమజీవుల మధ్య చీలికతెచ్చి పాలకవర్గాలకు తోడ్పడుతుంది.

బంగ్లాదేశ్లో విప్లవ జ్వాలలు రేగాయన్నది వాస్తవమే అయినా బంగ్లాదేశ్ను విముక్తం చేసిన భారతీయ సైన్యాలవల్ల అక్కడ గెరిల్లాలు (పశ్చిమ బెంగాల్లోవలె) పెనంమీద నుండి నిప్పుల్లో పడినట్టు అవలేదుకదా। అని ఆలోచించాలి।

ప్రాంత— మత— భాషా మనస్తత్వాలలో దేనికీ గురికాకూడదని ఆర్.జి.ఆర్. గారన్నారు. కాని భాషపేర- మతంపేర- ఐక్యమత్యంపేర దోపిడీ జరుగుతున్నదను కుంటే (ఇతర భాషలవారివల్ల ఇతర మతాలవారివల్ల జరిగే దోపిడీ పర్వాలేదు) ప్రజలంతా పాల్గొంటారు కనుక.... ఆ పోరాటాన్ని ప్రాంతీయ దురభిమానంగా చిన్న చూపు చూడకూడదనడం; అది విప్లవంలో ఒకమెట్టుగా భావించడం చరిత్రనుండి గుణపాఠాలు తీసుకోలేని తమ వాదాన్ని తామే ఖండించుకునే 'సృజనా'త్మక మార్క్సిస్టులకే చెల్లుతుంది.

ఈ ఉద్యమాలలో ఏవర్గం చురుకుగా పాల్గొని నడుపుతోంది? ఏవర్గం అధికారం లోకి వస్తుంది? దాని ఫలితాలు ఎలాగ ఉంటాయి? అనే అంచనా లేకుండా, ప్రాంతీయ దోపిడీకి వ్యతిరేకమనో, సామ్రాజ్యవాద వ్యతిరేకమనో (నియో — కలోనియలిజమ్ రోజుల్లో) అంతవరకు ఉన్నదానికంటె ఇది అభివృద్ధికరమైనదనో.... కాకుండా, దోపిడీవర్గాలన్నింటికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలుగా మారడానికి ప్రయత్నించాలి. అంతేగాని ప్రజలింకా కళ్లుతెరవలేదని పాలకవర్గాలు, ప్రాంతీయ ధనికవర్గాలు వాళ్ళ

స్వప్రయోజనాలకై ప్రజలలో కలిగించే, అభిప్రాయాల ప్రవాహంలో పడికొట్టుకు పోవడం నిజమైన మార్క్సిస్టుల పనికాదు.

ఇట్లు,
"ఒక పాఠకుడు"
విశాఖపట్నం, 11—1—72.

[ఈ పాఠకుని రెండో ఉత్తరం మాకు చేరలేదు. మొదటి ఉత్తరమూ, యీ ఉత్తరమూ వేయగాలేని అభ్యంతరం మాకు, ఆ ఉత్తరం వేసివుంటే ఏమొచ్చేదో, ఆ ఉత్తరంలోని విషయాలు ఆయనకు మాత్రమే తెలిసిన పాఠకునికే తెలియాలి. ఎప్పటికప్పుడు ఎదురయ్యే ఎడిటింగ్ సమస్యలవల్ల ఏప్రిల్‌లో వేయాల్సిన ఉత్తరం డిసెంబర్‌దాకా వేయలేక పోయినందుకు మాత్రం విచారిస్తున్నాం. సంపాదకుడు–]

[అనివార్య కారణాలవల్ల యీ సంచికలో నవీన్ నాటిక 'వ్యవస్థ' ప్రచురించ లేకపోయాం. సంపాదకుడు–]

Statement about ownership and other particulars about newspaper

SRJANA

1.	Place of publication ...	... Warangal-1.
2.	Periodicity of its publication ...	... Monthly
3.	Printer's Name ...	... Varavara Rao
	Nationality ...	... Indian
	Address ...	... 4/729 Kumarpalli Hanamkonda Warangal-1
4.	Publisher's Name ...	... Varavarā Rao
	Nationality ...	... Indian
	Address ...	... (As Above)
5.	Editor's Name ...	... Varavara Rao
	Nationality ...	... Indian
	Address ...	... (As Above)
6.	Names and addresses of individuals who own the newspaper add partners or shareholders holding more than one percent of the total capital.	

I, Varavara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/- Varavara Rao,
Publisher.

SRJANA Telugu Monthly March '72 Regd. No. H. 1088

'పుస్తకం హస్తభూషణం'

అన్నారు పెద్దలు!

మీకే పుస్తకం

కావలసినా

మమ్మల్ని

అడగండి!

...



నవోదయ పబ్లిషర్స్

విజయవాడ 2, గుంటూరు 2

84 Pages Re. 1/-